Postel No. MBN/08/2016-2018



పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతంలతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895


# వార్తాతరంగాలు


జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :294 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు మంగళవారం 17 ఫిబ్రవరి 2026 పేజీలు :12 వేల రూ5 /-


## ప్లాన్ బీలో కేటీఆర్..



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ సాధించిన ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, రాబోయే రోజుల్లో మరింత మెరుగైన ఫలితాల కోసం పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తామని ఆయన ప్రకటించారు.: సుమారు 700-800 వార్డుల్లో విజయం సాధిస్తామని ఆశించామని, ప్రస్తుతం 15 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించామని కేటీఆర్ తెలిపారు. మరో 37 చోట్ల హంగ్ ఏర్పడిందని, అక్కడ బీఆర్ఎస్ బలంగా ఉందని పేర్కొన్నారు. గద్వాల, వర్ధన్నపేట వంటి చోట్ల అధికారులు రీకౌంటింగ్ పేరుతో కాలయాపన చేశారని, అయినప్పటికీ కార్యకర్తలు వీరోచితంగా పోరాడారని కొనియాడారు.అధికార కాంగ్రెస్ పార్టీ డబ్బు, మద్యం, పోలీసు యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు.సింగరేణి ప్రాంతంలో అక్రమాలను అడ్డుకునేందుకు సీపీఐతో కలిసి పనిచేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐకి మద్దతు ఇస్తామని, ఈ మేరకు కూనంనేని సాంబశివరావుతో మాట్లాడినట్లు వెల్లడించారు.హంగ్ ఏర్పడిన చోట చైర్మన్ పీఠాల కోసం కాంగ్రెస్, బీజేపీలు లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటున్నాయని, బేరసారాలకు తెరలేపాయని విమర్శించారు.ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే, బీఆర్ఎస్ నుంచి వెళ్లిన 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని ప్రజలు బలంగా నమ్ముతున్నారని ఆయన పునరుద్ఘాటించారు.

## దక్షిణ తెలంగాణ ప్రాంతానికి మహర్దశ...!

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:**దక్షిణ తెలంగాణ ప్రాంతానికి మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వికారాబాద్- కృష్ణా రైల్వే లైన్ ప్రాజెక్టుపై కీలక అప్డేట్ వచ్చింది. ఈ లైన్‌కు సంబంధించిన డీపీఆర్ తాజాగా రైల్వే బోర్డుకు చేరింది. ఈ మేరకు అధికారులు కసరత్తు మట్నదలు పెట్టారు.తెలంగాణ ప్రజలకు గుడ్‌న్యూస్. త్వరలోనే కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి రానుంది. వికారాబాద్- కృష్ణా ప్రతిపాదిత రైల్వే ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక తాజాగా రైల్వేబోర్డుకు చేరింది. దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టును కీలకంగా భావిస్తున్నారు. రూ.2,750 కోట్ల అంచనా వ్యయంతో 130.28 కిమీ మేర దీన్ని రూపొందించారు. రైల్వేబోర్డు అనుమతి లభిస్తే ఈ ప్రాజెక్టు త్వరలోనే పట్టాలెక్కుతుంది.వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ ఎలైన్‌మెంట్ మార్పుచేర్పులతో ఖరారైంది. తొలుత దీనిని 120 కిమీ దూరం ఉంటే.. ఎలైన్‌మెంట్ మారాక 130.28 కి.మీ వరకు పెరిగింది. నిర్మాణ వ్యయం, భూసేకరణ ఖర్చులు - మిగతా3లో



## రూ.1,939.58 కోట్ల బోనస్ నిధులు చెల్లింపు

### రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త
### వరి బోనస్ బకాయిలను విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం
### పెండింగ్‌లో ఉన్న రూ.514.36 కోట్ల బోనస్ నిధులు విడుదల



రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్తను అందించింది. వరి బోనస్ బకాయి నిధులను విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న రూ.514.36 కోట్ల బోనస్ నిధులను విడుదల చేసింది. దీంతో 2.17 లక్షల రైతులకు ప్రయోజనం చేకూరనుంది.వరి రైతులకు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ బోనస్ ద్వారా 2025-26లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రెండు లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం కలగనుంది. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం, సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం వరి క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇస్తున్న విషయం తెలిసిందే. కనీస మద్దతు ధరకు ఈ రూ.500 అదనం. బకాయిల చెల్లింపుతో రైతులకు ఆర్థిక ఉపశమనం లభిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## తెలంగాణలో వలంటీర్ల వ్యవస్థ



**నిజామాబాద్, ఫిబ్రవరి 16:**యాసంగి పంట డిజిటల్ సర్వేను పూర్తి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువును చేరుకోవడానికి, తాత్కాలికంగా వాలంటీర్లు, ప్రైవేట్ సర్వేయర్లను నియమించాలని నిర్ణయించింది.రాష్ట్రవ్యాప్తంగా, 10,621 గ్రామాలలో 19.469 మిలియన్ల సర్వే నంబర్లు - మిగతా3లో

## తెలంగాణలో కమలం పొత్తుల ప్లాన్...

### ఏపీ వ్యూహం తప్పదా..!

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:**దాదాపు గత ఆరేళ్ల నుంచి తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలోపేతం అవుతుంది అంటూ ఆ పార్టీ నాయకత్వం చెప్పే ప్రయత్నం చేస్తూనే ఉంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క అసెంబ్లీ సీటు మాత్రమే గెలుచుకుని ఆ మరుసటి ఏడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఏకంగా నాలుగు ఎంపీ స్థానాలు గెలుచుకుంది ఆ పార్టీ. 2023 ఎన్నికల్లో అసెంబ్లీలో పర్వాలేదు అనిపించిన బిజెపి ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో ఏకంగా ఎనిమిది స్థానాలు గెలుచుకుంది. దీంతో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితికి ఊహించని దెబ్బ తగిలిందనే చెప్పాలి. ఇక ఆ తర్వాత నుంచి భారతీయ జనతా పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో



పెద్దగా ప్రభావం చూపించలేకపోతోంది.గత ఏడాది జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో - మిగతా3లో

## సీఎం గారూ.... మీరు మొదలుపెట్టిన ఆటకు నేను ముగింపునిస్తా

### బీఆర్ఎస్, ఎంఐఎంతో కలిసి సీఎం, మంత్రులు చేసిన కుట్రలన్నీ తెలుసు
### కంటికి కన్పించని కుట్రలెన్నో చేశారు...
### బండి సంజయ్ రాజకీయం ముందు, బీజేపీ సైనికుల ఎదుట వాళ్ల కుట్రలు పటా పంచలైనయ్
### కొంతమంది చిటెకెలు వేసి ఇది రాజకీయం అని హేళన చేశారు...చివరకు ఏమైంది?
### చివరకు మీరు (సీఎం) సాధించిందేమిటి?
### మీ మధ్య జరిగిన చీకటి ఒప్పందాలేమిటి?
### రేవంత్ రెడ్డి....6 గ్యారంటీల అమలుపై ఇక రిక్వెస్టుల్లేవ్...
### మీ మెడలు వంచేదాకా పోరాడుతూనే ఉంటాం
### కరీంనగర్ వేదికగా బండి సంజయ్, బీజేపీ సైనికుల దమ్ము ఏందో చూపిస్తాం

**కరీంనగర్:**కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల కబడ్డీ ఆటలో... మీ అందరినీ ఓడించి బీజేపీ కప్ గెలుకుంది. ఈ వేదికగా ఇప్పుడు చెబుతున్నా... మీరు అనవసరంగా, అప్రజాస్వామికంగా నన్ను కెలికి ఆట మొదలుపెట్టారు. ఇక మీ ఆటకు నేను ముగింపు ఇస్తా"అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డికి అల్టిమేటం ఇచ్చారు. ఈరోజు కరీంనగర్ లో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం... నూతనంగా ఎన్నికైన మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కార్పొరేటర్లతో కలిసి మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డితోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటి కావడానికి కారణమేంటి? ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఫాంహౌజ్ వేదికగా కుట్రలు ఎందుకు చేశారు? ఎవరిపై మీ కోపం? కాంగ్రెస్ గెలిచింది 14 సీట్లు, ఎంఐఎం



గెలిచింది 3 సీట్లు, బీఆర్ఎస్ గెలిచింది 9 సీట్లు... అన్నీ కలుపుకున్నా 26 సీట్లు మాత్రమే. మ్యాజిక్ ఫిగర్ దాటనే లేదు. ఇవన్నీ తెలిసి ఎందుకు బీజేపీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. మీ చీకటి ఒప్పందాలేమిటి? మేయర్, డిప్యూటీ మేయర్ లకు అభినందనలు తెలియజేస్తున్న. కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండాను ఎగరేయాలని - మిగతా3లో

## కార్పొరేటర్ లు ప్రజలకు సేవ చేయాలి

### మూడేళ్ళ వరకు రాజకీయాలు మాట్లాడను
### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**నల్గొండ:**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోమవారం నల్గోండలో మీడియాతో మాట్లాడారు. నల్గొండ కార్పొరేషన్ పరిది లోని 48 మంది కార్పొరేటర్ లకు శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిల్ లో కాంగ్రెస్ పార్టీ కి మద్దతు ఇచ్చిన ఎంఐఎం పార్టీ కి ధన్యవాదాలన్నారు.మంత్రి మాట్లాడుతూ అధికారంలో ఉన్నన్ని రోజులు కార్పొరేటర్ లు ప్రజలకు సేవ చేయాలి. సమస్య ఉంటే మేయర్ దృష్టికి, నా దృష్టికి తీసుకురండి. వై ఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయినా ప్రజల గుండెల్లో ఉన్నారు. పెద్దోళ్ళు తినే బియ్యమే ఈ రోజు పేదోళ్లు తింటున్నారు. 5 వేల కోట్లు ఫ్రీ కరెంటు బిల్ కట్టినం. ఒక్కో కుటుంబానికి 50 వెలు కరెంటు బిల్ మిగిలించినమని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి అమితాబ్ బచ్చన్ ను బతికించిండు. అయన సహకారంతోనే నల్గొండ లో వైద్య సహకారం తీసుకుంటున్నాం.గత ఎంపీ గా నాకున్న పరిచయాలతో ఢిల్లీ నుండి నిధులు తీసుకొస్తా..అభివృద్ధి ఇప్పుడు మీ చేతుల్లో ఉందని అన్నారు.నగరం డామేజ్ కాకుండా 700 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నాం. మేయర్ తో సహకరించి



నల్గొండ నగర అభివృద్ధికి కలిసి పని చేయండి. కొట్లాడుకుంటే కెసిఆర్ పాలన లాగా అయితం..అన్ని పార్టీల కార్పొరేటర్ లకు సన్మానం చేసినం..పార్టీలకు అతీతంగా అభివృద్ధి కోసం అందరు సహకరించుకోవాలి.మూడేళ్ళ వరకు రాజకీయాలు మాట్లాడను... అభివృద్ధి మీదనే ద్రుష్టి పెడుతాం.సీఎం ఇంట్లో రివ్యూ మీటింగ్ ఉన్నా అజారుద్దీన్ తో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంటేనే అభివృద్ధి.. నాకు పదవులు ముఖ్యం కాదని అన్నారు.ఎవరికి ఏ సమస్య వచ్చినా నేను అండగా ఉంటా. గెలిచిన వాళ్లు అందరు అభివృద్ధి కి పాటు పడాలి. మూడేళ్లలో నేషనల్ అవార్డు నల్గొండ కార్పొరేషన్ సాదించాలి. నగరంలో తాగునీటి వ్యవస్థ సరిగా లేదు.. వెంటనే నీటి సరఫరా మెరుగు పర్చాలని అన్నారు.

# సంపాదకీయం

## కార్యకర్తలను విస్మరిస్తున్న పార్టీలు

రాజకీయ పార్టీల మనుగడ వెనుక ఆ పార్టీ కార్యకర్తల శ్రమ, త్యాగం ఆధారారపడి ఉన్నాయనేది నిర్వివాద అంశం. అదే రాజకీయ పార్టీలు ఇటీవలి కాలంలో కార్యకర్తలపట్ల అనుసరిస్తున్న వైఖరి అవకాశవాదాన్ని బట్టబయలు చేస్తూ ఉండడం గమనార్హం. ముఖ్యంగా ఈ పరిణామం ప్రాంతీయ పార్టీలలో నూటికి నూరు శాతం కనిపిస్తూ ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని రాజకీయాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈ విషయం సామాన్య మానవునికి సైతం సులభంగా అర్థమవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం, వైయస్ఆర్, కాంగ్రెస్, జనసేన పార్టీలు, తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రధానంగా ప్రాంతీయ పార్టీలుగా మనుగడ సాగిస్తున్నాయి. 1982లో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ 22 సంవత్సరాల 302 రోజులు, 2001లో ఆవిర్భవించిన తెలంగాణ (భారత) రాష్ట్ర సమితి పార్టీ 9 సంవత్సరాల 187 రోజులు, 2011 లో ఆవిర్భవించిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 5 సంవత్సరాలు అధికారం అనుభవించాయి. 2014లో ఆవిర్భవించిన జనసేన పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో గత 17 నెలలనుంచి ప్రధాన భాగస్వామిగా అధికారంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమి ఇంకా 3 సంవత్సరాలకు పైగా కచ్చితంగా అధికారంలో ఉంటాయి. కార్యకర్తల సమయం, డబ్బు, కుటుంబాల త్యాగ ఫలితంగానే ఈ విధంగా ప్రాంతీయ పార్టీలు అధికారాన్ని అనుభవిస్తూ సుదీర్ఘ కాలంనుంచి మనుగడ సాగిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. కానీ కార్యకర్తలు చనిపోయినప్పుడు సంబంధిత కుటుంబానికి పార్టీ తరపున ఇన్సూరెన్సు చెక్, కార్యకర్తకు లేదా వారి కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే వారికి సిఎం రిలీఫ్ ఫండ్ తప్ప కార్యకర్తలకు ఇతర లబ్ధి చేకూరుతున్నట్లు ఏమీ కనిపించడం లేదు. వాస్తవంగా రాజకీయ చదరంగంలో పావులుగామారి చురుకుగా ఉండే కార్యకర్తలు అనేక మంది కేసుల్లో ఇరుక్కుంటున్నారు. వారిని పట్టించుకునే నాథుడే లేక వారు అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. మరి కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. రాజకీయ వైరంలో ప్రాణాలు కోల్పోయిన కార్యకర్త కుటుంబ సభ్యులను సంబంధిత పార్టీ స్థానిక నాయకులు కలిసి తాత్కాలిక ఖర్చులకు కొద్దిగా డబ్బులు ఆ కుటుంబానికి ఇచ్చి పార్టీ మీకు అండగా ఉంటుందని సమయానుకూల హామీలు గుప్పిస్తారు. తరువాత ఎవరి దారి వారిదే. ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలు మాత్రం రోడ్లపాలే. కార్యకర్తలు తమ పార్టీలను అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రాణాలు సైతం పణంగా పెడుతున్నారు. కానీ రాజకీయ పార్టీలు అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఉండడం గమనార్హం. అధికారంలో లేనప్పుడు కుటుంబ సభ్యులుగా, అధికారంలో ఉన్నప్పుడు అంటరానివారుగా చూస్తూ కార్యకర్తల జీవితాలతో రాజకీయ పార్టీలు ఆడుకుంటున్నాయని కచ్చితంగా చెప్పవచ్చు. ఈ పరిణామం అన్ని ప్రాంతీయ పార్టీలలో కనిపిస్తూ ఉంది. ప్రాంతీయ పార్టీలు అన్నీ వ్యక్తిగత పార్టీలు. అందువలన ఆ పార్టీలన్నీ వాటి అధినేతలైన ఏక వ్యక్తి నిర్ణయాలపైన ఆధారపడి వ్యవహారాలు నడిపిస్తూ ఉంటాయి. గత కొద్ది కాలంగా ఈ పార్టీలలో సిద్ధాంతాలు, విలువలు ఏమీ కనిపించడం లేదు. అధికారమే ధ్యేయంగా పార్టీలు రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండడం గమనార్హం. అధికారం లేనప్పుడు క్షేత్రస్థాయిలో అంకితభావంతో కష్టపడి పార్టీకి పని చేసిన వారికే టికెట్లు ఇస్తామని కార్యకర్తలకు, పార్టీ నాయకులకు పార్టీల అధిష్టానం తెలియచేస్తూ ఉంటుంది. పార్టీల అధిష్టానం మాటలను నమ్మి కార్యకర్తలు, నాయకులు ఇల్లూ, వళ్ళూ గుల్ల చేసుకుని పార్టీకి కష్టపడుతూ ఉంటారు. కానీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ గెలుపు గుర్రాలకే టికెట్లు అంటూ పార్టీల అధిష్టానం స్వరంలో మార్పు కనిపిస్తూ ఉండడం నిత్యకృత్యంగా మారింది. అందుకు డబ్బు, కులం, పరపతి కలిగిన వ్యక్తులను ఎక్కడెక్కడినుంచో తెచ్చుకుని వారికి ఎంఎల్ఎ, ఎం.పి. టికెట్లు కేటాయిస్తున్నారు. మరికొన్ని పార్టీలైతే అప్పటి వరకు తమ పార్టీ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేసిన ప్రత్యర్థి పార్టీ నాయకులను స్థానిక కార్యకర్తలు, నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగా పార్టీలో చేర్చుకుని వారికి టికెట్లు ఇస్తూ ఉన్నాయి. అయినా అధికారం కోసం కార్యకర్తలు, నాయకులు అధినేత నిర్ణయాన్ని గౌరవించి తమ అభ్యర్థి విజయానికి కష్టపడుతున్నారు. అధికారం లభించాకయినా రాజకీయ పార్టీలు కార్యకర్తలకు న్యాయం చేస్తున్నాయా? అంటే అదీ లేదు. అధికారం లభించాక డబ్బు, కులం, పరపతి అవసరంలేని శాసనసభ్యుల కోటాలో, గవర్నర్ కోటాలో శాసనమండలి స్థానాలు, రాజ్యసభ స్థానాలు ప్రతి పార్టీకీ అనేకం లభిస్తాయి. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను నాయకులుగా తయారుచేసి వారికి న్యాయం చేయాలని ఈ ప్రాంతీయ పార్టీలకు నిజంగా ఉంటే ఈ పదవులు వారికి ఇవ్వవచ్చు. కానీ ఇప్పటి వరకు ఏ పార్టీ అయినా సామాన్య కార్యకర్తకు ఎంఎల్ఎ కోటా, గవర్నర్ కోటాలోని శాసనమండలిలో స్థానం లేదా రాజ్యసభలో స్థానం కల్పించాయా? కనీసం నామినేటెడ్ పదవులలో కూడా క్షేత్ర స్థాయిలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఏ పార్టీ న్యాయం చేయడం లేదు అని కచ్చితంగా చెప్పవచ్చు. ఇటీవలి కాలంలో గ్రామస్థాయి నాయకునికి రాష్ట్ర స్థాయి పదవులు, ఎంఎల్ఎ స్థాయి, రాష్ట్ర స్థాయి నాయకునికి చిన్న, చిన్న డైరెక్టర్ పదవులు కేటాయించడం అన్ని పార్టీలలో కనిపిస్తూ ఉంది. ఈ పరిణామాలు ఎందుకు జరుగుతున్నాయో? ఆ పార్టీల అధిష్టానానికే తెలియాలి. సాంకేతికత, సలహాదారులపై ఎక్కువగా ఆధారపడుతూ ఉండడంతో పార్టీల అధినేతలకు, క్షేత్రస్థాయిలో పార్టీకి చిత్తశుద్ధితో పనిచేసే కార్యకర్తకు మధ్య తీవ్ర అగాధం ఏర్పడింది అనడం ఎటువంటి సందేహం లేదు. కార్యకర్తలతో సమావేశమై వారిని స్వేచ్ఛగా మాట్లాడనిచ్చే పరిస్థితి ఏ అధినేత చేయడం లేదు. కార్యకర్తను స్వేచ్ఛగా మాట్లాడనిస్తేనే కదా పార్టీ లోటుపాట్లు అధినేతకు తెలిసేది. కార్యకర్త దగ్గర తాము చేసే తప్పులను చెప్పించుకునేందుకు ఏ పార్టీ అధినేత సాహసించడం లేదు. తాము చెప్పిందే కార్యకర్తలు వినాలి అనే ధోరణితో ప్రతి పార్టీ అధినేత వ్యవహరిస్తూ ఉన్నారు. ఒకవేళ ఏ కార్యకర్త అయినా అధినేతలు చేసే తప్పులు ఎత్తిచూపితే ఆ కార్యకర్త బతుకు బస్టాండే. తన తప్పులు ఎత్తిచూపిన కార్యకర్త దశాబ్దాలు పాటూ పార్టీ కోసం కష్టపడినా పట్టించుకోకుండా వారిని డస్ట్‌బిన్‌లో వేసేసే పరిస్థితి ప్రతి పార్టీలో కనిపిస్తూ ఉంది. పార్టీల అధినేతలందరూ పార్టీ సమావేశాల్లో కూడా తమను వ్యక్తిగతంగా పొగిడించుకునేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో అష్టకష్టాలు అనుభవిస్తూ పార్టీకి కష్టపడి పనిచేసే కార్యకర్తను మించి సోషల్ మీడియాలో ప్రత్యర్థులపై పోస్టులు పెట్టే వారికి, ప్రత్యర్థి పార్టీల నేతలను తిట్టే వారికి, భజనపరులకు ఇటీవల అన్ని పార్టీలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఉండడం స్పష్టంగా కనిపిస్తూ ఉంది. పార్టీలు చేసే మంచి పనులను గ్రామస్థాయిలో ప్రజలకు తెలియచేసేది. అధినేతలు ఇచ్చే అలివికాని హామీలను క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తీసుకుపోయేది, అధినేతలు ప్రత్యర్థి పార్టీలపై రాజకీయ అవసరాల కోసం చేసే విమర్శలకు క్షేత్రస్థాయిలో అండగా నిలబడేది కార్యకర్తలే. అటువంటి నిజమైన కార్యకర్తలను విస్మరిస్తున్నందు వలనే తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు సుదీర్ఘ కాలం పాటు వరుసగా అధికారంలో ఉండలేకున్నాయి అనేది నిర్వివాదాంశం.

# నేడు "శ్రీ కృష్ణదేవ రాయలు" జయంతి

## ఆంధ్ర భోజుడు, విజయనగర సామ్రాజ్య చక్రవర్తి "శ్రీ కృష్ణదేవ రాయలు"

శ్రీ కృష్ణదేవ రాయలు అత్యంత ప్రసిద్ధ విజయనగర సామ్రాజ్య చక్రవర్తి. సాళువ నరసనాయకుడి వద్ద మహాదండనాయకుడుగా పనిచేసిన తుళువ నరసనాయకుని మూడవ కుమారుడు శ్రీకృష్ణదేవరాయలు. నరసనాయకుడు పెనుకొండలో ఉండగా, రెండవ భార్య నాగలాంబకు 1471 జనవరి 17న జన్మించాడు కృష్ణదేవరాయలు. ఈయన పాలనలో విజయనగర సామ్రాజ్యము అత్యున్నతస్థితికి చేరుకున్నది. కృష్ణరాయలను తెలుగు మరియు కన్నడ ప్రజలు భారతదేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తులలో ఒకడిగా అభిమానిస్తారు. సాహిత్యములో ఈయన ఆంధ్ర భోజుడుగా మరియు కన్నడ రాజ్య రమారమణగా కీర్తించబడినాడు. రాయలకు ప్రధాన మంత్రి తిమ్మరుసు. శ్రీకృష్ణదేవరాయలు సింహాసనం అధిష్ఠించడానికి తిమ్మరుసు చాలా దోహదపడినాడు. కృష్ణరాయలు తిమ్మరుసును పితృసమానునిగా గౌరవించి "అప్పాజీ" (తండ్రిగారు) అని పిలిచేవాడు.రాయలు, తుళువ నరస నాయకుని రెండవ భార్య అయిన నాగలాంబ (తెలుగు ఆడపడుచు) కుమారుడు. ఇతను ఇరవై సంవత్సరాల వయసులో ఫిబ్రవరి 4, 1509న విజయనగర రత్నసింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతని పట్టాభిషేకానికి అడ్డురానున్న అచ్యుత రాయలు నూ, వీర నరసింహ రాయలు నూ, అనుచరులనూ తిమ్మరుసు సుదూరంలో ఉన్న దుర్గములలో బంధించాడు. రాయలు తల్లి నాగలాంబ గండికోటను పాలించిన పెమ్మసాని నాయకులు ఆడపడచు. 240 కోట్ల వార్షికాదాయము ఉంది. రాయలు విజయనగరాధీశులందరిలోకీ చాలా గొప్పవాడు, గొప్ప రాజనీతిజ్ఞుడు, సైనికాధికారి, భుజబల సంపన్నుడు, ఆర్థిక వేత్త, మత సహనము కలవాడు, వ్యూహ నిపుణుడు, పట్టిన పట్టు విడువని వాడు, కవి పోషకుడు, రాజ్య నిర్మాత మొదలగు సుగుణాలు కలవాడు. ఇతను దక్షిణ భారతదేశం మొత్తం ఆక్రమించాడు. కృష్ణదేవరాయలు స్వయంగా కవిపండితుడు కూడా కావడంతో ఇతనికి సాహితీ సమరాంగణ సార్వభౌముడు అని బిరుదు. ఈయన స్వయంగా సంస్కృతంలో జాంబవతీ కళ్యాణము, మదాలసాచరితము, సత్యవధూపరిణయము, సకలకథాసారసంగ్రహము, జ్ఞానచింతామణి, రసమంజరి తదితర గ్రంథములు, తెలుగులో ఆముక్తమాల్యద లేక గోదాదేవి కథ అనే గ్రంథాన్ని రచించాడు. "తెలుగదేల యన్న దేశంబు తెలుగేను తెలుగు రేడ నేను తెలుగొకొండ ఎల్ల జనులు వినగ ఎరుగవే బాసాడి దేశభాష లందు తెలుగు లెస్స" అన్న పలుకులు రాయలు వ్రాసినవే. రాయల ఆస్థానానికి భువన విజయము అని పేరు. భువనవిజయంలో అల్లసాని పెద్దన, నంది తిమ్మన, ధూర్జటి, మాదయ్యగారి మల్లన (కందుకూరి రుద్రకవి), అయ్యలరాజు రామభద్రుడు, పింగళి సూరన, రామరాజభూషణుడు (భట్టుమూర్తి), తెనాలి రామకృష్ణుడు అనే ఎనిమిది మంది కవులు ఉండేవారని ప్రతీతి. వీరు అష్టదిగ్గజములుగా ప్రఖ్యాతి పొందారు."తెలుగదేల యన్న దేశంబు తెలుగేను,తెలుగు వల్లభుండ తెలుగొకండ,యెల్ల నృపులు గొలువ యెఱుగ వే బాసాడి,దేశ భాషలందు తెలుగు లెస్స.."అని మన తెలుగు భాషను కీర్తించిన తెలుగు వల్లభుడు, ఆంధ్ర భోజుడు,విజయనగర సామ్రాజ్య చక్రవర్తి, సాహితీ సమరాంగణ చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు. కృష్ణదేవ రాయలు తక్కిన విజయనగర రాజులలాగే వైష్ణవుడు. కానీ పరమతసహనశీలుడు. అనేక వైష్ణవాలయాలతో పాటు శివాలయాలను నిర్మించాడు. అంతేకాక ధూర్జటి, నంది తిమ్మన వంటి పరమశైవులకు కూడా తన సభలో స్థానం కల్పించాడు. అనేక దాన ధర్మాలు చేసాడు. ముఖ్యంగా తిరుమల శ్రీనివాసులకు పరమ భక్తుడు, సుమారుగా ఏడు పర్యాయములు ఆ దేవదేవుని దర్శించి, అనేక దానధర్మాలు చేశాడు. ఇతను తన కుమారునికి తిరుమల దేవ రాయలు అని, కుమార్తెకు తిరుమలాంబ అని పేర్లు పెట్టుకున్నాడు. కృష్ణదేవ రాయలు చెన్నకేశవస్వామి వారి దేవాలయం కట్టించాడు. కృష్ణదేవ రాయలుకు తిరుమల దేవి, చిన్నాదేవి ఇద్దరు భార్యలని లోక విదితము. కానీ, ఆముక్తమాల్యద ప్రకారం ఈయనకు ముగ్గురు భార్యలు (తిరుమలాదేవి, అన్నపూర్ణ, కమల). కృష్ణదేవరాయలు విజయనగర సామంతుడైన శ్రీరంగపట్నం రాజు కుమార వీరయ్య కూతురు తిరుమలాదేవిని 1498లో వివాహం చేసుకున్నాడు. పట్టాభిషిక్తుడైన తర్వాత రాజనర్తకి అయిన చిన్నాదేవిని వివాహమాడాడని ప్రతీతి. ప్రతాపరుద్ర గజపతిని ఓడించి, ఆయన కూతురైన తుక్కా దేవిని మూడవ భార్యగా స్వీకరించాడటనటానికి చారిత్రకాధారాలున్నాయి. ఈమెనే కొందరు లక్ష్మీదేవి అని, జగన్మోహిని అని కూడా వ్యవహరించారు. చాగంటి శేషయ్య, కృష్ణరాయలకు అన్నపూర్ణమ్మ అనే నాలుగవ భార్య ఉందని భావించాడు. కానీ, చిన్నాదేవే అన్నపూర్ణమ్మ అని కొందరి అభిప్రాయం. డొమింగో పేస్ ప్రకారం కృష్ణరాయలకు పన్నెండు మంది భార్యలు. కానీ అందులో తిరుమలాదేవి, చిన్నాదేవి, జగన్మోహిని ప్రధాన రాణులని చెప్పవచ్చు.అయితే శాసనాల్లో ఎక్కువగా ప్రస్తావించబడిన తిరుమలాదేవి పట్టపురాణి అయిఉండవచ్చని చరిత్రకారుల అభిప్రాయం ఇద్దరు కుమార్తెలు, వారిలో పెద్ద కూతురు తిరుమలాంబను ఆరవీడు రామ రాయలకు, చిన్న కూతురును రామ రాయలు సోదరుడైన తిరుమల రాయలుకు ఇచ్చి వివాహం చేసాడు. ఒక్కడే కొడుకు, తిరుమల దేవరాయలు. ఇతనికి చిన్న తనంలోనే పట్టాభిషేకం చేసి, తానే ప్రధానిగా ఉండి రాజ్యవ్యవహారాలు చూసుకునేవాడు. కాని దురదృష్టవశాత్తూ తిరుమల దేవ రాయలు 1524లో మరణించాడు. ఈ విషయంపై కృష్ణ దేవ రాయలు తిమ్మరుసును అనుమానించి, అతనిని గుడ్డివానిగా చేసాడు. తానూ అదే దిగులుతో మరణించినాడని ఓ అభిప్రాయము. మరణానికి ముందు చంద్రగిరి దుర్గమునందున్న సోదరుడు, అచ్యుత రాయలును వారసునిగా చేసాడు. శ్రీ కృష్ణ దేవరాయలు మతము దృష్ట్యా విష్ణు భక్తుడు అని అయన వ్రాసిన ఆముక్తమాల్యద తెలుపుచున్నది. అయితే శ్రీ కృష్ణ దేవరాయలు ఏ కులానికి చెందినవాడు అనే విషయంపై సాహిత్యవేత్తల్లోను, చరిత్రకారుల్లోను భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. శ్రీ కృష్ణ దేవరాయల తండ్రియైన తుళువ నరస నాయకుడు బంటు అనే నాగవంశపు క్షత్రియ కులానికి చెందినవాడని కొన్ని చరిత్ర పుస్తకాలు తెలుపుచున్నవి. శ్రీ కృష్ణ దేవరాయల తల్లి పేరు నాగలాదేవి. ఆముక్తమాల్యదలోని 19వ పద్యము ప్రకారము శ్రీ కృష్ణ దేవరాయలు చంద్రవంశమునకు చెందినవాడని, 22–23–24 పద్యాల ప్రకారం శ్రీ కృష్ణ దేవరాయల ముత్తాత అయిన తిమ్మరాజు యయాతి వంశస్థుడు అని తెలుస్తున్నది. కొన్ని సాహిత్య పుస్తకాల్లో శ్రీకృష్ణదేవరాయలు కురూబ యాదవుడని రచయితలు వ్రాశారు. ఇందుకు అష్ట దిగ్గజాలలో ఒకరైన తిమ్మన రచించిన పారిజాతాపహరణంలో, శిలాశాసనాలలో లిఖించబడినది. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన పాలకుడు శ్రీ కృష్ణదేవరాయులు మరణంపై ఆది నుంచి అనుమానాలే. ఆయన గతించిన తేదీపై ఎలాంటి క్లారిటీ లేదు. కానీ తాజాగా కర్నాటకలోని ఓ చారిత్రక శాసనంలో కృష్ణదేవరాయల మరణతేదీపై సందిగ్ధం వీడింది. కర్ణాటకలోని తుమకూర్ జిల్లాలోని ఒక ఆలయంలో బయటపడ్డ శాసనం. ఈ శాసనం ప్రకారం కృష్ణదేవరాయలు అక్టోబర్ 17,1529న తుదిశ్వాస విడిచారని తేలింది.



# సెక్స్ కోసం ప్రత్యేక దీవి

## ఎఫ్ స్టీన్ మాములోడు కాదు

**న్యూయార్క్, ఫిబ్రవరి 16:** కొద్దిరోజులుగా అంతర్జాతీయ మీడియాలో ఎఫ్ స్టీన్ గురించి విపరీతమైన చర్చ నడుస్తోంది.. అతడికి సంబంధించిన ఏవో ఫైల్స్ తెర పైకి వచ్చాయని.. వారంతా కూడా సమాజంలో పేరుపొందిన వ్యక్తులని.. వ్యక్తిగత భోగాల కోసం.. పద్ధతిలేని సుఖాల కోసం వారంతా అక్కడికి వచ్చేవారని.. ఎఫ్ స్టీన్ వారికోసం ఆ దీవిని అలా ఏర్పాటు చేశాడని ఇప్పుడు సరికొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.అమెరికా దేశస్థుల వ్యవహారాలు ప్రపంచానికి కొత్త కాదు. అప్పట్లో బిల్ గేట్స్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మోనిక లెవెన్స్ తో సాగించిన వ్యవహారం ప్రపంచ వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఆ తర్వాత అమెరికాలోని పేరుపొందిన వ్యక్తుల వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడం మొదలైంది. ఇప్పుడు ఈ ఫైల్స్ ద్వారా అమెరికాలో పేరుపొందిన వ్యక్తుల చీకటి వ్యవహారాలు మరింతగా తెలుస్తున్నాయి.ఎఫ్ స్టీన్ భూమ్మీద లేకపోయినప్పటికీ.. అతడు సాగించిన వ్యవహారాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. ఎఫ్ స్టీన్ అనేవాడు ఒక బ్రోకర్. వాడి లక్ష్యం ప్రపంచంలో ఉన్న ఆగర్భ శ్రీమంతులకు స్వర్గసుఖాలను అందించడం.. దానిని అతడు వృత్తిగా మార్చుకున్నాడు. ఎఫ్ స్టీన్ కు సెయింట్ జేమ్స్ అనే ఒక సొంత దీవి ఉండేది. దీనికి ఎపి స్టయిన్, పీడో ఫైల్ అనే పేర్లు కూడా ఉన్నాయి. పీడో ఫైల్ అంటే.. కౌమార బాలికల పై ఉండే ఆకర్షణ కలిగి ఉండే ఒక రకమైన సైకో లక్షణం. ఎఫ్ స్టీన్ బ్రోకర్ పని చేసి భారీగా కూడపెట్టాడు. ఇతడికి బోయింగ్ 727 అనే సొంత విమానం ఉండేది. దీనికి అతడు లోలిటా ఎక్స్ ప్రెస్ అనే పేరు కూడా ఉండేది. లోలిటా అంటే కామంత కళ్ళు మూసుకుపోయిన ఒక మృగాడి వాంఛలు తీర్చే కౌమార బాలిక అని అర్థం.ఎఫ్ స్టీన్ కు రాజకీయ నాయకులతో సంబంధాలు ఉండేవి. ప్రపంచ కుబేరులతో సాన్నిహిత్యం ఉండేది. వారికోసం అనేక ప్రాంతాలలో ఉన్న కౌమార బాలికలను ఎఫ్ స్టీన్ అక్కడికి తీసుకొచ్చేవాడు. వారంతా కూడా పేద కుటుంబాలకు చెందిన వారే.లోలిటా విమానంలో ప్రపంచ కుబేరులను అక్కడికి తీసుకెళ్లి.. కౌమార బాలికలతో దారుణమైన పనులు చేసి వచ్చేవారు. ఎఫ్ స్టీన్ కు ఉన్న పరిచయాల ద్వారా అనేకమంది అమ్మాయిలను ఇక్కడికి తీసుకొచ్చేవాడు. తద్వారా దీవిని ఒక భోగం మేళ గా మార్చేశాడు.ఈ బ్రోకర్ పని ద్వారా వచ్చిన డబ్బుతో అతడు అత్యంత విలాసవంతమైన జీవితం గడిపాడు. తర్వాత 2019లో అరెస్టు అయ్యాడు. జైల్లోనే అతడు కన్నుమూశాడు. కొందరేమో ఆత్మహత్య అని.. ఇంకొందరేమో ఈ రహస్యాలు మొత్తం బయటికి వస్తాయని భయంతో పెద్ద వ్యక్తులు అతడిని అంతం చేసి ఉంటారని.. ఇలా రకరకాల ప్రచారాలు వచ్చాయి.ఇక తాజాగా అమెరికా లోని జస్టిస్ విభాగం ఎఫ్ స్టీన్ ఫైల్స్ పేరుతో ఏకంగా 30 లక్షల డాక్యుమెంట్లను, 2000 పైగా వీడియోలను, 1,80,000 పైగా ఫోటోలను బయటపెట్టింది. అందులో బిల్ గేట్స్ కొంతమంది రష్యన్ కౌమార బాలికలతో వ్యవహారాలు సాగించాడని.. అందువల్లే ఆయనకు సుఖ రోగాలు కూడా వచ్చాయని ఆరోపణలు వినిపించాయి. అతడు తీరు నచ్చక మెలిందా విడాకులు కూడా ఇచ్చిందని ప్రచారం కూడా ఉంది.ఎఫ్ స్టీన్ బాగోతం బయటపడిన తర్వాత ప్రసిద్ధ మనుషుల వెనుక ఉన్న నీలి వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ఆ తర్వాత వాటికి ఖండనలు కూడా వచ్చాయి. సాధారణంగా మనం ఒకరిని ఆదర్శంగా తీసుకుంటే.. వారి మేధస్సును చూసి పొంగిపోతుంటాం. వారు సంపాదించిన డబ్బు చూసి ఆశ్చర్యపోతుంటాం. కానీ ఆ పెద్ద వ్యక్తుల ముసుగులు తీసి అసలు రూపాలు చూపిస్తుంటే ఆందోళన చెందుతాం. ఎఫ్ స్టీన్ ఫైల్స్ వ్యవహారంలో బిల్ గేట్స్, ఇతర వ్యక్తుల అసలు రూపాలు వెలుగులోకి వచ్చాయి.ఎఫ్ స్టీన్ దీవి గురించి తెలిసిన తర్వాత.. ఇంకా అనేక విషయాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. పేద బాలికలను ఇక్కడికి తీసుకొచ్చేవారు. వారిని లోలిటా విమానంలో తిప్పేవారు. మసాజ్ థెరపీ ద్వారా బాలికలకు మాయమాటలు చెప్పేవారు. ఒక్కసారిగా వారిని ఈ కూపంలోకి లాగేవారు. ఇందులోకి వచ్చిన తర్వాత ఆ అమ్మాయిలకు బయటకు వెళ్లే అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు అమెరికా ప్రభుత్వం విడుదల చేస్తున్న ఫైల్స్ కేవలం ఫోటోలు ... వీడియోలు మాత్రమే కాదు.. ఆ బాలికల మౌన రోదన..

# కోదాడ మునిసిపల్ చైర్ పర్సన్ గా
# ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు....

**సమన్వయంతో చైర్మన్ పదవి అందుకున్న కుసుమ వెంకటరత్నం బాబు.**

**మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి ల సహకారంతో చైర్పర్సన్ పదవికి ఎంపిక**

**సూర్యాపేట:**కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక పీట ముడి ఎట్టకేలకు అధిష్టానం విప్పింది. కోదాడ పీఠంపై మాజీ సర్పంచ్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి లు అంగీకారం తెలుపుతూ కూర్చోబెట్టారు. గత రెండు రోజులుగా హైదరాబాదులోని క్యాంపులో పోటీలో ఉన్న అభ్యర్థులందరికీ సమన్వయం చేసి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎర్నేని వెంకటరత్నం బాబు అపార రాజకీయ అనుభవం , కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి లు గుర్తించారు. ఇదే క్రమంలో బాబు సహితం అగ్ర నాయకుల అందర్నీ సమన్వయం చేసుకొని పదవిని దక్కించుకున్నారు. ఎర్నేని బాబు మాజీ సర్పంచ్ గా, మార్కెట్ కమిటీ చైర్మన్ గా పదవులు నిర్వహించడంతోపాటు పార్టీ పరంగా అనేక పదవులు చేపట్టారు. మున్సిపల్ ఎన్నికల ముందు నుండే ఆయన ఈ పదవిని ఆశిస్తూ అదే ప్రయత్నంలో ఉన్నారు. రిజర్వేషన్ జనరల్ మహిళా



కావడంతో తన శ్రీమతి కుసుమ ను కౌన్సిలర్ గా పోటీ చేయించి ఏకగ్రీవంగా విజయం సాధించారు. ఎమ్మెల్యే పద్మావతి, మంత్రి ఉత్తమ్ లు సహితం బాబు కు ప్రాధాన్యత ఇవ్వాలనే మాట కు అనుకూలంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా ఎర్నేని వెంకట్ రత్నం బాబు తమ కు అవకాశం ఇచ్చిన మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి లతో పాటు,స్థానిక నాయకులకు, కౌన్సిలర్ లకు ధన్య వాదాలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. లాంఛన ప్రాయంగా చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నిక చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు క్యాంపు నుండి కౌన్సిలర్ లతో ఎమ్మెల్యే పద్మావతి బస్సు లో కోదాడ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఎన్నిక పూర్తి అయ్యే వరకు ఉండి మునిసిపాలిటీ చేజరా కుండా తీవ్రంగా కృషి చేశారు. కాగా లంచనా ప్రాయంగా జరిగిన ఎన్నికలో చైర్ పర్సన్ కు కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు ప్రతిపాదించగా, కౌన్సిలర్ షఫీ బలపరిచారు. వైస్ చైర్మన్ కు కౌన్సిలర్ కొల్లా కోటిరెడ్డి ప్రతిపాదించగా కౌన్సిలర్ షాబుద్దీన్ బలపరిచారు. మొత్తం 35 మంది కౌన్సిలర్ల లో పోటీ లేకపోవడంతో ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు చైర్ పర్సన్ గా, దేవరపల్లి మహేశ్వరి వైస్ చైర్మన్గా లాంచన ప్రాయంగా ఎన్నికయ్యారు. ఆర్డిఓ సూర్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా చైర్మన్ గా ఎన్నికైనకుసుమ బాబు, వైస్ చైర్మన్ దేవర పల్లి మల్లేశ్వరి లను నాయకులు కార్యకర్తలు పూల మాలలు, శాలు వాలతో బొకే లతో నూతన చైర్మన్ ను ఘనంగా సన్మానించారు.

వార్తాతరంగాలు

మంగళవారం 17 ఫిబ్రవరి 2026

# తెలంగాణలో వలంటీర్ల వ్యవస్థ

- మొదటి పేజీ తరువాయి

ఉన్నాయి. ఈ గ్రామాలలో 9,795 గ్రామాలకు గ్రామ మ్యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. 17.436 మిలియన్ల సర్వే నంబర్లకు అనుసంధానించిన పంట భూములను సర్వే చేసే బాధ్యత ప్రైవేట్ సర్వేయర్లు వాలంటీర్లకు అప్పగించారు. మిగిలిన 826 గ్రామాలలో వ్యవసాయ విస్తరణ అధికారులు(రాజులు) పోడు భూముల సర్వేలను నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలో ఒక స్థానికుడిని వాలంటీర్‌గా ఎంపిక చేస్తారు. ప్రతిరోజూ, వారు 150 నుంచి 200 సర్వే నంబర్లకు సంబంధించిన పంటల ఫొటోలను తీసుకొని మొబైల్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. అధికారులు ఫొటోకు రూ.7 చెల్లింపును నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం



సర్వే కోసం రూ.30.42 కోట్లు కేటాయించింది. వీటిలో రూ.2.93 కోట్లు ఇప్పటికే వర్షాకాల సర్వేకు ఖర్చు చేశారు. మిగిలిన నిధులను ప్రస్తుత రబీ సీజన్ సర్వేను పూర్తి చేయడానికి ఉపయోగిస్తారు. ఇటీవల, కేంద్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్ చావ్లా రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమై, డిజిటల్ సర్వేను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని నొక్కి చెప్పారు. బీఎస్సీ అగ్రికల్చర్ డిప్లొమా, ఇతర సైన్స్ అర్హతలు ఉన్నవారు లేదా ఇంటర్మీడియట్ లేదా 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. వారు మొబైల్ యాప్‌లను ఉపయోగించడంలో అన్నీ తెలిసి ఉండాలి. సర్వే పూర్తయ్యే వరకు వారు సెలవు లేకుండా పని చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

# సీఎం గారూ.... మీరు మొదలుపెట్టిన ఆటకు నేను ముగింపునిస్తా

- మొదటి పేజీ తరువాయి

ఎన్నో ఏళ్లుగా కల కన్నం. ప్రజలంతా ఎదురు చూశారు. ఆ కల సాకారమైన ఈరోజు చాలా సంతోషంగా ఉంది. నిన్న క్రికెట్ లో పాకిస్తాన్ పై భారత్ ఘన విజయం సాధించింది. కరీంనగర్ గడ్డపై జరిగిన ఈ మున్సిపల్ కబడ్డీ ఆటలో ఇతర పార్టీలన్న కుట్రలు చేసినా బీజేపీ మేయర్ కప్ గెలుచుకుంది. బీజేపీని ఓడించేందుకు చెప్పలేని, కంటికి కన్పించని కుట్రలెన్నో జరిగాయి. అధికారం చేతిలో ఉంది కదా అని... బీజేపీ 30 సీట్లు సాధించినా, ఇండిపెండెంట్లు మావైపు ఉన్నా... మమ్ముల్ని ఓడించేందుకు కుట్రలు జరిగాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి మొదలుకుని మంత్రులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలన్నీ కలిసి రెండ్రోజులుగా జరుగుతున్న కుట్రలను చూసి ప్రజలే విస్తుపోయారు. ఇన్ని కుట్రలు, కుతంత్రాలు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలనుకుంటున్నారా? అంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ జరిగింది. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాలన్నా, తెలంగాణ వచ్చినా కరీంనగర్ వేదికగా మార్పు మొదలైన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే కరీంనగర్ మేయర్ పదవిని బీజేపీ కైవసం చేసుకుంటే రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమనే భయంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలన్నీ ఒక్కటై కుట్ర చేశాయి. కానీ మేం ప్రజల సహకారం, అమ్మవారి ఆశీస్సులతో ఆ కుట్రలన్నీ భగ్నం చేశాం. 2005లో ఇదే రోజున నేను కార్పొరేటర్ గా తొలిసారి ఎన్నికైనప్పుడు ఎంతో సంతోషపడ్డా. మళ్లీ ఈరోజు ఇదే కార్పొరేషన్ పై మేయర్ పీఠాన్ని బీజేపీని దక్కించుకున్నందుకు అంతకంటే ఎక్కువ సంతోషంగా ఉంది. మేయర్ గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉంది. మా మేయర్, డిప్యూటీ మేయర్ కార్పొరేటర్లు గుణవంతులు, నీతిమంతులు... అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేస్తారు. కార్పొరేషన్ లో అవినీతికి తావు లేకుండా ప్రజలకు అండగా ఉంటూ కరీంనగర్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం. ఎన్నికల వరకే రాజకీయాలు. ఎన్నికల తరువాత అభివృద్ధే మా లక్ష్యం. ఇందుకోసం అన్ని పార్టీలు కలిసి రావాలని కోరుతున్నా. కరీంనగర్ అభివృద్ధి విషయంలో ప్రజలు లేటైనా లేటెస్టుగా తీర్పునిచ్చారు. అధిక మెజారిటీని ఇచ్చి ఆశీర్వదించారు. మేయర్, డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, అమిత్ షాను కలిసి కరీంనగర్ కు అత్యధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేసేందుకు యత్నిస్తా. బాధాకరమైన విషయం ఏంటంటే... బీజేపీకి మేయర్ పదవి రాకుండా ఉండేందుకు జరిగిన కుట్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా భాగస్వాములు కావడం ఆశ్చర్యం కలిగించింది. గత రెండ్రోజులుగా అనేక కుట్రలు చేశారు. ఇబ్బంది పెట్టారు. నేను నమ్ముకున్న అమ్మవారి ఆశీస్సులు, ఎములాడ రాజన్న, కొండగట్టు అంజన్న, పాతబస్తీ భాగ్యలక్ష్మీ అమ్మవార్ల దీవెనలతో వాటిని అధిగమించినం. నేనడుగుతున్నా... కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటి కావడానికి కారణమేంటి? ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఫాంహౌజ్ వేదికగా కుట్రలు ఎందుకు చేశారు? ఎవరిపై మీ కోపం? కాంగ్రెస్ గెలిచింది 14 సీట్లు, ఎంఐఎం గెలిచింది 3 సీట్లు, బీఆర్ఎస్ గెలిచింది 9 సీట్లు... అన్నీ కలుపుకున్నా 26 సీట్లు మాత్రమే. మ్యాజిక్ ఫిగర్ దాటనే లేదు. ఇవన్నీ తెలిసి ఎందుకు బీజేపీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. మీ చీకటి ఒప్పందాలేమిటి? మున్సిపల్ ఎన్నికలకు ముందు వాళ్లు(కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం) ఆట స్టార్ట్ చేశారు. బీజేపీ ఆ ఆటకు ముగింపు ఇవ్వబోతున్నా. ముఖ్యంగా కాంగ్రెస్ కు ఛాలెంజ్ విసురుతున్నా... ఎక్కడికక్కడ 6 గ్యారంటీలను అమలు చేసేదాకా మీ మెడలు వంచుతాం. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పతనానికి ముగింపు పలుకుతాం. అందుకు కరీంనగరే వేదిక కాబోతోంది. గత రెండ్రోజులుగా కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కుట్రలను చూసి మేం భయపడలే. కనీస వ్యూహం, ఎత్తుగడలకు లేకుండా వ్యవహరించిన తీరును చూసి మేమంతా నవ్వుకున్నాం. ఈ విషయంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ల పంథాను చూసి అభినందించకుండా ఉండలేకపోతున్నా. ప్రజాస్వామ్య తీర్పును శిరసావహించాలనే ఉద్దేశంతో పార్టీ నిర్ణయానికి భిన్నంగా వ్యవహరించిన తీరు గొప్ప విషయం. ఒక్క బండి సంజయ్ ను అడ్డుకోవడానికి, బీజేపీ సైనికులను అడ్డుకోవడానికి హైదరాబాద్ శివారులోని లియోనియో రిసార్ట్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం చేయని కుట్రలు లేవు. అయినా ఏం సాధించారు? ఒక్క బండి సంజయ్ ను అడ్డుకోలేకపోయారు? బీజేపీ సైనికులను అడ్డుకోలేకపోయారు? కాంగ్రెస్ మేయర్ ఎన్నికలో ఎలాంటి కుట్ర లేదని, కాంగ్రెస్ కు సంబంధం లేదని ముఖ్యమంత్రి చెప్పే దమ్ముందా? మీ కుట్ర ఉందని నేను నిరూపిస్తా. కరీంనగర్ మేయర్ ఎన్నిక విషయోం పూర్తిగా సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావుకు పత్ర్యేక ధన్యవాదాలు. ఈ విషయంలో ఆయన చేయని సాయం లేదు. హ్యాట్సాఫ్... జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ఫోన్ చేసి ఎప్పటికప్పుడు సహకరించారు. వారికి ధన్యవాదాలు. కరీంనగర్ గెలుపుకు ప్రధాన కారణం నరేంద్రమోదీ ఇచ్చిన నిధులు, చేసిన అభివృద్ధే కారణం. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహకారం మరువలేనిది. వీరితోపాటు కిషన్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, డీకే అరుణసహా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు ఎంతో సహకారం అందించారు. ముఖ్యంగా ఇతర జిల్లాల నుండి బీజేపీ కార్యకర్తలు వచ్చి కరీంనగర్ లో బీజేపీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన తీరు అభినందనీయం.

# రోడ్డు ప్రమాద బాధితులకు 1.5 లక్షల క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో చికిత్స అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానినరేంద్ర మోదీ 'పీఎం రాహత్' పథకానికి ఆమోదం తెలిపారు. ఈ పథకం కింద రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి 7 రోజుల పాటు గరిష్టంగా రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందుతుంది. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకారం, దేశంలోని ఏ కేటగిరీ రహదారిపై ప్రమాదం జరిగినా, అర్హులైన ప్రతి బాధితుడికి పథకం వర్తిస్తుంది. అంటే జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు లేదా గ్రామీణ రోడ్లు – ఇలా ఏ ప్రాంతంలో ప్రమాదం జరిగినా బాధితులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చు. పీఎం రాహత్ పథకం కింద ఎవరికైనా సరే ప్రమాదం బాధితులకు నిర్ణీత మొత్తం వరకు ఉచిత చికిత్స అందుతుంది. అయితే పథకం రూల్స్ ఇక్కడ తెలుసుకోండి.

**పీఎం రాహత్ పథకానికి సంబంధించిన రూల్స్**

పీఎం రాహత్ పథకం కింద, ప్రమాదం జరిగిన రోజు నుండి 7 రోజుల వరకు ఒక్కో వ్యక్తికి 1.5 లక్షల రూపాయల వరకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఈ చెల్లింపు నేరుగా మోటారు వాహనాల ప్రమాద నిధి) నుండి ఆసుపత్రికి వెళ్తుంది. ఈ పథకం కింద ప్రాణాపాయం లేని కేసుల్లో



గరిష్టంగా 24 గంటల వరకు, తీవ్రమైన కేసుల్లో 48 గంటల వరకు 'స్టెబిలైజేషన్' చికిత్స అందించనున్నారు. ఆ తర్వాత కూడా 7 రోజుల వ్యవధిలోపు క్యాష్‌లెస్ చికిత్స అందుకోవచ్చు. ఈ ప్రక్రియ అంతా ఇంటిగ్రేటెడ్ డిజిటల్ సిస్టమ్ ద్వారా జరుగుతుంది. దీనికి పోలీసు ధృవీకరణ అవసరం అవుతుంది. సాధారణ కేసుల్లో 24 గంటల లోపు, తీవ్రమైన కేసుల్లో 48 గంటల లోపు పోలీసుల నిర్ధారణ జరగాలి. తద్వారా చికిత్స అందించడంలో ఎటువంటి ఆటంకం కలగకుండా పారదర్శకంగా ప్రక్రియ కొనసాగుతుంది.

**గోల్డెన్ అవర్‌లో చికిత్సపై ప్రాధాన్యత**

రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకారం, దేశంలో ప్రతి ఏటా వేల సంఖ్యలో ప్రజలు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. అందులో చాలా మంది సకాలంలో చికిత్స అందకపోవడం వల్లే చనిపోతున్నారు. ప్రమాదం జరిగిన మొదటి గంట (గోల్డెన్ అవర్) లోపు గాయపడిన వారిని ఆసుపత్రికి చేర్చగలిగితే సుమారు 50 శాతం మరణాలను నివారించవచ్చని పరిశోధనల్లో తేలింది. ఈ లక్ష్యంతోనే 112 హెల్ప్‌లైన్ ను ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్‌తో అనుసంధానం చేశారు. రోడ్డు ప్రమాద బాధితులు, బాటసారులు లేదా అక్కడ ఉన్న ఎవరైనా సరే 112 నెంబర్‌కు డయల్ చేసి సమీపంలోని ఆసుపత్రి వివరాలను తెలుసుకోవచ్చు. బాధితుల కోసం అంబులెన్స్ సహాయం కోరవచ్చు. ఏడు రోజుల గడువు ముగిసిన తర్వాత కూడా బాధితుడి పరిస్థితి విషమంగా ఉంటే, మెరుగైన చికిత్సను వారి వ్యక్తిగత భీమా11దా ఇతర ప్రభుత్వ పథకాల (ఆయుష్మాన్ భారత్ వంటివి) కిందకు మార్చుకునే వీలుంది. పీఎం రాహత్ పథకం అమలులో నేషనల్ హెల్త్ అథారిటీ (చీనూా) కీలక పాత్ర పోషిస్తుంది.

# దక్షిణ తెలంగాణ ప్రాంతానికి మహర్దశ..!

- మొదటి పేజీ తరువాయి

కలిపితే అయ్యే మొత్తం ఖర్చు, వచ్చే రాబడి మధ్య చాలా అంతరం ఉందని, ఈ ప్రాజెక్టు లాభసాటి కాదని ముందుగా కేంద్రం అభ్యంతరం తెలిపింది. అయితే దక్షిణ తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదం చేస్తుందని రాష్ట్రం చెబుతోంది. ఈ మేరకు ప్రాజెక్టు చేపట్టాలని కేంద్రాన్ని విన్నవించింది. కేంద్రం అభ్యంతరాల నేపథ్యంలో భూసేకరణకయ్యే మొత్తం వ్యయాన్ని భరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇదే విషయాన్ని కేంద్రానికి స్పష్టం చేసింది. ఇటీవల కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఇటీవల కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఈ మార్గంలోని టేకల్‌కోడ్‌లో లైమ్ స్టోన్ నిక్షేపాలను గుర్తించామని తెలిపారు. దాంతో పాటు అలాగే సిమెంట్, జౌళి పరిశ్రమల కేంద్రంగా ఈ మార్గాన్ని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు వివరించారు. తెలంగాణలో మరో కొత్త హైవే అందుబాటులోకి రానుంది. మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక సరిహద్దు గుడబెళ్లూరు వరకు చేపట్టనున్న 4 లైన్ల జాతీయ రహదారి ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ హైవే నిర్మాణానికి రూ.3,175 కోట్ల నిధుల విడుదలకు పచ్చజెండా ఊపింది. ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ కేంద్ర కేబినెట్ భేటీ ముగిసింది. ఈ భేటీలో మహబూబ్‌నగర్–గుడబెళ్లూరు 4 లైన్ల హైవే నిర్మాణానికి రూ.3,175 కోట్ల నిధుల చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మొత్తంగా రూ.



1.60 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేబినెట్ భేటీలో ఆమోదం తెలిపారు. ఇక మహబూబ్‌నగర్– గుడబెళ్లూరు ప్రాజెక్టు హైదరాబాద్ – గోవా ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా ఉంది. దీనివల్ల హైదరాబాద్ నుంచి రాయచూర్, మంత్రాలయం, మరియు గోవా వెళ్లే ప్రయాణికులకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. రూ.3,175 కోట్ల వ్యయంతో 80.01 కిలోమీటర్లు హ్యామ్ విధానంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఈ ప్రాజెక్టు చేపట్టనుంది. ఈ రహదారి మహబూబ్‌నగర్ నుంచి మొదలై.. దేవరకద్ర, మరికల్, మక్తల్, మాగనూరు మీదుగా గూడెబల్లూరు ( రాయచూర్ సరిహద్దు) వరకు సాగుతుంది. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండటానికి మహబూబ్‌నగర్, దేవరకద్ర, మరికల్, మక్తల్, మరియు మాగనూరు పట్టణాల వద్ద ప్రత్యేకంగా బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 2 లైన్ల రోడ్డును 4 లైన్లుగా మార్చడం వల్ల ప్రయాణ సమయం దాదాపు 1.5 గంటలు తగ్గుతుంది. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల ఆర్థిక అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుంది. హైదరాబాద్ నుంచి గోవా వెళ్లే వారికి ఇది అత్యంత వేగవంతమైన మార్గంగా మారుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర క్యాబినెట్ ఆమోదం లభించగా.. టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది. భూసేకరణకు సంబంధించిన నష్టపరిహారం చెల్లింపులు కూడా జరుగుతున్నాయి. ఇక రాష్ట్రంలో మరికొన్ని రోడ్డు ప్రాజెక్టులు కూడా ప్రారంభ దశలో ఉన్నాయి. మన్ననూరు–శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. శ్రీశైలం ఆలయానికి దగ్గరగా ఈ కారిడార్ నిర్మించనున్నారు. దీంతో శ్రీశైలం వెళ్లే వారికి సమయంతో పాటు దూరం తగ్గనుంది. అందుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ అందించారు. ప్రతిపాదిత కొత్త రైలు లైన్ వికారాబాద్ నుంచి కృష్ణా జంక్షన్ వరకు ఉంది. రైల్వేబోర్డు నుంచి ఆమోదం లభించి.. ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే తెలంగాణలోని పరిగి, కొడంగల్, మక్తల్, నారాయణపేట వంటి ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. అక్కడ పండించే ధాన్యం, పత్తి, మిర్చి వంటి వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, ఎరువుల సరఫరాతో పాటు సిమెంటు, గ్రానైట్ రవాణాతో పారిశ్రామిక అభివృద్ధికి, కొత్త పెట్టుబడులకు చాలా అవకాశం ఉంటుంది. మొత్తంగా దక్షిణ తెలంగాణకు మహర్దశ పట్టడంతో పాటు రూపురేఖలు మారిపోతాయి.

# తెలంగాణలో కమలం పొత్తుల ప్లాన్...

- మొదటి పేజీ తరువాయి



ఆ పార్టీ.. కనీసం ప్రభావం చూపించలేదు. ఇక పంచాయతీ ఎన్నికల్లో కూడా పార్టీకి ప్రజలనుంచి మద్దతు కరువైంది. పార్టీ నాయకులు మాటలు చెప్పడమే మినహా బలోపేతం చేయలేకపోతున్నారనేది ఆ పార్టీ కేడర్ ఆవేదన. మున్సిపల్ ఎన్నికల్లో కూడా పార్టీ పెద్దగా ప్రభావం చూపించలేదు. కనీసం తమ ఎంపీలు ఎమ్మెల్యేలు ఉన్నచోట కూడా పార్టీ మున్సిపల్ స్థానాలను కైవసం చేసుకోలేకపోయింది. అయితే ఇప్పుడు.. బిజెపికి రాజకీయ పరిశీలకులు సూచనలు చేస్తున్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావాలంటే పొత్తు పెట్టుకుని ముందుకు వెళ్లడం మినహా ఆ పార్టీకి మరో మార్గం లేదని.. దీనిపై అధిష్టానం కసరత్తు చేయాలని సూచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఫార్ములాను తెలంగాణలో కూడా అమలు చేస్తేనే ఆ పార్టీ సత్తా చాటే అవకాశం ఉంటుందని.. స్థానిక సంస్థల్లో పట్టు లేనప్పుడు ఎంపీ స్థానాలు గెలిచిన పార్టీ బలోపేతం కావడం కష్టం అంటూ హెచ్చరిస్తున్నారు పరిశీలకులు. నాయకులు విమర్శలకు మాత్రమే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకును వీలైనంత త్వరగా తమ వైపుకు తిప్పుకోకపోతే పార్టీ మరింతగా బలహీనపడే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పొత్తు పెట్టుకోకుండా బిజెపి ముందుకు వెళ్ళవద్దని.. కాంగ్రెస్ పార్టీని తక్కువ అంచనా వేయడం కరెక్ట్ కాదంటూ అభిప్రాయపడుతున్నారు. జనసేన పార్టీతో కలిసి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే మంచి ఫలితాలు వచ్చేవని ఆ పార్టీ నాయకత్వానికి పలువురు సూచిస్తున్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. నెలాఖరున వర్షాలు



ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సోమవారం అల్పపీడనంగా మారింది.. దీని ప్రభావంతో ఈనెల 25 నుంచి 28 వరకు తెలంగాణ, ఏపీలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు ఏపీ రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గి పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రత 30 డిగ్రీలు దాటగా, నెలాఖరుకు గరిష్ఠంగా 40 డిగ్రీలకు చేరే సూచనలున్నాయని అధికారులు హెచ్చరించారు.

# చిన్నారుల నృత్యాలు అభినందనీయం

**కమాన్‌పూర్: ఫిబ్రవరి 16:** కమాన్ పూర్ మండల కేంద్రంలో శ్రీ శ్రీ చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తిరస కార్యక్రమంలో చిన్నారుల నృత్య ప్రదర్శన అభినందనీయమని గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, మాజీ సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కమాన్‌పూర్ మార్కెట్ ఏరియాలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఉత్సవాలు భక్తి,సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచాయి. ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు ఆధ్యాత్మిక ఉత్సాహంతో సాగి స్థానికులను ఆకట్టుకున్నాయి. పవిత్ర వేడుకలలో భాగంగా ఆర్కెస్ట్రా భక్తి గీతాలతో సభను పరవశింపజేసింది. శ్రీ శారద నృత్య కళాపీఠం ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన ఆధ్యాత్మిక,సాంస్కృతిక నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారుల భావవ్యక్తీకరణ,లయబద్ధత,వేదికపై ఆత్మవిశ్వాసం సభలో చప్పట్ల వర్షం కురిపించింది. శివతాండవ నృత్యాలు ఆధ్యాత్మిక పరవశాన్ని కలిగించాయి. యువసేన ఏర్పాటుచేసిన భారీ ఎల్ఈడి స్క్రీన్ కార్యక్రమాలకు ప్రత్యేక శోభను తెచ్చింది. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు,ప్రత్యేక ప్రసంగాలు,భక్తి ప్రదర్శనలు కుటుంబ సమేతంగా హాజరైన ప్రజలను ఆకట్టుకున్నాయి. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా ఇలాంటి వైభవమైన ఉత్సవాలు నిర్వహించడం యువసేన ప్రత్యేకతగా మారిందని,సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం,సాంస్కృతిక అవగాహన పెంపొందించడమే లక్ష్యమని యువసేన అధ్యక్షుడు మల్యాల శేఖర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యువసేన వ్యవస్థాపకులు జంగపెల్లి శ్రీనివాస్ మరియు ఉపాధ్యక్షులు కొత్తపల్లి సతీష్ , గుంజపడుగు నరేష్ మరియు యువసేన నాయకులు అలాగే వివిధ పార్టీల నాయకులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# ప్రజా సేవ నుంచి ప్రైవేటు ఉద్యోగం వైపు జేడీ...



**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** సీబీఐ మాజీ జేడీ వి.వి. లక్ష్మీనారాయణ.. తెలుగు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియని వారుండరు. అవినీతి తిమింగలాల గుండెల్లో నిద్రపోయిన అధికారిగా, అచంచలమైన నిజాయితీకి మారుపేరుగా ఆయన నిలిచారు. అయితే, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేందుకు ఐపీఎస్ పదవిని వదిలి రాజకీయాల్లోకి వచ్చిన ఈ మిస్టర్ క్లీన్, ఇప్పుడు అనూహ్యంగా అన్నింటినీ వదిలేశారు. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంలో చేరిపోయారు. నిజానికి ఆయన అన్ని బాధ్యతలను పూర్తి చేసుకుని తన అభిరుచి మేరకు రాజకీయ, సేవా రంగంలోకి వచ్చారు. కానీ ఇప్పుడు ఎందుకు మళ్లీ ఉద్యోగ బాధ్యతల్లోకి వెళ్లారు? ఇటీవల ఆయన కుటుంబం సైబర్ మోసగాళ్ల బారిన పడింది. రెండున్నర కోట్ల వరకూ నష్టపోయారు. తన సుదీర్ఘ సర్వీసులో కష్టపడి సంపాదించుకున్న డబ్బంతా ఒకే ఒక్క సైబర్ మోసంతో ఆవిరైపోవడం ఆయనను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిందన్న అభిప్రాయం కనిపిస్తోంది. రాజకీయాల్లోకి రాకముందే తనదైన ముద్ర వేసిన లక్ష్మీనారాయణ, 2019 నుంచి ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉన్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా రైతులు, యువతకు అండగా నిలిచారు. తన నిజాయితీతో కూడబెట్టిన సంపాదన అంతా కళ్లముందే మాయమైపోవడంతో ఆయనకు ఆర్థిక కష్టాలు చుట్టుముట్టినట్లుగాభావిస్తున్నారు. రాజకీయాల్లో ఓటమి ఆయనను ఎప్పుడూ కుంగదీయలేదు. రాజకీయాలు కాకపోతే రైతుల కోసం..యువత కోసం పని చేస్తానని ఆయన ప్రత్యేక సంస్థ పెట్టారు. భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం కూడా చేస్తున్నారు. పిల్లలకు మంచి చెప్పాలని ఎవరు పిలిచినా వెళ్లి చెప్పి వస్తారు. అలాంటి ఆయన అన్నీ వదిలేసి ఉద్యోగంలో చేరాలనుకోవడం వెనుక బలమైన కారణం ఉండటం సహజమే. అది ఆర్థిక సంక్షోభం అనే ఎక్కువ మంది భావిస్తున్నారు. 2024 ఎన్నికల్లో సొంత పార్టీ పెట్టి పోటీ చేసినా ఆశించిన ఫలితం రాలేదు. అటు రాజకీయ వైఫల్యం, ఇటు సైబర్ నేరం వల్ల కలిగిన భారీ నష్టం కారణంగా.. తన కుటుంబ బాధ్యతలు మరియు జీవన పోరాటం కోసం ఆయన మళ్లీ ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకున్నట్లుగా భావిస్తున్నారు. ఐపీఎస్‌గా ఎన్నికయి పోలీస్ ఆఫీసర్ అయ్యారు కానీ.. ఆయన ఇంజినీరింగ్ చదివారు. మేఘా గ్రూప్, ఆయనకు కీలక బాధ్యతలను అప్పగించింది. ఆ సంస్థ అనుబంధ కంపెనీ అయిన ఈవీ ట్రాన్స్ లో ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీనారాయణ బాధ్యతలు చేపట్టారు. ప్రజా క్షేత్రంలో ఉండి వ్యవస్థను మార్చాలనే గొప్ప ఆశయం ఉన్నప్పటికీ, సైబర్ నేరగాళ్ల కారణంగా ఎదురైన ఆర్థిక విపత్తు ఆయనను అనివార్యంగా మళ్లీ వృత్తిపరమైన కెరీర్ వైపు నడిపించిందని అనుకోవచ్చు.

## మంథని మున్సిపల్ చైర్మన్ గా ఓడ్నాల శ్రీనివాస్

**-వైస్ చైర్మన్ గా ముస్కుల సహేందర్ రెడ్డి**
**-ప్రమాణస్వీకారం చేయించిన అధికారులు**



**మంథని:**మంథని మున్సిపల్ నూతన చైర్మన్ గా ఓడ్నాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సోమవారం మంథని మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లతో ప్రొసీడింగ్ అధికారి, మంథని ఆర్డీవో సురేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ చైర్మన్ గా ఓడ్నాల శ్రీనివాస్ ను కౌన్సిలర్లు మద్దికట్ల స్రవంతి, మారుపాక నిహారిక లు ప్రతిపాదించగా, వైస్ చైర్మన్ గా ముస్కుల సహేందర్ రెడ్డిని ప్రతిపాదకులుగా కుర్ర లింగయ్య, పెంటరి రాజు లు ప్రతిపాదించారు. మున్సిపల్ చైర్మన్ పదవికి, వైస్ చైర్మన్ పదవికి ఒక్కొక్క నామినేషన్ రావడంతో వీరు ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. వీరితో నూతన చైర్మన్ గా, వైస్ చైర్మన్ గా ప్రొసీడింగ్ అధికారి, మంథని ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ ప్రమాణ స్వీకారం చేయించారు.

## ఈ నెల 19, 20 న ఓయూలో వీసీల మీట్

**హైదరాబాద్:**ఫిబ్రవరి 19,20 వ తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో వైస్ ఛాన్సలర్స్ మీట్ 2025 - 26 నిర్వహించనున్నారు.ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఓయూ వీసీ ప్రొ.కుమార్ ఓయూ గెస్ట్ హౌస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ మీట్ కు రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వీసీ తెలిపారు.ఈ మీట్ కు ఆరు రాష్ట్రాల నుండి 120 మంది వైస్ ఛాన్సలర్లు పాల్గొంటారని వివరించారు. ఈ మీట్ ముఖ్యంగా ఉన్నత విద్యలను ఏ విధంగా బలోపేతం చేయాలి, నైతిక విలువలతో కూడిన పాలనా విధానాన్ని ఏ విధంగా కొనసాగించాలి, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వల్ల జరిగే లాభాలు నష్టాలు ఏ విధంగా ఉంటాయి, ఉన్నత విద్యలో విధానపరమైన సంస్కరణల పైన, విశ్వవిద్యాలయాల పరస్పర అనుసంధానం ఏ విధంగా కొనసాగాలి అనే విషయాలపైన చర్చ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఓయూ రిజిస్టర్ ప్రొ. నరేష్ రెడ్డి, ఓ ఎస్ డి ప్రొ. జితేందర్ నాయక్, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొ. చంద్రశేఖర్, సి ఎఫ్ డి ఆర్ డైరెక్టర్ ప్రొ.సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పరోక్ష ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్లో కట్టుదిట్టమైన భద్రత

**సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్:**రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రేపు (ఫిబ్రవరి 17, మంగళవారం) జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ మరియు మున్సిపాలిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల పరోక్ష ఎన్నికల కోసం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ సర్వం సిద్ధమైంది. ఈ ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా ముగిసేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం తెలిపారు.మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించారు.నిషేధాజ్ఞలు అమలు: కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇప్పటికే బి.ఎన్.ఎస్.ఎస్ (దీఛీూా) సెక్షన్ 163 (గతంలోని సెక్షన్ 144) కింద నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఇవి ఫిబ్రవరి 16 ఉదయం 6 గంటల నుండి ఫిబ్రవరి 17 ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటాయి. ఎన్నికలు జరిగే కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంచడంతో పాటు, మున్సిపల్ కార్యాలయాల సమీపంలో గుమిగూడటంపై నిషేధం విధించారు. భద్రతా కారణాల దృష్ట్యా మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లే మార్గాల్లో అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, "ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ గౌరవించాలి. చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసులకు సహకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి" అని కోరారు.

## ఎన్నిక వాయిదా వేయడం దుర్మార్గం: ఎర్రబెల్లి దయాకర్ రావు



**మహబూబాబాద్ జిల్లా:** తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడిన నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికను వాయిదా వేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన విమర్శించారు.ఏబీఎన్‌తో మాట్లాడుతూ.. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యి, పరిస్థితులు సజావుగా ఉన్నప్పటికీ ఎన్నికను వాయిదా వేయడం దుర్మార్గమని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రజల తీర్పును గౌరవించకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వైఖరిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను సంప్రదించేందుకు ఫోన్ చేసినా స్పందించలేదని ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. తొర్రూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా నేపథ్యంలో జిల్లా రాజకీయాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## తెలంగాణ రైతాంగానికి గుడ్‌న్యూస్.. పెండింగ్ బకాయిలు క్లియర్..




**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** ధాన్యం రైతులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఖరీఫ్‌లో సన్న వడ్లు కొనుగోలుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను క్లియర్ చేస్తూ రూ.514.36 కోట్ల నిధులను విడుదల చేసింది. క్వింటల్‌కు రూ.500 చొప్పున బోనస్ రూపంలో రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయి. దీని ద్వారా సుమారు 2.17 లక్షల మంది రైతులు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మొత్తం 1,939.58 కోట్ల రూపాయల బోనస్‌ను చెల్లించింది. రాష్ట్రంలో సన్న బియ్యం సాగును ప్రోత్సహించడం, రైతులకు మెరుగైన గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.రైతుల సంక్షేమమే ప్రాధాన్యంగా .. ధాన్యం కొనుగోళ్లు, బోనస్ చెల్లింపులు, ఎమ్ఎస్‌పీతో పాటు అదనపు ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ నిధుల విడుదలతో పెండింగ్ బకాయిలు దాదాపు పూర్తిగా క్లియర్ అయ్యే అవకాశం ఉంది. రైతులు తమ బ్యాంక్ ఖాతాలను చెక్ చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత కొనుగోలు కేంద్రాలు, సివిల్ సప్లైస్ శాఖను సంప్రదించాలని అధికారులు సూచించారు. పెండింగ్ బకాయిలు విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆత్మరక్షణలో గులాబీ దళం

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు భారత్ రాష్ట్ర సమితిని ఆత్మరక్షణలో పడేలా చేశాయి. "అధికార పక్షంపై వ్యతిరేకత ఉంది.. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు.. గులాబీ జెండా మళ్ళీ రెపరెపలాడుతుంది" అని ఆ పార్టీ అభ్యర్థులు, నేతలు చేసిన ప్రచారం క్షేత్రస్థాయిలో నీటి మూటగానే మిగిలిపోయింది. వెలువడిన ఫలితాలు బీఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర నిరాశను మిగిల్చాయి.మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ తన హవాను కొనసాగించగా, బీఆర్ఎస్ మాత్రం ద్వితీయ స్థానానికే పరిమితమైంది. మొత్తం స్థానాల్లో కాంగ్రెస్ సగానికి పైగా కైవసం చేసుకుని ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. బీఆర్ఎస్ కేవలం 770 వార్డులకే పరిమితం కావడంఅ ఆ పార్టీ బలాన్ని గణనీయంగా తగ్గించినట్లయింది. హైదరాబాద్ చుట్టుపక్కల మినహా రాష్ట్రవ్యాప్తంగా గులాబీ పార్టీ గ్రాఫ్ పడిపోవడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.బీఆర్ఎస్ వైఫల్యానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు బీఆర్ఎస్ కు బలమైన ఓటు బ్యాంక్ ఉన్న పట్టణ ప్రాంతాల్లో ఇప్పుడు కాంగ్రెస్ చొచ్చుకుపోయింది. హైదరాబాద్ చుట్టుపక్కల మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని మున్సిపాలిటీల్లో మాత్రమే బీఆర్ఎస్ ప్రభావం చూపగలిగింది. కానీ, ఉత్తర తెలంగాణ, ఉమ్మడి నల్గొండ వంటి ప్రాంతాల్లో పార్టీ గాలి తీసేసింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతమే ఇప్పుడు కూడా కొనసాగింది. అంటే, పార్టీ కొత్తగా ఓటర్లను ఆకర్షించలేకపోయింది. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు" తమకే పడుతుందని ఆశించిన బీఆర్ఎస్ కు, ఆ ఓట్లు చీలిపోవడం లేదా కాంగ్రెస్ వైపు మొగ్గడం పెద్ద దెబ్బ. అసెంబ్లీ ఎన్నికల తర్వాత వరుసగా ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు పార్టీని వీడటం కేడర్ లో నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసింది. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను నడిపించే నాథుడు కరువవ్వడం బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణం.మున్సిపల్ ఫలితాలను విశ్లేషిస్తే, బీఆర్ఎస్ కేవలం 'గ్రేటర్ హైదరాబాద్' పార్టీగా మారుతోందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. సిటీ శివారు మున్సిపాలిటీల్లో ఆశించిన ఫలితాలు వచ్చినప్పటికీ, జిల్లాల్లోని పురపాలికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసింది. నల్గొండ కార్పొరేషన్ ను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం..., కరీంనగర్, నిజామాబాద్ లో బీజేపీ గట్టి పోటీ ఇవ్వడం చూస్తుంటే




బీఆర్ఎస్ కు తన సొంత ప్రాబల్యం ఉన్న చోట కూడా పట్టు తప్పుతోందని స్పష్టమవుతోంది.అధికారంలో ఉన్న పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఎడ్జ్ ఉండటం సహజమేనని బీఆర్ఎస్ నేతలు సరిపెట్టుకోవచ్చు. కానీ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ వరుస విజయాలు సాధించడం అనేది కేవలం అధికార ప్రభావం మాత్రమే కాదు. కాంగ్రెస్ అమలు చేస్తున్న గ్యారంటీలు, పట్టణ మౌలిక సదుపాయాలపై పెట్టిన దృష్టి ఓటర్లను ఆ పార్టీ వైపు తిప్పుకున్నాయి. బీఆర్ఎస్ నేతలు కేవలం సోషల్ మీడియాలో, టీవీ డిబేట్లలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే తప్ప.. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లి నమ్మకాన్ని కలిగించడంలో విఫలమయ్యారనేది రాజకీయ విశ్లేషకులు చెప్తున్నమాట.బీఆర్ఎస్ ఇకనైనా తన పంథాను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం హైదరాబాద్ కేంద్రంగా రాజకీయం చేస్తే సరిపోదని ఈ ఫలితాలు హెచ్చరిస్తున్నాయి. వార్డు స్థాయి నుండి కమిటీలను బలోపేతం చేయాలి. కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనకపోవడం పార్టీకి మైనస్ అవుతోంది. కేవలం కేటీఆర్, హరీష్ రావులపైనే భారం వేయడం వల్ల జిల్లాల్లో పట్టు కోల్పోతున్నారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రజల సమస్యలపై పోరాటాలు చేయడంలో బీఆర్ఎస్ వెనుకబడిందనే భావన ఉంది.మొత్తానికి, ఈ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ కు ఒక వేక్-అప్ కాల్. రాబోయే ఎన్నికల నాటికైనా పుంజుకోవాలంటే, ఆ పార్టీ తన వ్యూహాలను సమూలంగా మార్చుకోవాల్సిందే. లేదంటే తెలంగాణ రాజకీయాల్లో రెండో స్థానాన్ని కూడా కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.రేవంత్ ట్రాప్ లో గులాబీ టీమ్ 2023 ఎన్నికల్లో ఓటమి తర్వాత నుంచి ఆ పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. 2024 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. ఒక సీటు కూడా పార్లమెంట్లో లేకపోగా ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో కూడా పార్టీ ఓటమిపాలైంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే విషయంలో గులాబీ పార్టీ సరైన వ్యూహాలు రచించలేదు అనే విమర్శలు కూడా వచ్చాయి పంచాయతీ ఎన్నికల్లో సైతం పార్టీ సత్తా చాట లేకపోవడం ఆందోళన కలిగించింది. బలంగా ఉన్న జిల్లాలో కూడా పార్టీ క్యాడర్ అనుకున్న స్థాయిలో ఫలితాలను రాబట్ట లేకపోయింది. ఇక తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మంత్రులుగా పనిచేసిన వారి నియోజకవర్గాల్లో కూడా పార్టీ ఓటమి పాలు కావడం అధిష్టానం జీర్ణించుకోలేకపోతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆ పార్టీ ఒకప్పుడు బలంగా కనపడింది. అయితే కాంగ్రెస్ పార్టీ దెబ్బకు ఈ జిల్లాలో పూర్తిగా గులాబీ పార్టీ కనుమరుగైన పరిస్థితి కనపడుతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కటంటే ఒక్క మున్సిపల్ స్థానాన్ని కూడా ఆ పార్టీ కైవసం చేసుకో లేకపోయింది.నిజామాబాద్ జిల్లాలో కూడా ఇదే పరిస్థితి ఆ పార్టీకి ఎదురైంది. నిజామాబాద్ జిల్లాలో కూడా పార్టీ ఖాతా తెరవలేదు. 116 స్థానాల్లో ఎన్నికలు జరిగితే కేవలం 13 స్థానాల్లో మాత్రమే పార్టీ విజయం సాధించడం పట్ల అధిష్టానం తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీని వెనక కారణాలేంటి అనేది పక్కన పెడితే నాయకులను మార్చాల్సిందే అనే అభిప్రాయాలు వినపడుతున్నాయి. పార్టీ నేతలు అందరూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ ముందుకు వెళ్లడమే మినహా నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడం లేదని విమర్శలు కూడా ఉన్నాయి. రేవంత్ రెడ్డి చేస్తున్న విమర్శలకు ప్రతి విమర్శలు చేయడం మినహా, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారని ఆవేదన కేడర్లో వ్యక్తం అవుతుంది. ఎంతసేపు అధిష్టానం మెప్పుకోసం ప్రయత్నం చేయడం మినహా పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టకపోవడాన్ని కేడర్ జీర్ణించుకోవడం లేదు. కనీసం ఉమ్మడి మెదక్ జిల్లాలో కూడా పార్టీ బలంగా ప్రభావం చూపించలేకపోవడాన్ని కేడర్ తప్పుపడుతోంది.

# కొత్త సమీకరణాలకు తెర లేపిన కమలం

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. ప్రధానంగా భారతీయ జనతా పార్టీ సాధించిన ప్రగతి ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతుండగా, క్షేత్రస్థాయిలో ఇంకా ఎదుర్కోవాల్సిన సవాళ్లను కూడా స్పష్టం చేస్తోంది. గతంతో పోలిస్తే ఓట్ల శాతం, సీట్ల సంఖ్య గణనీయంగా పెరగడం ద్వారా కమలనాథులు తమ పట్టును నిరూపించుకున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బీజేపీ తన బలాన్ని చాటుకోగా, దక్షిణాది జిల్లాల్లో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది.ఈ ఎన్నికల్లో బీజేపీ సాధించిన అతిపెద్ద విజయం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో బీజేపీ ఇక్కడ చరిత్ర సృష్టించింది. గతంలో కేవలం 13 స్థానాలకే పరిమితమైన పార్టీ, ఈసారి ఏకంగా 30 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీల మద్దతుతో మేయర్ పీఠాన్ని దక్కించుకునే దిశగా అడుగులు వేస్తోంది. బండి సంజయ్ తన కంచుకోటలో సత్తా చాటడం పార్టీకి



జాతీయ స్థాయిలోనూ గుర్తింపునిచ్చింది.రాష్ట్రంలోని ఆరు ప్రధాన కార్పొరేషన్లలో మహబూబ్‌నగర్ మినహా బీజేపీ, బీఆర్ఎస్ కంటే మెరుగైన ఫలితాలు సాధించడం విశేషం. ఈ ఆరు కార్పొరేషన్లలోని 354 డివిజన్లకు గాను బీజేపీ 69 స్థానాలు గెలుచుకోగా, బీఆర్ఎస్ 48 స్థానాలకే పరిమితమైంది.ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్ కంటే బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకోవడం ఆసక్తికరంగా మారింది.బీజేపీ గత ఎన్నికలతో పోలిస్తే తన గ్రాఫ్‌ను గణనీయంగా పెంచుకుంది. గతంలో 239 వార్డుల్లో గెలిచిన బీజేపీ,ఈసారి సుమారు 350 వార్డుల్లో విజయం సాధించింది. గత ఎన్నికల్లో 13 శాతంగా ఉన్న ఓట్ల శాతం, ఈసారి 20 శాతానికి పైగా పెరిగింది. గతంలో ఆమన్‌గల్, మక్తల్‌కే పరిమితమైన చైర్మన్ పదవులు, ఈసారి ఆదిలాబాద్, నారాయణపేట, మెట్‌పల్లి, రాయికల్ వంటి చోట్ల దక్కించుకునే అవకాశం ఏర్పడింది.పార్టీకి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ, వారి నియోజకవర్గాల్లో ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. ఆదిలాబాద్ లో పాయల్ శంకర్ ఆధ్వర్యంలో 49 వార్డుల్లో 21 స్థానాలు గెలిచి, ఎక్స్-అఫీషియో సభ్యుల మద్దతుతో చైర్మన్ పీఠానికి చేరువయ్యారు. కామారెడ్డిలో ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి తన పట్టు నిలుపుకున్నారు. 18 స్థానాలు సాధించారు. నిర్మల్ లో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలో 13 స్థానాలకే పరిమితం కావడం కొంత నిరాశ కలిగించింది. ఆర్మూర్, భైంసా, సిర్పూర్‌లలో పార్టీ ఆశించిన స్థాయిలో సీట్లు సాధించలేకపోయింది.

# అదే తీరు...అదే జోరు..!

**చాపకింద నీరులా కల్తీ మద్యం...?**
**చిన్న బ్రాండ్‌లే లక్ష్యంగా కల్తీ...**
**సీల్, క్యాప్ ఉన్నది ఉన్నట్లే...**
**సిండికేట్ ముసుగులో అక్రమ తతంగం...?**
**మద్యం ప్రియుల ఆరోగ్యాలను హరిస్తున్న స్పిరిట్..**
**మద్యం ప్రవాహం పై జోరుగా చర్చ...**
**జాడ లేని "ఆ" శాఖ.. అధికారులు ఎక్కడ..?**
**సామాజిక సేవకులు కర్నె బాబురావు**

**భద్రాద్రి కొత్తగూడెం:**మద్యపానం ఆరోగ్యానికి హానికరం అన్నమాట చాటున మద్యం ప్రియుల ఆరోగ్యా లకు మరింత చేటు అయ్యేలా చిన్న బ్రాండ్‌లే లక్ష్యంగా అశ్వాపురంలో కల్తీ దందాకు సిండికేట్ ముసుగులో కొందరు అక్రమార్కులు తెరలేపారని, సామాజిక సేవకులు కర్నే బాబురావు ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ,డబ్బు అక్రమ సంపాదనే లక్ష్యంగా పావులు కదుపుతూ మద్యం బాటిళ్లలో కల్తీ చేస్తూ కొందరు,మద్యం బ్రాండ్లలో స్పిరిట్, కలుపుతూ నయా దందాకు తెరలేపారన్నారు. క్వాటర్ సీసా మొదలు ఫుల్ బాటిళ్ల వరకు యథేచ్ఛగా మద్యాన్ని కల్తీ చేస్తూ లిక్కర్ మాఫియా లక్షల్లో ఆర్జిస్తున్నారన్న చర్చ డివిజన్ వ్యాప్తంగా వ్యక్తం అవుతోందన్నారు. ముఖ్యంగా మద్యం కల్తీకి సంబంధించి చిన్న బ్రాండ్లు, ఎక్కువ అమ్మకాలు జరిగే మద్యం బాటిళ్లను అక్రమార్కులు ఎంచుకుంటున్నారని,ఆ మండల కేంద్రంగా రాయల్ స్టాగ్, ఐబీ, ఎమ్ హెచ్, మొదలుకుని సిగ్నేచర్, బ్లెండర్స్ ప్రైడ్ వరకు అందుబాటులో లేవనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఓవైపు కొన్ని బ్రాండ్లను వైన్ షాపులో పూర్తిగా దొరక్కుండా చేసి, బెల్ట్ షాపులకు తరలించి ఆ బ్రాండ్లపై భారీగా ఆదాయాన్ని సొమ్ముచే సుకుంటున్న సిండికేట్ మాఫియా మరో వైపు వైన్ షాపులలో నౌకరి నామా లేకుండా ఓ విలేకరి కౌంటర్లో కూర్చొని, ఆయన ప్రొద్దు బలం తోనే ఇదే బ్రాండ్లను దొడ్డి దారిలో బెల్ట్ షాపులకు విక్రయించి ఆ బ్రాండ్లపై భారీగా ఆదాయాన్ని పొందుతుంతరన్నారరు. ఇలా రెండు వైపులా ఆదాయాన్ని పొందిన వైన్ షాప్ నిర్వాహకులు ధన దాహం చాలదు అన్నట్టుగా వ్యవహరిస్తూ సిండికేట్‌గా ఏర్పడిన సదరు వ్యక్తు లు కల్తీ సరుకును బెల్ట్ షాపులకు తరలించి, విక్రయాలు జరుపుతూరనివిమర్శించారువిటి కల్తీకి బెల్ట్ షాపులలో ఎవరూ పెద్దగా ఫిర్యాదులు చేయరన్న ధైర్యంతో నిస్సి గ్గగా కల్తీకి పాల్పడుతున్నా రని, నిత్యం మద్యం సేవించే మందు బాబులు మద్యంలో తేడాను గమనించి సదరు బెల్ట్ షాపు నిర్వాహకులతో గొడవలకు దిగుతున్న సందర్భాలు అనేకం ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్నాయన్నారు.మద్యం కల్తీకి సంబంధించి భౌతికంగా ఎలాంటి అనుమానం రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం వారి పనితనానికి నిదర్శనంగా మారిందన్నారు. ఇందుకోసం ఏండ్లుగా బార్, వైన్స్‌ల్లో పని చేసిన ఓ అనుభవజ్ఞులైన వారిని ఈ అక్రమ దందాకు వాడుకుంటున్నట్లు తెలుస్తుందన్నారు.బాటిల్ సీల్, క్యాప్ ఓపెన్ చేసి మద్యం కల్తీ చేసిన అనంతరం యధావిధి గా మళ్లీ బిగిస్తున్నారని,అనంతరం అసలు మద్యం బాటిళ్ల మాదిరిగానే ఇవి మద్యం ప్రియుల చేతు ల్లోకి వెళ్తున్నాయన్నాని బాబురావు ఆందోళన వ్యక్తం చేశారు. ఓవైపు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్న వారి పై కఠిన చర్యలు చేపట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు క్షణం తీరిక లేదు, మాకేం పట్టదు అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నత అధికారుల స్పందించాలని, నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న విచ్చలవిడి మద్యం తరలింపు, కల్తీ మద్యం పై చర్యలు చేపట్టాలని,బాబురావు డిమాండ్ చేశారు.

## కౌన్సిలర్ ఆకుల యాదగిరి మిస్సింగ్



**ఇబ్రహీంపట్నం:**రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 2వ వార్డ్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి నీ కిడ్నాప్ చేశారు అంటూ కుటుంబ సభ్యులు ఆందోళన కు దిగారు. తన భర్త ఎక్కడ ఉన్నాడో చెప్పాలంటూ భార్య, కొడుకు కంట తడిపెట్టారు. ప్రమాణస్వీకారానికి గైర్హాజరు కావడంతో కుటుంబసభ్యులు మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేసారు. మరోవైపు, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో ప్రమాణస్వీకారం చేయించారు.

## బుల్లెట్ దిగిందా.....

**సంగారెడ్డి:**పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సినిమా డైలాగ్ కొట్టారు. పరోక్షంగా కాంగ్రెస్ పార్టీ, స్థానిక నేతలను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసారు. బుల్లెట్ దిగిందా లేదా అంటూ డైలాగ్ చెబుతూ మహిపాల్ రెడ్డి వెళ్లిపోయారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని 5 మున్సిపాలిటీలను బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేసింది. గుమ్మడిదల, గడ్డపోతారం, ఇంద్రేశం మున్సిపాలిటీలను దక్కించుకుంది. బీజేపీ కౌన్సిలర్ల మద్దతుతో జిన్నారం, బీజేపీ ఎంపీ రఘునందన్ ఎక్స్ అఫిషియో ఓటుతో ఇస్నాపూర్ మున్సిపాలిటీలను కుడా దక్కించుకుంది. ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ పీఠం బిఆర్ఎస్ కైవసం చేసుకుంది.

# గద్వాలలో కాంగ్రెస్ విజయఢంకా

**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 16(స్కై న్యూస్):**చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకొన్నా కాంగ్రెస్ పార్టీ చైర్మన్‌గా తుమ్మల జయలక్ష్మి నరసింహ , వైస్ చైర్మన్‌గా శంకర్ ఎన్నిక గద్వాల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సునాయాస విజయాన్ని నమోదు చేసింది. సోమవారం గద్వాల మున్సిపల్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం లో ఎన్నికల అధికారి నరసింగ రావు అధ్యక్షతన జరిగింది. చైర్మన్ పదవికి అవసరమైన మెజారిటీ 19 ఓట్లు కాగా, కాంగ్రెస్ పార్టీకి 20 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లతో పాటు ఇద్దరు ఇండిపెండెంట్లు, ఒక ఎంఐఎం సభ్యులు మద్దతు కాంగ్రెస్ పార్టీ కి ప్రకటించారు. అదనంగా ఎక్స్-ఆఫీషియో సభ్యుడిగా ఎంపీ మల్లు రవి తన ఓటు హక్కును వినియోగించుకోవడంతో కాంగ్రెస్ మెజారిటీని దాటింది. ప్రతిపక్ష పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ కలిసి కూటమిగా పోటీ




చేస్తామని ముందుగా ప్రకటించినప్పటికీ, చివరకు బీఆర్ఎస్ పార్టీ తరపున మాత్రమే అభ్యర్థులు పోటీ చేశారు.చైర్మన్ గా అనిత నరసింహ, వైస్ చైర్మన్ గా వెంకటేష్ ను ప్రకటించగా వారికి కేవలం 11 ఓట్లు మాత్రమే లభించాయి. బీజేపీ సభ్యులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా హాల్‌ను వీడి వెళ్లిపోయారు. ఎన్నికల అధికారి నర్సింగరావు అధికారికంగా చైర్మన్‌గా తుమ్మల జయలక్ష్మి నరసింహ , వైస్ చైర్మన్‌గా శంకర్ ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు. అనంతరం ఇద్దరూ పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు. గద్వాల మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు ఇది కీలక రాజకీయ విజయంగా భావిస్తున్నారు.ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పాల్గొన్నారువోటింగ్ కు దూరంగా వున్నా ఎమ్మెల్యే బండ్ల మొదటి నుండి బి ఆర్ ఎస్ పార్టీ స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పై విప్ అధికారం తో ఇబ్బందులకు గురిచేయాలనీ ప్రయత్నం చేయగా ఆయన అత్యంత వ్యూహం తో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు దూరంగా వుండి తన ఎక్స్ ఆఫీసీయో ఓటు ను వినియోగించుకోలేదు.

# అభివృద్ధి సంక్షేమమే ఎజెండాగా పని చేస్తాం

**మునిసిపల్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్**



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 16( స్కైన్యూస్)** మునిసిపల్ ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ అభివృద్ధి సంక్షేమమే ఎజెండాగా పనిచేస్తూ అన్ని వార్డులను సమదృష్టితో నిధులను మంజూరు చేస్తూ తెలంగాణ రాష్ట్రంలోనే నాగర్ కర్నూల్ మున్సిపాలిటీని అగ్రస్థానంలో నిలుపుతామని మునిసిపల్ చైర్మన్ తీగల సునీంద్ర కుమార్ వైస్ చైర్మన్ బాదం రమేష్ లు అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇటీవల ఎన్నికైన కౌన్సిలర్లు సోమవారం ప్రమాణ స్వీకారం నిర్వహించారు ఎన్నికల ప్రెసిడెంట్ అధికారి సురేష్ బాబు మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయగా డి.ఎస్.పి బుర్రి శ్రీనివాస్ యాదవ్ సిఐ అశోక్ రెడ్డి ఎస్సై గోవర్ధన్ లు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశారు అనంతరం ప్రమాణ స్వీకారం చేసిన వారు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ వార్డులను తీర్చిదిద్దుతామని అన్నారు. మునిసిపల్ చైర్మన్ అభ్యర్థిగా తీగల సునింద్ర కుమార్ ను నాలుగవ వార్డు కౌన్సిలర్ వసంత మరియు 21వ వార్డు కౌన్సిలర్ పాడిగే శంకర్ లు బలపరచగా వైస్ చైర్మన్ గా బాదం రమేష్ ను 11వ వార్డు కౌన్సిలర్ ఆసిఫా బేగం ఆరవ వార్డు కౌన్సిలర్ శ్రీనివాసులు బలపరచగా వారి ఎన్నికలు ఏకగ్రీవంగా కొనసాగాయి అనంతరం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు తో పాటు మున్సిపల్ అధికారులు వారిని ఘనంగా సన్మానించారు

# ప్రశాంతంగా గద్వాల పురపాలక చైర్పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక...

## ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు వినియోగించుకున్న ఎంపీ మల్లు రవి

## ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు.

**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 16 (స్కై న్యూస్):**గద్వాల పురపాలక సంఘం చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు తెలిపారు. సోమవారం గద్వాల పురపాలక సంఘం కార్యాలయంలో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించి 37 వార్డుల సభ్యులుగా ఎన్నికైన కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం, చైర్ పర్సన్, వైస్ చైర్మన్ పదవుల ఎన్నిక కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఎన్నికైన సభ్యులతో అదనపు కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12:30 గంటలకు చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున 33వ వార్డు నుంచి కౌన్సిలర్ గా ఎన్నికైన జయలక్ష్మిని చైర్ పర్సన్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున 35వ వార్డు నుంచి ఎన్నికైన ఎండి బాబర్ ప్రతిపాదించగా, 28వ వార్డు నుంచి కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ బలపరిచారు. బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి 23వ వార్డు సభ్యురాలిగా గెలుపొందిన అనిత కుమారిని అదే పార్టీ నుంచి ఏడవ వార్డు సభ్యుడిగా గెలుపొందిన జగదీష్ చైర్ పర్సన్ అభ్యర్థిగా ప్రకటించగా, 20వ వార్డు సభ్యులు నరసింహులు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. చేతులెత్తే విధానంలో ఇరు పార్టీల నుంచి చైర్పర్సన్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిలో మొదట అనిత కుమారికి చేతులెత్తే విధానంలో ఓటు వేయాల్సిందిగా అదనపు కలెక్టర్ నర్సింగరావు కోరారు. బిఆర్ఎస్ నుంచి గెలుపొందిన 11మంది సభ్యులు అనంత కుమారికి మద్దతుగా చేతులెత్తే విధానం ద్వారా మద్దతు ప్రకటించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ తరపున చైర్పర్సన్ అభ్యర్థిగా బరిలో నిలిచిన జయలక్ష్మికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికైన 16 మంది, స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన ఇరువురు, ఎంఐఎం నుంచి గెలుపొందిన ఒకరు మొత్తం 19 మంది కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేతులెత్తే విధానంలో నాగర్కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మల్లు రవి చెయ్యి ఎత్తు విధానం ద్వారా ఓటు వేయడంతో మొత్తం కోరంకు కావలసిన 20 మంది మద్దతు ఉండడంతో జయలక్ష్మిని గద్వాల పురపాలక సంఘం చైర్పర్సన్ గా ఎన్నికైనట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రమే విప్ జారీ చేయడం జరిగిందని, ఇతర పార్టీల నుంచి విప్ జారీ చేయబడలేదని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నర్సింగరావు పేర్కొన్నారు. అనంతరం వైస్ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ నుంచి 14వ వార్డు సభ్యుడు శంకర్ ను 9వ వార్డు నుంచి కాంగ్రెస్ సభ్యులుగా గెలుపొందిన రామలింగేశ్వర కామ్లే ప్రతిపాదించగా, 3వ వార్డు నుంచి అదే పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన నాగులు బలపరిచారు. బిఆర్ఎస్ పార్టీ వైస్ చైర్మన్ అభ్యర్థిగా 21 వార్డు నుంచి గెలుపొందిన పులిపాటి వెంకటేష్ ను 20వ వార్డు సభ్యులు నరసింహులు ప్రతిపాదించగా, ఐదవ వార్డ్ సభ్యులు చిన్నసంటన్న బలపరిచారు. మొదట పులిపాటి వెంకటేశు కు చేతులెత్తే విధానంలో ఓటు వేయాల్సిందిగా అదనపు కలెక్టర్ నర్సింగరావు కోరగా 11 మంది సభ్యులు అతనికి మద్దతు పలికారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన శంకర్ కు 16 మంది కాంగ్రెస్ సభ్యులతోపాటు, స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన ఇరువురు, ఎంఐఎం నుంచి గెలుపొందిన ఒకరు మొత్తం 19 మంది కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేతులెత్తే విధానంలో నాగర్కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మల్లు రవి చేతులెత్తే విధానం ద్వారా ఓటు వేయడంతో మొత్తం కోరంకు కావలసిన 20 మంది మద్దతు ఉండడంతో శంకర్ ను వైస్ చైర్మన్ గా ఎన్నికైనట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు ప్రకటించారు. అనంతరం చైర్పర్సన్ గా ఎన్నికైన జయలక్ష్మి తో, వైఫ్ చైర్మన్ గా ఎన్నికైన శంకర్ తో అదనపు కలెక్టర్ నర్సింగరావు ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమంలో గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఇతర ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలి

**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 16 (స్కై న్యూస్):**జిల్లాలో దివ్యాంగుల సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక నిమిత్తం సర్టిఫికేట్ పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమం ఈ నెల 18వ తేదీన ఐడిఓసి లోని మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం, రూమ్ నెం. 33లో నిర్వహించబడుతుందని ఆమె తెలిపారు. హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ ప్రతులను మరియు ఆన్లైన్ అప్లికేషన్తో పాటు సదరం సర్టిఫికేట్, ఆధార్, రేషన్, కుల, ఆదాయ దృవీకరణ పత్రం, విద్యా ధ్రువ పత్రాలు, బోనఫైడ్ సర్టిఫికెట్ మరియు మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్స్ కు దరఖాస్తు చేసిన వారు రూ.100/- బాండ్ పేపర్ పై నిరుద్యోగ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకొని రావలెను. పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులను అనర్హులుగా పరిగణించబడుతారని ఆమె స్పష్టం చేశారు.

# కొత్తగూడెం న్యాయవాదుల విధుల బహిష్కరణ..

**కొత్తగూడెం ఫిబ్రవరి 16 (స్కై న్యూస్):** హైదరాబాద్ లో అత్తపూర్ న్యాయవాది మహమ్మద్ ఖదీర్ దారుణ హత్యకు నిరసనగా ఫేడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ఫర్ తెలంగాణ ఇచ్చిన పిలుపులో భాగంగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జనపరెడ్డి గోపి కృష్ణ అధ్యక్షతన కొత్తగూడెం బార్ అసోసియేషన్



అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి న్యాయవాది మహమ్మద్ ఖదీర్ దారుణ హత్య కు నిరసనగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమ వారం విధులు బహిష్కరణ చేశారు. అనంతరం ఉపాధ్యక్షుడు జనపరెడ్డి గోపి కృష్ణ అధ్యక్షతన కోర్టు గేట్ బయట ప్లకార్డ్ లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాదుల రక్షణ కు అవసరం అయిన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వలను గోపి కృష్ణ డిమాండ్ చేశారు. న్యాయవాదులకు సంరక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో ఫేడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ఫర్ తెలంగాణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లను జనపరెడ్డి గోపి కృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు హన్మంతరావు, చిరంజీవి రావు, పి. నాగేశ్వరరావు, కే.పుల్లయ్య, మన్మోహన్, యెర్రాపాటి కృష్ణ, శ్రీధర్, మహమ్మద్ సాదిక్ పాషా, మారపాక రమేష్, మహేష్, చిన్ని కృష్ణ, విజయ్, రమేష్, ఏర్ర శ్రీను, మధన్ మోహన్, కేపి, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు చేయుటకు డ్రోనర్ ద్వారా వాసవి దృశ్యాలు

**సర్పంచ్ కోట్ల ఆంజనేయులు**

**చిన్న చింతకుంట ఫిబ్రవరి 16 (స్కై న్యూస్);** ఉంద్యాల గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి పనులను చేయుటకు గ్రామంలోని సమస్యలను తొలగించాలని డ్రైనేజ్ పనులను, పాడుపడ్డ బావులను పుడుచుటకు డ్రోన్



ద్వారా వాస్తవ చిత్ర దృశ్యాలను పై అధికారులకు మరియు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా ముందుకు వెళ్లాలని పరిశీలిస్తున్న గ్రామ సర్పంచ్ కోట్ల ఆంజనేయులు ఎం, కృష్ణయ్య 1వార్డు సభ్యులు, ఇంద్రసేన రెడ్డి 2 వార్డు సభ్యులు, డ్రైవర్ బాబు 5 వార్డు సభ్యులు మరియు పంచాయతీ కార్యదర్శి మహేష్ తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నాగారం శ్రీ భవాని నాగ లింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్బంగా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

## అంగరంగ వైభవంగా శ్రీ భవాని నాగలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు

## భక్తులకు సోమవారము అన్న ప్రసాద వితరణలు చేశారు మాదిరెడ్డి ప్రతాపరెడ్డి

## శ్రీ భవాని నాగలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి జనవరి 16 (స్కై న్యూస్):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నగరంలోని భవాని నాగ లింగేశ్వర స్వామి ఆలయంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగిందని గుడి చైర్మన్ ధర్మకర్త మాదిరెడ్డి ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారంలోని శ్రీ భవాని నాగలింగేశ్వర స్వామి ఆలయం అతి పురాతనమైన ఆలయమని ఆ గుడిని అభివృద్ధి పరచడం జరిగిందని ఆలయం ప్రతి సంవత్సరం ఉగాదిన కొత్త సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరుగుతుందని, ఈ సంవత్సరం మహా శివరాత్రి సందర్భంగా అవి భక్తులకు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తామని వేలాదిమంది చుట్టుప్రక్కల కాలనీల నుండి వచ్చి శ్రీ భవాని నాగలింగేశ్వర స్వామిని దర్శించుకుంటారని ఆయన తెలిపారు. శ్రీ భవాని నాగ లింగేశ్వర స్వామి ఆలయం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నూతన సంవత్సర క్యాలెండర్ను భక్తులకు పెద్ద ఎత్తున అందజేస్తామని, శ్రీ భవాని





నాగలింగేశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రికి దర్శించుకొని మొక్కులు మొక్కిన వారికి అన్ని నెరవేరుతాయని ప్రసిద్ధి అందుకే పెద్ద ఎత్తున మహాశివరాత్రికి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి శ్రీ భవాని నాగలింగేశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకొని పునీతులు అవుతారని ఆయన అన్నారు. ఈ ఆలయంలో మహా శివరాత్రిసందర్భంగా యజ్ఞ,హోమాలు పూజలు అన్ని భక్తులకు ఏర్పాటు చేశామని అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు వేలాది మంది వచ్చి శ్రీ భవాని నాగలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారని వచ్చినటువంటి భక్తులకు చేయను భవాని నాగలింగేశ్వర స్వామి కటాక్షం ఎల్లవేళలా ఉంటుందని ఆయన అన్నారు. సోమవారం నాడు ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదములను అందించడం జరిగిందని ఈ అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారని తెలిపారు.

# పేట పుర పట్టపురాణి కొండా శ్వేత సత్యయాదవ్

**వైస్ చైర్ పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి**

**నారాయణపేట ఫిబ్రవరి 16: (స్కై న్యూస్ )** నారాయణపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా కొండా శ్వేత సత్యయాదవ్ ఎన్నికయ్యారు. వైస్ చైర్ పర్సన్ గా మంజుల జి ఆర్ రెడ్డి ఎన్నికయ్యారు.ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు సోమవారం మున్సిపాలిటీ చైర్మన్ , వైస్ చైర్మన్ ఎన్నిక ప్రత్యేక అధికారి రామ్ చందర్ నాయక్ నిర్వహించారు.చైర్ పర్సన్ గా ఎన్నికైన కొండా శ్వేతా సత్య యాదవ్ తో ప్రమాణ స్వీకారం చేయించారు.నారాయణ పేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ అభ్యర్థిగా బీజేపీ నుంచి కొండా శ్వేతా సత్య యాదవ్ ను 5 వ వార్డు కౌన్సిలర్ రాఘవేంద్ర ప్రతిపాదించగా. 1వ వార్డు కౌన్సిలర్ సత్య రఘుపాల్ బల పరిచారు.కాంగ్రెస్ నుంచి 9వ వార్డు కౌన్సిలర్ మహేశ్ . 20 వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ శ్వేతను చైర్ పర్సన్ అభ్యర్థి గా ప్రతి పాదించగ, 18 వ కౌన్సిలర్ గొల్ల రవి తేజ్ బలపర్చారు.అనంతరం జరిగిన ఓటింగ్ లో బీజేపీ చైర్ పర్సన్ అభ్యర్థి కొండా శ్వేతా సత్య యాదవ్ ను ఎంపీ డీకే అరుణ ఎక్స్ ఆఫీసీయో సభ్యురాలితో పాటు మిగతా 11 మంది బీజేపీ కౌన్సిలర్లతో పాటు పదో వార్డు స్వతంత్ర కౌన్సిలర్ తో కలిపి మొత్తం 13 మంది చేతులెత్తి ఓటు వేశారు. కాంగ్రె స్ నుంచి ఎక్స్ ఆఫీసీయో సభ్యురాలు ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, మిగతా కాంగ్రెస్ కౌన్సిలరు 7 మంది, ఇద్దరు ఎం.ఐ.ఎం. ఒక ఏ.ఐ.ఎఫ్.బి. కౌన్సిలర్ తో కలిపి మొత్తం 11 మంది చేతులెత్తి ఓటు వేశారు.దాంతో ఎన్నికల ప్రత్యేక అధికారి రామ్ చందర్ నాయక్ 13 మంది ఓట్లతో బీజేపీ అభ్యర్థి కొండా శ్వేతా సత్య యాదవ్ ను చైర్ పర్సన్ గా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటించారు.అనంతరం నిర్వహించిన వైస్ చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ నుంచి 11వ వార్డు కౌన్సిలర్ భాగ్య వతినిని 9 వ వార్డు కౌన్సిలర్ మహేష్ ప్రతిపాదించగా18 వ వార్డు కౌన్సిలర్ రవితేజ బల పరిచారు.అలాగే బిజెపి నుంచి వైస్ చైర్మన్ కోసం బిజెపి నుంచి 6 వవార్డు కౌన్సిలర్ మంజులను 1వ వార్డు కౌన్సిలర్ సత్య రఘుపాల్ ప్రతిపాదించగా 5వ వార్డు కౌన్సిలర్ రాఘవేంద్ర బలపరిచారు.ఓటింగ్ నిర్వహించగా మజ్లిస్





తటస్థంగా ఉండడంతో బాగ్యవతికి 8 ఓట్లు రాగా బిజెపి 6 వవార్డు కౌన్సిలర్ మంజులకు ఎంపీ ఓటు తో కలిపి 13 ఓట్లు వచ్చాయి.దాంతోమంజుల ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రామ్ చందర్ నాయక్ ప్రకటించారు.

# కొండా దంపతుల కృషితోనే 19వ వార్డు కైవసం



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 16( స్కై న్యూస్)** మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సునీత విజయం వెనుక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండా మణెమ్మ నాగేష్ దంపతుల కృషి ఎంతో ఉందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో బిజెపి నాయకులు దూసుకుపోతున్న తరుణంలో వార్డ్ ఇన్చార్జిలుగా వచ్చిన కొండ నాగేష్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని కుల సంఘాలతో చర్చించి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారంలో ప్రణాళిక బద్ధంగా సాగడంతో విజయం సాధించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. అదే వాడు నుండి పోటీ చేస్తున్న ఒక పార్టీ అభ్యర్థిని ఓడించడమే లక్ష్యంగా వారి స్వగ్రామానికి చెందిన కొండా నాగేష్ దంపతులు ప్రత్యేకంగా ఇన్చార్జి బాధ్యతలు తీసుకున్నామని ప్రణాళికలు ప్రకారమే ముందుకు సాగుతూ 19వ వార్డులో కాంగ్రెస్ జెండా ఎగురవేసినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు

# మరణానంతరం శరీర దానం అద్భుతం





**కొత్తగూడెం ఫిబ్రవరి 16 (స్కై న్యూస్):** మెడికల్ కాలేజీ కి శరీర దాన దరఖాస్తు ను ఇచ్చిన గొల్లపల్లి దయానంద్,రావు, భూక్యా భిక్కులాల్, భూక్యా హచ్మి వినయ్,ఝాన్సీ రాణి నేత్ర, అవయవ దాన ప్రోత్సహకూల సంగ వ్యవస్థాపకులు కొచ్చెర్ల కమల రాణి మాట్లాడుతూ సంస్థ స్థాపించినప్పటినుండి ఇప్పటివరకు 10మంది దానం చేసారని మెడికల్ కాలేజీ స్టూడెంట్స్ కూ ప్రాక్టీకల్స్ కూ ఉపయోగిస్తారని, మనం చనిపోయిన తరువాత ఇచ్చే ఈ డొనేషన్ కుటుంబ సభ్యులకు ముందుగా తెలియ చేసీ ఆ తరువాతనే వారి సమక్షంలో మనం దరఖాస్తు ఇవ్వాల్సి వస్తుందని, బ్రతికున్నప్పుడే కాదు చనిపోయిన తరువాత కూడా ఇలా ఉపయోగ పడడం చాలా సంతోషం అన్నారు. అలాగే దయానందు లాంటి పెద్దమనిషులు ఇవ్వడం వలన అందరికి అవగాహనా పెరుగుతుందనీయు, ఎవరైనా ఇలా నేత్ర, అవయవాలు దానం చేయాలి అంటే ఈ నంబర్ కూ సంప్రదించగలరని 8919569524 ఝాన్సీ రాణి నేత్ర, అవయవ దాన ప్రోత్సహకూల సంగ వ్యవస్థాపకులు కొచ్చెర్ల కమల రాణి అన్నారు.

# దేవరకద్ర మున్సిపాలిటీ కాంగ్రెస్ హస్త గతం



**దేవరకద్ర ఫిబ్రవరి 16 (స్కై న్యూస్);** దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన దమయంతి కి, వైస్ చైర్మన్ గా ఎన్నికైన యుగంధర్ రెడ్డి కి, కాంగ్రెస్ కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి.తదనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన విజయాన్ని అందించిన దేవరకద్ర, కొత్తకోట, భూత్పూర్ మున్సిపాలిటీ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ ఎన్నికల ఫలితాలే రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పునరావృతం అవుతాయని, రాష్ట్రంలో మరోసారి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని అన్నారు.నూతనంగా ఎన్నికైన మున్సిపాలిటీ చైర్మన్ లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, కష్టపడి పని చేసి ప్రజల మన్ననలు పొందాలని కోరారు.

# ప్రతి ఇంటికి అభివృద్ధి పలాలు అందిస్తాం

**పార్టీల కతీతంగా ప్రజా పాలన.**

**పట్టణాభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం.**

**అభివృద్ధికి ప్రతిపక్షాలు సహకరించాలి.**



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 16 (స్కై న్యూస్)** మునిసిపాలిటీలోని ప్రతి ఇంటికి రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా మునిసిపాలిటీ పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి నూతనంగా చైర్మన్ గా ఎన్నికైన తీగల సునింద్ర కుమార్ వైస్ చైర్మన్ బాదం రమేష్ లు అన్నారు ప్రమాణ స్వీకార బాధ్యతలు అనంతరం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రెండు సంవత్సరాల పాలనతో సంతృప్తి చెందిన ప్రజలు 24 వార్డులలో 18 కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామని ముఖ్యమంత్రి మరియు ఉపముఖ్యమంత్రి సహాయ సహకారాలతో మునిసిపాలిటీకి అనేక నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేశామని వివరించారు. ప్రతి ఒక్కరికి విద్యా వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని పార్టీలకు అతీతంగా వార్డులను తీర్చిదిద్దుతామని అందుకు అందరూ సహకరించాలని కోరారు. పట్టణంలో ప్రజా పాలన ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కౌన్సిలర్లకు అండగా నిలుస్తామన్నారు ఈ సందర్భంగా చైర్మన్ తీగల సునీంద్ర మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో మునిసిపాలిటీ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల అభివృద్ధి సంక్షేమానికి అన్ని రకాలుగా సహాయ పడతామని అన్నారు వైస్ చైర్మన్ బాదం రమేష్ మాట్లాడుతూ పట్టణంలో జరిగే అభివృద్ధి సంక్షేమ పనులకు ప్రతిపక్షాలు సహకరించాలని అధికారపక్షంగా బాధ్యతతో పని చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు పాల్గొన్నారు

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో

# అక్రమ రేషన్ బియ్యం దందా

**ప్రభుత్వ ఉచిత పథకాలపై మాఫియా కన్ను**

**సివిల్ సప్లై, పోలీసుల నిర్లక్ష్యం కు నిదర్శనం.?**

**అధికారుల కనుసైగల్లోనే ఇదే రేషన్ బియ్యం అక్రమ సరఫరా**

**కిందిస్థాయిలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపమా.?**

**ప్రభుత్వం ఇచ్చిన ఉచిత రేషన్ బియ్యంను దళారులు కొనుగోలు చేసి ప్రభుత్వానికే మరల అమ్ముతున్న రేషన్ బియ్యం మాఫియా**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి జనవరి (స్కై న్యూస్):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అలియాబాద్ మునిసిపల్ పరిధిలో ఓఆర్ఆర్ చుట్టుపక్కల గోడౌన్లు ఏర్పాటు చేసుకొని అక్రమ రేషన్ దందా ను కేటుగాళ్లు యదేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ప్రతి నెల ఒకటవ తారీకు నుండి ప్రారంభమై దాదాపు 20 తారీకు వరకు ఈ మాఫియా తన వ్యవహారాన్ని నిర్వహిస్తుంది.షామీర్పేట్ మండలంలో పేదల కోసం కేటాయించిన రేషన్ బియ్యం పథకం మాఫియా చేతుల్లోకి జారిపోతుందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సబ్సిడీతో పంపిణీ చేయాల్సిన బియ్యం రహదారులపై ఆటోలలో, డీసీఎంలలో బహిరంగంగా తరలించబడుతుండటం స్థానికుల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. ఇది పేదల అన్నం.. కానీ మాఫియాకు ఆదాయ వనరు అవుతోంది.. అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రహదారులపై బహిరంగ రవాణా..**

షామీర్పేట్, పెద్ద అంబర్పేట్, శంషాబాద్ ప్రధాన రహదారులు, కాలనీలలో తెల్లవారుజామున లేదా రాత్రివేళల్లో ఆటోలలో రేషన్ బియ్యం బస్తాలు నిలువుగా తరలిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొందరు వీడియోలు కూడా తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నప్పటికీ, పోలీసులు, సివిల్ సప్లై అధికారులు పెద్దగా చర్యలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ డీలర్ల నుంచి లీకవుతున్న బియ్యం మధ్యవర్తుల చేతుల మీదుగా ఇతర జిల్లాలకు, కొన్నిసార్లు రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సివిల్ సప్లై, పోలీస్ అధికారులపై అనుమానాలు**

ఇంత బహిరంగంగా రవాణా జరుగుతుంటే స్థానిక సివిల్ సప్లై అధికారులకు, స్థానిక పోలీసులకు, ఎస్ఓటి పోలీసులకు సమాచారం లేకపోవడం ఎలా.? అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. కొందరు అధికారుల మౌనం వెనుక లంచాల ముసుగుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మాఫియా సభ్యులకు పోలీసులు అంటే లెక్కలేదు మామూలు ఇచ్చి మేనేజ్ చేస్తామని ధైర్యం ఉందని కొన్ని సందర్భాలలో స్థానికులు రిపోర్టర్లు పట్టుకుంటే మాఫియా సభ్యులే పోలీసులను పిలిపించి తిరిగి రిపోర్టర్లను స్థానికులను బెదిరించి వాళ్లపై కేసులు పెట్టిన సందర్భాల్లో ఉన్న ఆరోపణలు ఉన్నాయి. అంటే ఈ మాఫియా చేతులలో అధికారి యంత్రాంగం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకోవడానికి సివిల్ సప్లై దళాలు, టాస్క్ ఫోర్స్ బృందాలు ఉన్నప్పటికీ, తరచూ దాడులు జరగకపోవడం, దొరికినప్పుడు తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి వదిలివేయడం విమర్శలకు కారణమవుతోంది. కొంతమంది మాఫియా సభ్యులు మహా అంటే కేసు పెడతారు అంతేగా అంటూ స్థానికులను బెదిరింపులకు గురి చేస్తున్నారు అంటే పోలీసులు అక్రమార్కుల పై ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఉన్నత అధికారులే అర్థం చేసుకోవాలి.

**ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?**

సివిల్ సప్లై జిల్లా స్థాయి అధికారులు కఠినంగా పర్యవేక్షిస్తే ఇలాంటి అక్రమాలు జరగవని ప్రజలు అంటున్నారు. గోదాముల నుంచి డీలర్లకు బియ్యం చేరే వరకు ట్రాకింగ్ వ్యవస్థ బలహీనంగా ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా ఉన్న సివిల్ సప్లై అధికారులు రేషన్ షాపులపై సరైన నిఘా ఏర్పాటు చేయకపోవడం, కొంతమంది అధికారులు నెలనెల మామూళ్లకు ఆశపడి ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోకపోవడం జరుగుతుందని





జీపీఎస్ మానిటరింగ్, స్టాక్ ఆడిట్లు, అకస్మిక తనిఖీలు క్రమం తప్పకుండా జరగకపోతే ఈ దందా ఆగదని నిపుణులు చెబుతున్నారు.

**ప్రభుత్వ పథకాలపై పేదల హక్కులపై దాడి..**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరుగుతున్న రేషన్ బియ్యం దందా అనేది కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాదు, ఇది పేదల హక్కులపై నేరుగా దాడి అని అర్హులైన కుటుంబాలకు సరిపడా బియ్యం అందకపోవడం వల్ల వారిపై భారం పడుతోంది. రేషన్ డీలర్లు ప్రజల నుండి కొనుగోలు చేసి పక్కదారి పట్టించడం, ఇంటి దగ్గరికి ఆటోలలో వచ్చి బియ్యం కొనుగోలు చేయడం, కాలనీ బస్తీలలో గోడౌన్లు ఏర్పాటు చేసి దాచడం, రాత్రి సమయంలో నగర శివారులకు తరలించడం అంతా బహిరంగంగానే జరుగుతున్న పట్టించుకునే నాధుడే లేకుండా పోయారు. ఒక వైపు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, మరోవైపు కొందరి స్వార్థం వల్ల అవి పక్కదారి పడుతున్నాయి.

**ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్**

షామీర్ పేట, ఓ ఆర్ ఆర్ చుట్టుపక్కల ఉన్న పోలీస్ స్టేషన్ ల పరిధిలో దర్జాగా జరుగుతున్న అక్రమ రేషన్ బియ్యం రవాణాపై సమగ్ర దర్యాప్తు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, సామాజిక సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి.రాత్రివేళల్లో ప్రత్యేక తనిఖీలు,అవినీతి అధికారులపై సస్పెన్షన్, క్రిమినల్ కేసులు ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న పథకాలు మాఫియా చేతుల్లోకి వెళ్లకుండా సివిల్ సప్లై శాఖ, పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.


# అట్టహాసంగా నూతన కౌన్సిలర్‌ల ప్రమాణ స్వీకారం....

## అంబేద్కర్ సాక్షిగా ప్రమాణ స్వీకారం చేసిన 13వ వార్డు కౌన్సిలర్ గంగాధర్

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 16( స్కై న్యూస్)** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో విజయం సాధించిన కౌన్సిలర్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అట్టహాసంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవి బాధ్యతలను స్వీకరించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి హాజరుకాగా ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులుగా ఆర్డీవో సురేష్ బాబు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి వ్యవహరించారు ఈ సందర్భంగా కౌన్సిలర్లు శాసనము ద్వారా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగం పట్ల నమ్మకం విశ్వాసం విధేయత చూపుతానని అంతరాత్మ సాక్షిగా ప్రమాణం చేయగా 13వ వార్డు కౌన్సిలర్ కొత్త గంగాధర్ వాటితో పాటు అంబేద్కర్ సాక్షిగా ప్రమాణం చేశారు. కార్యాలయ మేనేజర్ వెంకటయ్య సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించగా అన్ని వార్డుల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. 11వ వార్డు నుండి గెలుపొందిన ఆసిఫా బేగం 14వ వార్డు నుండి గెలుపొందిన నజీమా ఖాజా ఖాన్ లు జైహింద్ అంటూ ప్రమాణ స్వీకారాన్ని ముగించారు 1వ వార్డు నుండి అర్జునయ్య 2వ వార్డు నుండి తిమ్మాజీపేట పాండు 3 బా







వార్డు నుండి గంపల కవిత 4వ వార్డు నుండి వసంత 5 వ వార్డు నుండి నరసింహారెడ్డి 6 వ వార్డు నుండి శ్రీనివాసులు 7వ వార్డు నుండి అనంత అలివేలమ్మ 8వ వార్డు నుండి బాదం రమేష్ 9 వ వార్డు నుండి సుంకారి అలివేల రాజేష్ గౌడ్ 10వ వార్డు నుండి జయప్రకాష్ నారాయణ చారి 11వ వార్డు నుండి ఆసిఫా బేగం 12వ వార్డు నుండి ముమ్మడి జయలక్ష్మి నాగేష్ చారి 13 వార్డు నుండి కొత్త గంగాధర్ 14 వార్డు నుండి నాజీమా ఖాజా ఖాన్ 15వ వార్డు నుండి గౌసియా బేగం 16 వార్డు నుండి సింధు రాజేష్ 17వ వార్డు నుండి రాజేశ్వరి 18 వ వార్డు నుండి చంద్రకళ 19 వ వార్డు నుండి సునీత గౌడ్ 20 వార్డు నుండి మలిశెట్టి పద్మమ్మ 21 వార్డు నుండి పడిగే శంకర్ 22 వ వార్డు నుండి ఆవంచ మాధవి రాజు 23 వ వార్డు నుండి తీగల సునింద్ర కుమార్ 24 వ వార్డు నుండి ఎండి నిజాముద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు అనంతరం అధికారులు ఎన్నికైన నూతన కౌన్సిలర్లకు సన్మానం చేశారు

# ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పరీక్షల నిర్వహణ

**- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట ఫిబ్రవరి 16 ( స్కై న్యూస్)** ఫిబ్రవరి 25 వ తేదీ నుండి మార్చి 16వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయం లో వి.సి. సమావేశ మందిరం లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ విషయమై అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 25 నుండి మార్చి 16 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయని తెలిపారు. పిబ్రవరి 25వ తేదీ నుండి మార్చి 16వరకు 15 కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకుష్ట్రవశీతీఎ పరీక్షలు నిర్వహించటం జరుగుతుందని ఆమె తెలిపారు. ఇంటర్ మొదటి,రెండవ సంవత్సరం పరీక్షల కోసం పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో , ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. మొదటి సంవత్సరం 4409, రెండవ సంవత్సరం 3783 మొత్తం 8192 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. మొత్తం పరీక్షా కేంద్రాలు 15





చీఫ్ సూపర్డెంట్లు 15 డిపార్ట్మెంటల్ అధికారులు 15 అడిషనల్ చీఫ్ సూపర్డెంట్లు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఒకటి సిట్టింగ్స్ స్క్వాడ్ ఇద్దరు కస్టడియన్ అధికారులు పని చేస్తారని తెలిపారు. సందర్భంగా కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు పలు సూచనలను, ఆదేశాలను జారీ చేస్తూ...పరీక్షల సందర్భంగా 144 వ సెక్షన్ విధించాలని, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేయాలని,పరీక్షా కేంద్రం చుట్టూ జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్షలు నిర్వహించే ఫిబ్రవరి 25 నుండి మార్చి 16వరకు ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఇవ్వాలని, సీసీ కెమెరాల మధ్య పరీక్షలు నిర్వహించనున్నందున విద్యుత్ సరఫరా లో ఎలాంటి అంతరాయం ఉండకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. అదేవిధంగా పరీక్షల సమయంలో పరీక్ష కేంద్రాల లో తాగునీరు, లైటింగ్, ఫర్నిచర్, ప్యాన్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో నగర, పట్టణ ప్రాంతాలలో, మండలం లలో పారిశుధ్యం నిర్వహణకు చర్యలు తీసుకోవాలనిమున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు ఫస్ట్ ఎయిడ్, ఏఎన్ఎం లను, మందులు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు గ్రామీణ ప్రాంతం నుండి అలాగే పట్టణ ప్రాంతాలలో సరైన బస్సులు నడపాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. పోస్టల్ అధికారులు ప్రశ్నపత్రాలు భద్రంగా డిపాజిట్ చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ ప్రశాంతంగా నిర్వహించేలా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సంబంధిత శాఖల అధికారులను కోరారు. ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరీక్షలను సవ్యంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. పరీక్షా కేంద్రం లోకి ఎవరికి సెల్ ఫోన్ లు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఈసమావేశం లో అదనపు కలెక్టర్ శ్రీను, డిఇసి కన్వీనర్ సుదర్శన్ రావు సభ్యులు శ్రీనివాసులు నరసింహారెడ్డి,తదితర శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# గులాబీకి ముల్లుగా మారిన కవిత...

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:**తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు ఊహించని మలుపులు తిరుగుతోంది. భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం పూర్వవైభవం పోరాడుతున్న తరుణంలో, ఆ పార్టీ ఇంటి పోరే పెద్ద శాపంగా మారేలా కనిపిస్తోంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంతంగా పార్టీ పెట్టే దిశగా అడుగులు వేయడం గులాబీ బాటలో ముళ్ల కంచెగా మారుతోంది. పైకి బీఆర్ఎస్ శ్రేణులు ఆత్మవిశ్వాసం ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో కవిత చీల్చే ప్రతి ఓటు పార్టీ పునాదులను కదిలిస్తుందని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి.మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంతంగా రాజకీయ అస్తిత్వం కోసం అడుగులు వేయడం, గులాబీ దళానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ముఖ్యంగా ఇటీవలి మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, ఆ తర్వాత కవిత చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ పునాదులను కదిలిస్తున్నాయి.నేరుగా పార్టీ ప్రకటించకపోయినా, మున్సిపల్ ఎన్నికల్లో కవిత తన మద్దతుదారుల ద్వారా 'సింహం' గుర్తుకు మద్దతు ఇచ్చి క్షేత్రస్థాయిలో తన బలాన్ని నిరూపించుకున్నారు. కొన్ని కీలక నియోజకవర్గాల్లో ఈ గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థులు సాధించిన ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపోటములను శాసించాయి. ఇది కేవలం యాదృచ్ఛికం కాదు, ఒక పక్కా వ్యూహంతో జరిగిన రాజకీయ దాడి అని విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత చీల్చే ప్రతి ఓటూ నేరుగా బీఆర్ఎస్ ఖాతా నుంచే మైనస్ అవుతుండటం ఆ పార్టీ అగ్ర నాయకత్వాన్ని ఆందోళనలో పడేసింది.కవిత తన విమర్శనాస్త్రాలను కేవలం ప్రత్యర్థి పార్టీల వైపు కాకుండా సొంత సోదరుడు కేటీఆర్, బావ హరీష్ రావుల వైపు మళ్లించడం ఇక్కడ ఆసక్తి రేపుతోంది. క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను గాలికి వదిలేశారంటూ ఆమె చేస్తున్న వ్యాఖ్యలు పార్టీ కార్యకర్తల్లో తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. తండ్రి కేసీఆర్ పట్ల అపారమైన గౌరవం ప్రకటిస్తూనే, ప్రస్తుత పార్టీ నిర్వహణపై ఆమె నిప్పులు చెరుగుతున్నారు. దీనివల్ల పార్టీలో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకత్వం కవిత వైపు చూసే అవకాశం ఏర్పడింది. బీఆర్ఎస్‌లో తలెత్తిన శూన్యతను తన వైపు తిప్పుకోవడంలో ఆమె సఫలమవుతున్నట్లు కనిపిస్తోంది.ప్రస్తుతం కవిత తన రాజకీయ ఎజెండాలో బీసీ సామాజిక వర్గాన్ని ప్రధాన అస్త్రంగా ఎంచుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ బీసీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, వారికిచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆమె చేస్తున్న ఆరోపణలు పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకుపై గట్టి దెబ్బ కొట్టేలా ఉన్నాయి. వచ్చే మూడు నెలల్లో కొత్త పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తానని స్పష్టం చేయడం, అంతర్జాతీయ స్థాయి రాజకీయ వ్యూహకర్తల సహకారం తీసుకుంటున్నారనే వార్తలు బీఆర్ఎస్‌కు ముందరి కాళ్ళ బంధంగా మారాయి.మున్సిపల్ ఫలితాల అనంతరం కవిత చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ శ్రేణులకు ఆగ్రహం తెప్పిస్తున్నాయి."ఇది కేవలం టీజర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది" అంటూ ఆమె ఇచ్చిన వార్నింగ్, రాబోయే రోజుల్లో పోరు మరింత ముదురుతుందని సంకేతాలిచ్చింది. తెలంగాణ జాగృతి నెట్‌వర్క్‌ను ఇప్పుడు పూర్తిస్థాయి రాజకీయ శక్తిగా మార్చడం ద్వారా, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ బీఆర్ఎస్ ఓట్లను చీల్చేందుకు ఆమె సిద్ధమవుతున్నారు.తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీ బలంగా ఉన్నాయి. ఇలాంటి త్రిముఖ లేదా చతుర్ముఖ పోటీ నెలకొన్న తరుణంలో, కవిత నేతృత్వంలోని కొత్త శక్తి 4 నుంచి 5 శాతం ఓట్లు చీల్చినా, అది బీఆర్ఎస్ అభ్యర్థుల పాలిట మరణశాసనమే అవుతుంది. ఒకే సిద్ధాంతం, ఒకే రకమైన ఓటు బ్యాంకు ఉన్నప్పుడు.. చీలిక అనేది ఎప్పుడూ మాతృ పార్టీకే నష్టం చేకూరుస్తుంది .

## నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులలో

# గెలుపొందిన కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం


1వ వార్డ్ అర్జునయ్య


2 వ వార్డ్ తిమ్మాజీపేట పాండు


3వ వార్డ్ గంపల కవిత


4వ వార్డ్ వసంత


5వ వార్డ్ నర్సింహ రెడ్డి



6వ వార్డ్ శ్రీనువాసులు


7 వ వార్డ్ అలివేలమ్మ


8వ వార్డ్ బాదం రమేష్


9వ వార్డ్ సుంకారి అలివేల


10వ వార్డ్ జయప్రకాష్ చారి


11వ వార్డ్ అసిఫా బేగం


12వ వార్డ్ జయలక్ష్మి నగేష్


13వ వార్డ్ కొత్త గంగాధర్


14వ వార్డ్ నజీమా ఖాజా ఖాన్


15వ వార్డ్ గౌసియా బేగం


16వ వార్డ్ సింధు రాజేష్


17వ వార్డ్ రాజేశ్వరి


18 వవార్డు చంద్రకళ


19 వ వార్డ్ సునీత


20వ వార్డ్ మలిశెట్టి పద్మమ్మ


21వ వార్డ్ పడిగే శంకర్


22వ వార్డ్ అవాంఛ మాధవి రాజు


23వ వార్డ్ తీగల సునింద్ర



24వ వార్డ్ నిజమోద్దీన్

# రాహుల్ గాంధీ ధోరణి మార్పు వచ్చిందా?

**డిల్లీ ఫిబ్రవరి 16:** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ ధోరణి ఎట్టకేలకు దారిన పడుతున్నట్లు భావించవచ్చునా? 202627వ సంవత్సరపు బడ్జెట్‌పై ఆయన సభలో ఈ నెల 11న చేసిన ప్రసంగాన్ని బట్టి ఈ ఆశాభావం కలుగుతున్నది. ఆయన నేరుగా బడ్జెట్ ప్రతిపాదనలను చర్చించి ఉండకపోవచ్చుగాక. లేదా మొత్తం మీద బడ్జెట్ తీరుతెన్నులను విశ్లేషించి మంచి చెడులను ఎత్తిచూపకపోవచ్చు. ఆ పని రానున్న రోజులలో కాంగ్రెస్ వక్తలు, ఇతర ప్రతిపక్ష వక్తలు చేయగలరు. కాని, దేశ ఆర్థికంతో సంబంధం గల అమెరికా వాణిజ్య ఒప్పందపు తీరు, అందువల్ల భారత దేశానికి కలిగే నష్టమంటూ తాను భావించే అంశాలను ప్రస్తావించారు. అది ప్రశంసించ దగిన విషయం. ఇక్కడ ఒక సందేహం కలగవచ్చు. ప్రతిపక్ష నాయకుని స్థానంలో ఉన్న వ్యక్తి చేయవలసిని పనే ఇది అయినపుడు తనను ప్రత్యేకంగా అభినందించటం ఎందుకని. ఎందుకంటే, రాహుల్ గాంధీ ఆ స్థానం నుంచి పార్లమెంటులో గాని, కాంగ్రెస్ నాయకునిగా బయట గాని తను చేయవలసిన పనులు అరుదుగా తప్ప చేయటం లేదు. చేయటం లేదన్న మాట స్వయంగా కాంగ్రెస్ వాదులకు, కాంగ్రెస్ నాయకత్వాన గల ప్రతిపక్ష కూటమి వారికి, అధికార పక్షమైన బిజెపికి, బయట సాధారణ ప్రజలకు కూడా అర్థమైంది. అందుకు అందరూ విసుగు పడుతుండగా బిజెపి సంతోషిస్తున్నది. ఆయన నాయకునిగా ఉన్నంతకాలం తమ అధికారానికి ముప్పు లేదని వారు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెస్‌లోనూ అసంతృప్తి పెరుగుతున్న స్థితిలో, పార్టీ నాయకునిగా రాహుల్‌ను తప్పించి ప్రియాంకకు బాధ్యతలు అప్పగించటం వల్ల ప్రయోజనం ఉండవచ్చుననే మాటలు ఇటీవల తిరిగి వినవస్తున్నాయి. మిగిలిన వారిని అట్లుంచి సాక్షాత్తూ ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా అటువంటి సూచన చేయటం తగినంత కలకలాన్ని సృష్టించింది. ఎవరైనా తాము చేయవలసినది చేయకుండా తక్కినవి ఎంత బాగా చేసినా దానిని లోకం మెచ్చదు. రాహుల్ అదే పని చేస్తూ వచ్చారు.



ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలనే ముందుగా తీసుకుంటే, ఆయన మాజీ సైన్యాధిపతి జనరల్ నరవణె రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంలోని అంశాలతో భూకంపం సృష్టించాలని చూసారు. అందులో గల్వాన్ ఘటనల గురించిన ప్రస్తావన తప్పక చర్చించదగినదే. దానిపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నది మొదటనే స్పష్టమైంది. ఒక కారణం, అది ఇంకా అధికారికంగా వెలువడ లేదు. రెండవది, గల్వాన్ ఉదంతం సందర్భంగా 'ఏది ఉచితమని భావిస్తే అది చేయండి' (జో ఉచిత్ సమ్‌ఝో వో కరో) అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అప్పటి సైన్యాధిపతితో చెప్పారంటున్న మాటకు పలు విధాలైన నిర్వచనాలను వింటున్నాము. వాటిలో తను భావించిన నిర్వచనం ఏమిటో ఆ అధికారి పేర్కొనలేదు. ఇపుడు ప్రభుత్వమూ ఆ చర్చకు సిద్ధంగా లేదు. అటువంటి స్థితిలో రాహుల్ గాంధీ ఎంత సేపని, ఎన్ని రోజులని సభా సమయాన్ని అందుకోసం ఉపయోగించగలరు? ంవిషయమేమంటే, ప్రతిపక్ష స్థానంలో కాంగ్రెస్ ఒక్కటే లేదు. వారి కూటమిలో, కూటమికి బయట ఇతర పార్టీలు కూడా ఉన్నాయి. నరవణె పుస్తకం విషయమై వారికి కూడా ఆందోళన ఉన్నా, సభా సమయం యావత్తూ రోజుల తరబడి అందుకే ఖర్చు కావటం వారికి నచ్చలేదు. తాము మాట్లాడదలచుకున్నవి తమకున్నాయి. పైగా ఇవి బడ్జెట్ సమావేశాలు. ఆ దృష్టా రాహుల్ ధోరణి వారికి నచ్చలేదని, అంతర్గతంగా ఆయనపై విమర్శలు మొదలయ్యాయని వార్తలు సూచించాయి. ఆయన బుధవారం నాడు నరవణె విషయం వదలి వేసి బడ్జెట్ గురించి మాట్లాడటానికి కారణం అదేనని భావించవలసి వస్తున్నది. వాస్తవానికి దేశానికి కావలసింది ప్రధానంగా బడ్జెట్ గురించిన చర్చ. 2020 నాటి గల్వాన్ గురించి నోటీసు ఇచ్చి మరొక సందర్భంలోనైనా చర్చించవచ్చు. బడ్జెట్ చర్చను ఆపి మరీ అందుగురించి చర్చించవలసిన అత్యవసర స్థితి ఏమీ లేదు. ఆ మాట రాహుల్ గాంధీకి స్వయంగా అర్థం కాలేదు. తన ధోరణిపట్ల ఇతర ప్రతిపక్షాల నిరసనతో బోధ పడింది. ఆ విధంగా ఆయన ధోరణీ ఆ వత్తిడి వల్ల దారిన పడిందన్న మాట. రాజ్యాంగ దుమారం విశేషమేమంటే తను గతంలోనూ ఇదే విధంగా వ్యవహరించారు కొన్ని సార్లు. తనకు సరైనదని తోచిన సంచలనాత్మక విషయమేదో ముందుకు తెస్తారు. దానిని ప్రస్తావించటంతో ఆగక రోజుల తరబడి సభలోనూ బయటా హంగామా సృష్టిస్తారు. ఇతర ప్రతిపక్షాలకూ, బయటినుంచి టివిలలో చూసే ప్రజలకూ విసుగు తెప్పిస్తారు. ఇతర ప్రతిపక్షాల వత్తిడి మీదట ధోరణి మార్చుకుంటారు. ఆయనకు ఇదొక అలవాటుగా మారింది. మనం ఇరవై ఏళు ్లగా గమనిస్తున్న తన నాయకత్వంలోని అనేక లోపాలలో ఇది ఒకటి. సభలోనే కాదు. ఇతర విషయాలలోనూ అంతే. ప్రజల సమస్యలు, వారు తన నుంచి ఆశించేది ఒకటైతే, ఆయన మరేవో భుజాన వేసుకుంటారు. అవి ప్రజలకు పట్టవు. ఇటీవలి కాలానికేవస్తే, కాంగ్రెస్ అసెంబ్లీ సీట్లు మహారాష్ట్ర, ఢిల్లీ, బీహార్‌లలో గతం కన్న తగ్గింది ఎందుకు? ఆ కారణాలను ఆయన సమీక్షించుకున్నారో లేదో తెలియదు గాని, బయటి వారికి అర్థమవుతూనే ఉన్నాయి.

## శ్రీ సంత్ మహారాజ్ జయంతి ఉత్సవాలలో: మందాడి సరోజిరెడ్డి



**చిన్న చింతకుంట ఫిబ్రవరి 16 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండల పరిధిలోని ఉంద్యాల తాండ లో శ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ 287 వ జయంతి వేడుకలలో ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయవాది మందాడి సరోజిరెడ్డి సేవలాల్ మహారాజ్ చిత్రపటానికి పూజ కార్యక్రమంలు నిర్వహించి, పూలమాలలు వేశారు.బోగ్ బందర్ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం తాండవాసులు ఘనంగా సేవాలాల్ జయంతి సంబరాలు బంజారా ఆధ్యాత్మిక గురువు జగదాంబ మత భక్తుడు బంజారాలను ఏకం చేసిన కారణజన్ముడు సేవాలాల్ మహారాజ్ బోగ్ బందర్ కార్యక్రమం చేసి ఆయన పేరు మీద అన్నదానం కార్యక్రమం. బంజారా సంస్కృతి సంప్రదాయల తో ఆడపడుచు లు నృత్యలు డీజే ర్యాలీ లు తాండ నుండి ఉంద్యాల గ్రామం వరకు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం వర్ష బాబు నాయక్ వెంకటేష్ నాయక్ రమేష్ నాయక్ కవి నాయక్ తో పాటు తాండ స్త్రీ పురుషులు పాల్గొన్నారు.

## సమిష్టిగా గెలిచాం... సమిష్టి గా అభివృద్ధి చేస్తాం

పట్టణ ప్రగతి కి పూర్తి సహకారం అందిస్తా.

ఎంపి.డీకే అరుణ



**నారాయణపేట ఫిబ్రవరి 16:( స్కైన్యూస్)** నారాయణపేట మున్సిపాలిటీని అందరి సమిష్టి కృషితో గెలిపించుకున్నామని అదే స్ఫూర్తితో అభివృద్ధికి కృషి చేస్తామని పాలమూరు ఎంపీ.డి కే అరుణ అన్నారు.సోమవారం నారాయణపేట మున్సిపాలిటీ చైర్మేన్ , వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఎక్స్ అఫిసియో సభ్యులుగా హాజరు అయ్యారు.చైర్మెన్, వైస్ చైర్మన్ ఎన్నికలో తన ఓటు వేసి బిజెపి అభ్యర్థులను గెలిపించుకున్నారు.అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో బిజెపి నాయకత్వం మొత్తం సమిష్టిగా పని చేసి పట్టు సాధించామనివన్నారు. ఒక అభ్యర్థి రెబల్ గా పోటీ చేసి విజయం సాధించిన పార్టీకి కట్టుబడి బీజేపీలో చేరారని తెలిపారు.అది క్రమశిక్షణ గల బీజేపీకే సాధ్యమని అన్నారు.ఎందరో ఎన్నో సమీకారణాలు చేశారని మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంటామని చెప్పుకున్నారని అన్నారు.కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదు అని అన్నారు.కానీ నారాయణపేట మున్సిపాలిటీలో కమలం వికసించిందన్నారు.ప్రజల ఆకాంక్ష మేరకు పాలన అందిస్తామని స్పష్టం చేశారు.పట్టణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలా నిధులు తీసుకువస్తామని అభివృద్ధి సాధిస్తామని అన్నారు.గెలుపొందిన పాలకులు సేవకులుగా పని చేస్తారని అన్నారు.

## పాస్టర్ జస్టిన్ మట్టి దహానం కొరకు వివిధ సంఘాలు ఆర్థిక సహాయం

**చిన్న చింతకుంట ఫిబ్రవరి 16 (స్కై న్యూస్)** చిన్నచింతకుంట మండల పరిధిలోని లక్ష్మీదేవిపూర్ పాస్టర్ హార్ట్ ఎటాక్ తో ఆదివారం తన సొంత స్వగ్రామం కురుమూర్తిలో మృతి చెందారు. సోమవారం మట్టి దహనము కొరకు పాస్టర్ జస్టిన్ భౌతిక దేహానికి పూలమాలలు వేసే నివాళులర్పించి ఉంద్యాల గ్రామ ఎం.బి.హేర్మోన్ సంగస్థుల తో పాటు వివిధ గ్రామాల్లోని సంఘస్తులు అర్థిక సహాయం చేశారు. కుటుంబ సభ్యులకు శాంతి సమాధానం, ఓదార్ప దయచేయాలని దేవునికి ప్రార్థించడం జరిగింది.



# మాకు మున్సిపాలిటీలు తక్కువగా వచ్చినప్పటికీ ఓట్ల శాతం పెరిగింది

### 15 ం మున్సిపాలిటీల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బీజేపీ అవతరించింది.

### బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**హైదరాబాద్ ఫిబ్రవరి 16:**మాకు మున్సిపాలిటీలు తక్కువగా వచ్చినప్పటికీ ఓట్ల శాతం పెరిగిందని,15 ం మున్సిపాలిటీల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బీజేపీ అవతరించిందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. బిజెపి రాష్ట్ర కార్యాలయశీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్, నారాయణపేట, భైంసా మున్సిపాలిటీల్లో బీజేపీ చైర్ పర్సన్ పీఠం పదవి దక్కించుకుంది. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.భైంసాలో గత కాంగ్రెస్ హయాం నుంచే.. బీజేపీ కార్యకర్తలు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులపై ఎన్నో కేసులు పెట్టారు.. అడ్వకేట్ గా నేను ఎంతో మంది బెయిల్ ఇప్పించిన. ఇంతకాలం బీజేపీ మజ్లిస్, కాంగ్రెస్ మజ్లిస్ కలిసి.. భైంసాలో బీజేపీని రానివ్వలేదు.భైంసాలో ఎంఐఎం పార్టీ ఎన్నో ఆగడాలకు పాల్పడింది.మాకు మున్సిపాలిటీలు తక్కువగా వచ్చినప్పటికీ ఓట్ల శాతం పెరిగింది.చాలా మున్సిపాలిటీల్లో బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఆధిక్యం చూపింది.ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నికల్లో బీజేపీ కీలక పాత్ర పోషించింది.గతానికి భిన్నంగా బీజేపీకి ఓట్లు, సీట్లు పెరిగాయి. 15 ం మున్సిపాలిటీల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బీజేపీ అవతరించింది.ఖమ్మం, వరంగల్, కొత్తగూడం, పరకాల లాంటి చోట్ల బీజేపీ సత్తా చాటింది.చాలా చోట్ల మా ఓటు బేస్ పెరిగింది. బీఆర్ఎస్ పార్టీకి గతం కంటే 14 శాతం ఓట్లు తగ్గాయి.బీఆర్ఎస్ ఇప్పుడు కేవలం 13 మున్సిపాలిటీలకు పరిమితమైంది.అధికారంలో ఉన్న అధికార పార్టీకి కూడా మెజార్టీ సీట్లు రాలేదు. చరిత్రలో మొట్టమొదటిసారిగా కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది.నిజామాబాద్ లో 28 చోట్ల బీజేపీ గెలిచి.. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బీజేపీ అవతరించింది.మజ్లిస్ పార్టీ ఓటు పర్సంటేజీ.. తగ్గినా.. వారి ప్రభావం రాష్ట్రంలో పెరుగుతున్నది.నిర్మల్ లో ఒక వార్డులో ఎప్పుడూ లేనంతగా మైనార్టీ ఓట్లు పెరిగాయి. దీని మీద మాకు అనుమానం ఉన్నది. దీనిపై ఫిర్యాదు చేశాం.20 శాతం నుంచి 57 శాతానికి మైనార్టీ ఓట్లు ఎలా పెరిగాయి? బీజేపీని అడ్డుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయి.ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టులు



కలిసి.. బీజేపీకి మేయర్, చైర్ పర్సన్ పదవులు రానివ్వకుండా కుట్ర చేశారు.ఈ మూడు పార్టీల మధ్య ఉన్న సంబంధం ఏంటో చెప్పాలి.ఎర్రజెండా ఎక్కడా లేకున్నా.. తెలంగాణలో కాంగ్రెస్ ఎర్రజెండాకు అధికారం వచ్చేలా చేస్తున్నది.బీజేపీ ఎప్పుడూ అభివృద్ధి కోసమే పనిచేస్తుంది.. ఇప్పుడు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆ అభివృద్ధి కనిపిస్తున్నది.ఏప్రిల్ లో ఎస్ఐఆర్ రాబోతున్నది. హైదరాబాద్ లో దొంగ ఓట్లు, బయటి ఓట్లు తీసేయబోతున్నం. బీఎల్ వోలు, ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఇంటి ఓనర్లకు తెలియకుండానే ఒక్కో ఇంటిపై 60 ఓట్ల వరకు నమోదు చేస్తున్నారు.మాకు ఓటు వేసిన తెలంగాణ ప్రజలందరికీ ధన్యవాదాలు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ తప్పకుండా అధికారంలోకి వస్తామన్న ధీమా వ్యక్తం చేసారు.

# స్వల్ప తేడాతో విజయం.. ఇది శాశ్వతం కాదు

### ఈ ఫలితాన్ని తిరగరాస్తాం..ఎంపి ధర్మపురి అరవింద్

**నిజామాబాద్ ఫిబ్రవరి 16:**నిజామాబాద్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటయ్యాయి త్వరలోనే ఈ ఫలితాన్ని తిరగరాస్తాం:.. ఎంపి ధర్మపురి అరవింద్ ధ్వజం నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక వేదికగా కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటయ్యాయని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. బిజెపిని దెబ్బతీసేందుకు సిద్ధాంతాలను పక్కనబెట్టి ఈ మూడు పార్టీలు అనైతిక పొత్తు పెట్టుకున్నాయని ఆయన ధ్వజమెత్తారు. సోమవారం నగర మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికార కాంగ్రెస్ పార్టీ తీరును, రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా-ఈ కారు రేసు వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కుటుంబాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారని అరవింద్ ప్రశ్నించారు. ఒకవైపు విమర్శలు చేస్తూనే, మరోవైపు బిఆర్ఎస్ అభ్యర్థులను కాంగ్రెస్ వాహనాల్లో ఎక్కించుకుని తీసుకురావడం వెనుక ఉన్న మర్మమేమిటని ఆయన అడిగారు. ఎంఐఎం పార్టీ కాంగ్రెస్‌కు ఎందుకు మద్దతు ఇచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ ఎన్నిక ప్రక్రియలో కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించారని ఎంపి ఆరోపించారు. "కొందరు పోలీసులు రాజకీయ రంగు పూసుకుని మరీ పనిచేశారనీ విమర్శించారు. బిఆర్ఎస్ అభ్యర్థిని కాంగ్రెస్ వ్యానులో కూర్చోబెట్టి తీసుకురావడంలో పోలీసుల హస్తం ఉందని స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని విమర్శించారు.

**స్వల్ప తేడాతో విజయం.. ఇది శాశ్వతం కాదు**

బిజెపి అభ్యర్థి స్రవంతి రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి కేవలం మూడు స్వల్ప ఓట్ల తేడాతో విజయం సాధించారనీ పేర్కొన్నారు. అలాగే ఎంఐఎం అభ్యర్థి, బిజెపి అభ్యర్థి బంటు రాముపై గెలవడం వెనుక కాంగ్రెస్ వ్యూహం ఉందని విమర్శించారు. ఈ ఎన్నిక ఫలితం ముగిసిపోయిన అధ్యాయం కాదు. ఈ బాడీ గడువు ముగియక ముందే, ఈ ఫలితాన్ని రివర్స్ చేసి చూపిస్తాం, ప్రజాక్షేత్రంలో అక్రమ పొత్తులను ఎండగడతాం" అని అరవింద్ హెచ్చరించారు.

# కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:**కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధులు మార్చి నెలాఖరులోగా సమీకరించుకునేందుకు ప్రణాళిక బద్దంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎస్ఎన్ఎ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్, ఇతర పథకాల క్రింద రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించి, దీనిపై ఢిల్లీలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకొని సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యారోగ్య,గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు 15 వేల కోట్ల రూపాయిలు రావాల్సి ఉందని, వీటిని సమీకరించుకొని రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు.

**100 వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక :**

గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2, 3 తేదీల నుండి జూన్2వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ డిపార్టుమెంట్ల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాలలో ఈ ప్రణాకను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామపంచాయతీ, మున్సిపల్ లోకల్ బాడీస్ ఎన్నికలు ముగిసినందున ఎన్నికైన



వార్డుమెంబర్లు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సలర్స్, కార్పొరేటర్స్ తదితర ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు బాధ్యతతో కూడిన విధులు నిర్వర్తించేందుకు ఈ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక(100 డేస్ యాక్షన్ ప్లాన్) ఉపకరిస్తుందని సిఎస్ తెలిపారు. గ్రామాల్లో,పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండాకు తగు చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. రానున్న కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను రేపటిలోగా సమర్పించాలని సిఎస్ సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సి.వీ.ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, ఎన్. శ్రీధర్, యోగితారాణా, కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఈ లడ్డు లాభాలు తెలిస్తే తినకుండా ఉండలేరు!



నువ్వుండలు.. చిన్నవిగా కనిపించినా, ఆయుర్వేదంలో వాటి ఆరోగ్య ప్రయోజనాలు అసాధారణమైనవి.. నువ్వుండలు జింక్, ఐరన్, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలతో నిండి ఉంటాయి.. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఇవి ఎముకల బలానికి అద్భుతమైన మొక్కల ఆధారిత కాల్షియానికి మూలం. ఆయుర్వేదం, ఆయుష్షును గురించి తెలిపే ప్రాచీన భారతీయ వైద్య విధానం.. ఆహారాన్ని ఔషధంగా, ఔషధాన్ని ఆహారంగా పరిగణిస్తుంది. దీనికి ఉత్తమ ఉదాహరణ నువ్వుండలు.. నువ్వులు, బెల్లంతో కలిపి తయారుచేసే ఈ లడ్డూలు ఎన్నో సమస్యలను దూరం చేస్తాయి.. నువ్వుండలు చిన్నవిగా కనిపించినా, వీటి ఆరోగ్య ప్రయోజనాలు విస్తృతమైనవని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఏ సీజన్‌లోనైనా నువ్వుండలు శరీరానికి సహజమైన పోషకాలను అందిస్తూ, అనేక ఆరోగ్య సమస్యల నుండి రక్షణ కల్పిస్తాయి. బెల్లం నువ్వుండలు మంచి పోషకాహారం.. ఇవి కాల్చిన నువ్వులు, బెల్లం కలిపి చేసే సాంప్రదాయ, ఆరోగ్యకరమైన తీపి వంటకం. ఇది కాల్షియం, ఐరన్, యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలమని.. దీనిని పెద్దవాళ్లు నుంచి చిన్న పిల్లల వరకు అందరూ తినవచ్చు..

నువ్వుండల ప్రయోజనాలు.. రోగనిరోధక శక్తి బలోపేతం: శీతాకాలంతోపాటు.. అన్ని కాలాల్లో ఇన్ఫెక్షన్లు సర్వసాధారణం. నువ్వుండలు రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుతాయి. వీటిలో జింక్, ఐరన్, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక కణాల ఉత్పత్తికి సహాయపడతాయి. జింక్ టీ కణాల పనితీరును మెరుగుపరుస్తుంది. ఆయుర్వేదం ప్రకారం, నువ్వులు బృంహణకరం (పోషకమైనవి), బల్యం (బలాన్ని పెంచేవి), వాత-కఫ దోషాలను సమతుల్యం చేస్తాయి. శరీరానికి సహజమైన వెచ్చదనం: నువ్వుండలు శీతాకాలపు చలి నుండి రక్షణ కల్పిస్తాయి. నువ్వులలోని ఆరోగ్యకరమైన కొవ్వు ఆమ్లాలు, ముఖ్యంగా పాలిఅన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, శరీరంలో మెటబాలిక్ హీట్‌ను ఉత్పత్తి చేస్తాయి. శరీరాన్ని లోపల నుండి వెచ్చగా ఉంచుతాయి. ఆయుర్వేదం నువ్వులకు వేడి గుణం ఉందని చెబుతుంది.. అంటే అవి శరీరంలో వేడిని పెంచుతాయి. నువ్వుల నూనెను గోరువెచ్చగా చేసి పాదాలకు మర్దనా చేయడం కూడా స్థానిక రక్త ప్రసరణను పెంచి, చలిని తగ్గిస్తుంది.

బలమైన ఎముకలు, కీళ్ల ఆరోగ్యం: నువ్వులు మొక్కల ఆధారిత కాల్షియంకు అద్భుతమైన మూలం.. ఎముకల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో ఉండే మెగ్నీషియం, భాస్వరం ఎముకల సాంద్రతను పెంచి, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలను నివారిస్తాయి. ముఖ్యంగా మహిళలకు నువ్వుండలు ఎముకల ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. ఆయుర్వేదం నువ్వులను అస్థి పోషక గుణం కలిగినవిగా వర్ణిస్తుంది. నువ్వుండలు కీళ్ల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయి. వీటిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు, ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ కీళ్ల వాపును, నొప్పుల తీవ్రతను తగ్గిస్తాయి. నువ్వుల నూనెతో మర్దనా చేయడం వాత దోషాన్ని తగ్గించి కీళ్లకు బలాన్నిస్తుంది.

మెరుగైన జీర్ణ ఆరోగ్యం: శీతాకాలంలో మలబద్ధకం, అజీర్తి సాధారణ సమస్యలు. నువ్వుండలలో కరిగే, కరగని ఫైబర్ అధికంగా ఉంటుంది. కరగని ఫైబర్ మలాన్ని మృదువుగా చేసి సులభంగా విసర్జనకు సహాయపడుతుంది. కరిగే ఫైబర్ పేగుల్లో మంచి బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఆయుర్వేదం నువ్వులకు అనులోమన గుణం ఉందని చెబుతుంది. ఇది వాతాన్ని క్రిందికి కదిలించి మలబద్ధకాన్ని నివారిస్తుంది.

చర్మానికి, కణాల ఆరోగ్యానికి: నువ్వుండలు యాంటీ ఆక్సిడెంట్లకు నిలయం. ఇవి వృద్ధాప్య ఛాయలను అరికట్టి చర్మాన్ని తాజాగా ఉంచుతాయి. నువ్వులలోని సెసమిన్, సెసమాలిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి కణాల నష్టాన్ని తగ్గిస్తాయి. ఆయుర్వేదం ప్రకారం, నువ్వులకు రసాయన గుణం ఉంది. ఇది సప్త ధాతువులను (రస, రక్త, మాంస, మేదో, అస్థి, శుక్ర) పరిపుష్టం చేస్తుంది. నువ్వుల నూనెను చర్మానికి రాసుకోవడం వల్ల యవ్వనపు బిగుతుదనం వస్తుంది


గుండె ఆరోగ్యం, శక్తి: నువ్వుల్లోని ఆరోగ్యకరమైన కొవ్వులు, ముఖ్యంగా ఒలిక్ యాసిడ్, రక్తంలో చెడు కొలెస్ట్రాల్ (ఒఆఒ) స్థాయిలను తగ్గించి, రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆయుర్వేదం నువ్వులు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయని చెబుతుంది. కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు తక్షణ ? నిరంతర శక్తిని అందించి, రోజంతా చురుకుగా ఉంచుతాయి. రక్తహీనత నివారణ: రక్తహీనతతో బాధపడేవారికి నువ్వుండలు ఒక అద్భుతమైన పరిష్కారం. నువ్వులలో అధికంగా ఉండే ఐరన్ హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడి, శరీరంలో ఆక్సిజన్ సరఫరాను మెరుగుపరుస్తుంది. నల్ల నువ్వులు రక్త వర్ధకంగా పనిచేస్తాయని ఆయుర్వేదం పేర్కొంటుంది.

## యవ్వనంగా కనిపించాలంటే..!



నేటి కాలంలో విపరీతమైన కాలుష్యం, హార్డ్ వాటర్ సమస్యలు, చర్మాన్ని దెబ్బతీసే ఎండ తీవ్రత, ఒత్తిడి మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇన్ని సవాళ్ల మధ్య మన చర్మం తన సహజమైన మెరుపును కోల్పోయి, చిన్న వయసులోనే ముడతలతో వృద్ధాప్య ఛాయలు కనిపిస్తున్నాయి. చాలామంది మార్కెట్లో దొరికే ఖరీదైన కెమికల్ ప్రొడక్ట్స్ వాడుతూ ఫలితం లేక నిరాశ చెందుతుంటారు. కానీ మన పూర్వీకులు, రాజవంశీకులు తమ చర్మం ఎప్పుడూ కాంతివంతంగా, యవ్వనంగా ఉండటానికి ఒక రహస్య తైలాన్ని ఉపయోగించేవారు. ఆయుర్వేద గ్రంథాలలో 'చర్మ సంరక్షణ అమృతం'గా పిలువబడే ఆ నూనె.. ఇప్పుడు మళ్ళీ ఆధునిక ప్రపంచంలో సెన్సేషన్ సృష్టిస్తోంది. కేవలం కొద్ది చుక్కలతోనే మీ ముఖంపై రాజసం ఉట్టిపడేలా చేసే ఆ వేదకాలం నాటి అద్భుతం పేరే 'కుంకుమాది తైలం'. దీని చరిత్ర ఏంటి? ఇందులో ఏయే మూలికలు దాగి ఉన్నాయి? కుంకుమాది అనే పేరు సంస్కృత పదమైన 'కుంకుమ' నుంచి వచ్చింది. కుంకుమ అంటే కుంకుమపువ్వు లేదా కేసర్ అని అర్థం. పూర్వకాలంలో రాజకుటుంబీకులు తమ ముఖం ఎప్పుడూ కాంతివంతంగా, యవ్వనంగా ఉండటానికి ఈ తైలాన్ని ప్రధానంగా ఉపయోగించేవారు. ఇది చర్మ రంధ్రాలను మూసివేయకుండా, లోపలి నుంచి శుభ్రం చేసి సహజమైన మెరుపును అందిస్తుంది. జంతువులపై ఎటువంటి పరీక్షలు చేయకుండా, కేవలం ప్రకృతి సిద్ధమైన మూలికలతో తయారయ్యే ఈ నూనె ఇప్పుడు మళ్ళీ అందరి ఆదరణ పొందుతోంది. అద్భుతమైన మూలికల సమ్మేళనం.. కుంకుమాది తైలంలో ఉండే ప్రతి పదార్థం చర్మానికి ఒక వరమనే చెప్పాలి. కుంకుమపువ్వు ఈ తైలంలో ప్రధానమైనది. ఇది చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చడమే కాకుండా, నల్లటి మచ్చలను తగ్గిస్తుంది. మంజిష్ఠ ఇందులో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. ఇది మొటిమలు, మంటను తగ్గించి చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. రక్తంలోని మలినాలను తొలగించి ముఖానికి సహజమైన మెరుపునిస్తుంది. వట్టివేరు మచ్చలు, గాయాల గుర్తులు, మొటిమల మచ్చలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. చర్మంపై ఉన్న మృతకణాలను తొలగిస్తుంది. యష్టిమధు కళ్ల కింద నల్లటి వలయాలను, హైపర్ పిగ్మెంటేషన్‌ను తగ్గించడంలో ఇది కీలకం. చందనం చర్మానికి చలువనిచ్చి సూర్యరశ్మి వల్ల వచ్చే ట్యాన్‌ను తొలగిస్తుంది.

## కూర వండి తింటే కొండల్ని కూడా పిండి చేసే బలం



కొండపిండి ఆకు, దీనిని కిడ్నీలో రాళ్లు కరిగించడానికి ఉపయోగించే సంప్రదాయ ఔషధంగా గిరిజనులు తరతరాలుగా నమ్ముతున్నారు. కొండపిండి ఆకు కూర వండుకునే విధానం, దాని ఆరోగ్య ప్రయోజనాలను ఈ కథనంలో తెలుసుకుందాం. మూత్రపిండాల్లో రాళ్లను తొలగించడమే కాకుండా, స్త్రీలలో గర్భసంచి సమస్యలకూ ఇది మేలు చేస్తుందట. కొండపిండి ఆకు, గిరిజన ప్రాంతాలలో విరివిగా లభించే ఒక వనమూలిక. ఇది మూత్రపిండాల్లో రాళ్లను కరిగించడానికి ఒక శక్తివంతమైన సంప్రదాయ ఔషధంగా తరతరాలుగా ఉపయోస్తున్నారు. ఆధునిక జీవనశైలిలో 30 సంవత్సరాలు దాటిన చాలా మందిని వేధిస్తున్న కిడ్నీలో రాళ్ల సమస్యకు ఇది ఒక అద్భుతమైన పరిష్కారం అని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. గిరిజన ప్రజలు అడవిలో దొరికే వనమూలికలను ఉపయోగిస్తున్నారట. కొండపిండి ఆకును గుర్తించడం చాలా సులభం. దీని ఆకులు బూడిద రంగులో ఉండి, అక్కడక్కడ పువ్వుల మాదిరిగా కనిపిస్తాయి. ఈ ఆకును ఏజెన్సీ ప్రాంతాల్లో లేదా గ్రామాల సమీపంలో కూడా గుర్తించవచ్చు. ఆకులను సేకరించిన తర్వాత, వాటిని జాగ్రత్తగా శుభ్రం చేసి, లేత ఆకులు, చిగుళ్లు, పూతలను మాత్రమే ఏరుకోవాలి. ఈ ప్రక్రియలో చెత్తను తొలగించడం చాలా ముఖ్యం.

కొండపిండి ఆకు కూర వండే విధానం: మొదటగా, ఆకులను శుభ్రంగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా కోసుకోవాలి. కావలసిన పదార్థాలు: ఉల్లిపాయలు, వెల్లుల్లి, పచ్చిమిర్చి, పచ్చిశనగపప్పు, జీలకర్ర. ముందుగా పొయ్యి మీద మట్టిపాత్రను పెట్టి వేడి చేయాలి. పాత్ర వేడెక్కిన తర్వాత నూనె వేసి, నూనె మరిగిన తర్వాత పచ్చిశనగపప్పు, జీలకర్ర వేసి కలుపుకోవాలి. తర్వాత వెల్లుల్లి, పచ్చి మిర్చి, ఉల్లిపాయలు వేసి బాగా వేగనివ్వాలి. ఇవి బాగా వేగిన తర్వాత తరిగిన కొండపిండి ఆకును వేసి బాగా కలపాలి. ఆకు బాగా ఉడకడానికి సరిపడా ఉప్పు (గడ్డ ఉప్పు దంచి మెత్తగా చేసి వేయడం మంచిది) వేసుకోవాలి. కూర అడుగు పడుతున్నప్పుడు కొద్దిగా నీళ్లు పోసి బాగా కలిపి ఉడికించుకోవాలి. కూర ఉడికిన తర్వాత దించుకోవచ్చు. ఆరోగ్య ప్రయోజనాలు: కొండపిండి ఆకు కూర రుచికే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. ఇది ముఖ్యంగా మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నవారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, రాళ్లను కరిగించే శక్తి ఈ ఆకుకు ఉంటుందట. అందుకే దీనిని కొండలను కూడా పిండి చేసే సత్తా ఉన్న ఆకు అని కూడా అంటారు. పురుషులలో కిడ్నీలో రాళ్లను కరిగించడంలో సహాయపడటమే కాకుండా, స్త్రీలలో గర్భసంచి సమస్యలను కూడా ఇది తొలగిస్తుందట. ఈ సంప్రదాయ పద్ధతిని పాటించడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు.

## శివరాత్రికి రేగు పండ్లను నైవేద్యంగా ఎందుకు పెడతారు?



మహా శివరాత్రి పండుగ నాడు రేగుపండ్లను నైవేద్యంగా పెడతారు. రేగి పండ్లును బదరీఫలం అంటారు. నరనారాయణులు ఈ బదరీ వృక్షం (రేగుచెట్టు) వద్ద ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారనీ, ఆ ఫలాలని తింటూ తమ తపస్సుని కొనసాగించారనీ ప్రతీతి. వారు తపస్సు చేసే సమయంలో దేవతలు వారి తలపైన రేగి పండ్లు కురిపించారట. అందుకే ఆ ప్రదేశానికి బదరీక్షేత్రం అన్న పేరు వచ్చిందని చెబుతారు. ఈ కారణంగానే ఈ పండ్లను ఎంతో పవిత్రమైనవిగా భావిస్తారు.మహా శివరాత్రికి నైవేద్యంగా పెట్టే ఈ రేగి పండ్లు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. ఆయుర్వేదం ప్రకారం రేగు పండ్లలోని సహజ లక్షణాలు శరీరాన్ని లోపలి నుంచి బలోపేతం చేస్తాయి. ఉపవాస సమయంలో శక్తిని కాపాడుకోవడానికి సహాయపడతాయి. పోషకాలతో సమృద్ధిగా ఉండే పండ్లు రేగు పండ్లు. వీటిలో విటమిన్ సి, ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఆయుర్వేద నిపుణులు కూడా రేగు పండ్లు తినడం చాలా ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. అవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. శరీరానికి అనేక ఇతర ప్రయోజనాలను అందిస్తాయి. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు ఖచ్చితంగా రేగు పండ్లను తినాలని సిఫార్సు చేస్తున్నారు. రేగు పండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇవి మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో సహాయపడతాయి. ప్రేగులను శుభ్రంగా ఉంచుతాయి. రేగు పండ్లు విటమిన్ సి కి మంచి మూలం. ఇది శరీర రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. రేగు పండ్లను క్రమం తప్పకుండా తినడం వల్ల జలుబు, దగ్గు, ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. కాలానుగుణ వ్యాధుల నుంచి కూడా రక్షణ పొందవచ్చు.రేగు పండ్లలో ఐరన్, ఇతర ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఇవి హిమోగ్లోబిన్‌ను పెంచడంలో సహాయపడతాయి. రక్తహీనతతో బాధపడేవారికి ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.రేగు పండ్లలోని యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తాయి. ముఖానికి సహజమైన మెరుపును ఇస్తాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం రేగు పండ్లలో సహజ చక్కెరలు, తక్షణ శక్తిని అందించే పోషకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల అలసట, బలహీనత, బద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు రేగు పండ్లకు దూరంగా ఉండాలి.

## క్యాబేజీ చికెన్ కర్రీ ఇలా వండి తింటే..



క్యాబేజీ చికెన్ కర్రీ వినడానికి కొత్తగా ఉన్నా ఒక్కసారి ఈ రెండింటిని కలిపి వండితే రుచి అద్భుతంగా ఉంటుంది. ఇలా ఎప్పుడూ మీరు తిని ఉండరు, కానీ ఒకసారి ట్రై చేయండి. కావాల్సిన పదార్థాలు : పావు కిలో చికెన్, క్యాబేజీ, ఉల్లిపాయలు, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ , పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ కారం, అర టీ స్పూన్ పసుపు, ఒక టేబుల్ స్పూన్ ధనియాల పొడి, అర టీ స్పూన్ గరం మసాలా, 2 టేబుల్ స్పూన్స్ నూనె, రుచికి సరి పడినంత ఉప్పు తీసుకోవాలి. ముందుగా స్టవ్ వెలిగించి పాన్ లో నూనె వేసి అది వేడయ్యాక వేయండి ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి రంగు మారే వరకు వేయించండి.ఇక ఇప్పుడు అల్లం-వెల్లుల్లి పేస్ట్ తీసుకుని దానిలో వేసి బాగా వేయించి చికెన్ ముక్కలను వేయండి. 5 నిమిషాలు తర్వాత పసుపు, ఉప్పు వేసి బాగా ఉడికించండి. చికెన్ ముక్కలు ఉడికిన తర్వాత క్యాబేజీని వేసి బాగా కలపండి. అలాగే పొయ్యి మీదే 10 నిముషాలు ఉంచి బాగా మగ్గనివ్వండి. కారం, మసాలా పొడులు వేసి బాగా కలుపుకోండి. గ్రేవీ తినాలనుకునే వారు ఒక గ్లాస్ నీళ్ళు పోసి 10 నిముషాలు అలాగే ఉంచండి. క్యాబేజీ, చికెన్ ఉడికిన తర్వాత దించే ముందు కొత్తిమీర వేసి కిందకు దించేయండి.

# బిజినెస్

## మరో హెల్త్ బ్రాండ్ కొనుగోలు చేసిన రిలయన్స్




రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ వ్యాపార విస్తరణలో దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఇటీవల ఆస్ట్రేలియాకు చెందిన గుడ్ నెస్ గ్రూపులో మెజారిటీ వాటాను దక్కించుకున్న రిలయన్స్, తాజాగా తమిళనాడుకు చెందిన సదరన్ హెల్త్ ఫుడ్స్ ను రూ.156.42 కోట్లకు కొనుగోలు చేసింది.దీంతో మిల్లెట్ ఆధారిత ఆహార ఉత్పత్తుల రంగంలోకి రిలయన్స్ ప్రవేశించింది. మన్నా బ్రాండ్ పేరుతో ఈ సంస్థ రెండు దశాబ్దాలుగా ఆరోగ్య ఆహార ఉత్పత్తులను అందిస్తోంది. ఈ కొనుగోలుతో రిలయన్స్ తన వ్యాపార పోర్ట్ ఫోలియోను మరింత విస్తరిస్తోంది.ఈ సంస్థకు చెందిన మన్నా బ్రాండ్ పేరుతో మొత్తం పాతిక కంటే ఎక్కువ ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందిస్తోంది. చిన్నారుల నుంచి అన్ని వయసుల వారికి అందుబాటులో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆరోగ్యం మీద ఎక్కువ శ్రద్ధ చూపుతున్న ప్రజల తీరుకు అనుగుణంగా ఈ సంస్థ కొనుగోలు ఉన్నట్లుగా చెబుతున్నారు. ప్రస్తుతం తమిళనాడు.. దక్షిణాది రాష్ట్రాల్లో బలంగా ఉన్న మన్నా బ్రాండ్ రానున్న రోజుల్లో దేశ వ్యాప్తంగా పాపులర్ చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లుగా చెబుతారు. ఇక్కడో ఆసక్తికర అంశాన్ని చెప్పి ముగించాలి. గడిచిన ఐదేళ్ల కాలంలో పాతిక కంటే ఎక్కువ సంస్థల్ని రిలయన్స్ ను కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.లక్ష కోట్లను వినియోగించింది.

## తగ్గిన క్రెడిట్ కార్డ్ చెల్లింపులు



పండగ సీజన్ ముగియడంతో క్రెడిట్ కార్డు ద్వారా చేస్తున్న ఖర్చులు తగ్గుముఖం పట్టాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) తాజా గణాంకాల ప్రకారం, గతేడాది డిసెంబర్‌లో క్రెడిట్ కార్డు ఖర్చులు అంతకుముందు ఏడాదితో పోలిస్తే 8.9 శాతం తగ్గింది. విలువ పరంగా క్రెడిట్ కార్డు ఖర్చులు రూ. 2.05 లక్షల కోట్లుగా ఉన్నాయి. అయితే, నెలవారీ ప్రాతిపదికన నవంబర్‌లో కంటే వీటి ఖర్చులు 8.4 శాతం పెరిగాయి. ఖర్చులు ఎక్కువగానే ఉన్నప్పటికీ, క్రెడిట్ కార్డుల వాడకం తక్కువగా ఉందని ఆర్‌బీఐ డేటా సూచిస్తోంది. నెలవారీగా పెరిగేందుకు ఈ-కామర్స్ కార్యకలాపాలు, అధిక ప్రయాణ గిరాకీ దోహదపడ్డాయి. డిసెంబర్ నెలలో ఒక్కో క్రెడిట్ కార్డు నెలవారీ సగటు ఖర్చు 8 శాతం పెరిగి రూ. 17,712కి పెరిగింది. ఇక, క్రెడిట్ కార్డుల విస్తరణ స్థిరంగా కొనసాగుతోంది. డిసెంబర్ నాటికి క్రెడిట్ కార్డుల సంఖ్య 11.6 కోట్లకు పెరిగింది. అంతకుముందు ఏడాది ఇదే నెలలో 10.8 కోట్లు ఉన్నాయి. మొత్తం క్రెడిట్ కార్డ్ ఖర్చుల్లో ప్రైవేట్ రంగ బ్యాంకులు 72.5 శాతం వాటాను కలిగి ఉన్నాయి. అయితే, అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఈ వాటా 3.75 శాతం తగ్గింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రం ఖర్చుల వాటాను 17.7 శాతం నుంచి 22.2 శాతానికి పెంచుకున్నాయి.

## రూ.100, రూ.500 నోట్లు మారబోతున్నాయా..

# ఆర్బీఐ చేయబోతున్న మార్పులేంటి

దేశంలో ప్రస్తుతం ఎక్కువగా వినియోగిస్తున్న కరెన్సీ రూ.100, రూ.500. అయితే, ఈ నోట్లు త్వరలో మారబోతున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఏడాది కరెన్సీ నోట్ల విషయంలో కీలక మార్పులు తీసుకునే ఆర్బీఐ రూ.100, రూ.500 నోట్లలో మార్పులు తీసుకురానుంది. అలాగని పాత నోట్లను ఆర్బీఐ రద్దు చేయడం లేదు. కాబట్టి, వినియోగదారులు కంగారు పడాల్సిన అవసరం లేదు. మార్కెట్లో చెలామణిలో ఉన్న నోట్ల విషయంలో సెక్యూరిటీ, ఎక్కువ కాలం మన్నిక వంటి అంశాల్లో ఆర్బీఐ సమీక్ష చేస్తుందనే సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా రూ.100, రూ.500 నోట్లలో మార్పులు చేయాలని నిర్ణయం తీసుకుంది. చాలా కాలంగా ఈ నోట్లు చెలామణిలో ఉండటంతో కొన్ని చిరిగిపోవడం, రంగు పాలిపోవడం, ప్రింటెడ్ ఫీచర్లు సరిగ్గా కనిపించకపోవడం, సెక్యూరిటీ ఫీచర్లను గుర్తించలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే నకిలీ నోట్లు కూడా చెలామణిలో ఉన్నాయి. దీంతో కొత్తగా మరింత సెక్యూరిటీ కలిగిన నోట్లను తీసుకురానున్నారు. రూ.100 నోట్లకు సంబంధించి రీ డిజైన్ అంటూ లేదు కానీ, పాత నోట్లలోనే కొన్ని కొత్త మార్పులు చేస్తారు. ప్రింట్‌లో నాణ్యత, ఇంకు ఎక్కువ కాలం ఉండటం, వాటర్ మార్క్, సెక్యూరిటీ థ్రెడ్‌ను మరింత నాణ్యతగా తీర్చిదిద్దుతున్నారు. దీనివల్ల ఆ నోట్లను ఒరిజినలా కాదా అని సులభంగా గుర్తించవచ్చు. ఎక్కువ కాలం మన్నేలా, మడత పెట్టినా త్వరగా పాడవకుండా ఉండేలా ఈ నోట్లు ఉంటాయి. ముఖ్యంగా నోట్ల లైఫ్ టైం పెరిగేలా చేస్తున్నారు. దీనివల్ల



తరచూ కొత్త నోట్లు ముద్రించాల్సిన ఖర్చు తగ్గుతుంది. కొత్త నోట్లు పాత డిజైన్‌లోనే ఉన్నా.. ప్రతి డీటైలింగ్ సులభంగా, స్పష్టంగా గుర్తించేలా ఉంటుంది. రూ.500 నోట్లకు సంబంధించి డిజైన్‌లో స్వల్ప మార్పులున్నాయి. నోట్ల కలర్ మరింత స్పష్టంగా, మైక్రో డీటైల్స్‌తో రానున్నాయి. కొత్త నోట్లతో ఏటీఎంలలో కూడా ఎలాంటి సమస్యలు రావని ఆర్బీఐ చెబుతోంది. పాత నోట్లతోపాటు, కొత్త నోట్లను కూడా ఏటీఎంలలో యాక్సెప్ట్ చేస్తారని తెలిపింది. ప్రజలు కొత్త నోట్లతోపాటు పాతవాటిని కూడా నిరభ్యంతరంగా వాడుకోవచ్చు. కొత్త నోట్లలో ప్రధానంగా సెక్యూరిటీ పరమైన మార్పులే కనిపిస్తాయి.

# ఉచితంగా రూ.1000 ఫాస్ట్‌ట్యాగ్ రీఛార్జ్!

జాతీయ రహదారులపై ప్రయాణించే.. ప్రయాణికులకు మరింత సౌకర్యం & పరిశుభ్రత కల్పించాలనే లక్ష్యంతో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ఓ కొత్త కార్యక్రమం ప్రారంభించింది. దీని ద్వారా రూ. 1000 విలువైన ఫాస్ట్‌ట్యాగ్ రీచార్జ్ ఉచితంగా పొందవచ్చని ప్రకటించింది. దీనికి సంబంధించిన ఒక ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎన్‌హెచ్ఏఐ 'క్లీన్ టాయిలెట్ పిక్చర్ ఛాలెంజ్' పేరుతో ప్రారంభించిన ఈ కార్యక్రమం 2026 జూన్ 30 వరకు కొనసాగుతుంది. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం ఏమిటంటే.. జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాలలోని మరుగుదొడ్ల పరిశుభ్రతను మెరుగుపరచడం. జాతీయ రహదారులపై ప్రయాణించే వారిలో చాలామంది.. టోల్ ప్లాజాలలో ఉన్న మరుగుదొడ్లను ఉపయోగిస్తున్నారు. అయితే కొన్ని చోట్ల పరిశుభ్రత లోపించడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఎన్‌హెచ్ఏఐ ప్రజల సహకారం కోరుతోంది. కాబట్టి ఎవరైనా.. టోల్ ప్లాజాలలో మరుగుదొడ్డి అపరిశుభ్రంగా ఉందని గమనిస్తే.. ఫోటో తీసి రాజ్‌మార్గయాత్ర యాప్ లేటెస్ట్ వెర్షన్ ద్వారా జియో-ట్యాగ్




చేసిన ఫోటోలను పేరు, ప్రదేశం, వెహికల్ రిజిస్ట్రేషన్ నంబర్ & మొబైల్ నంబర్‌తో సహా వివరాలతో అప్‌లోడ్ చేయాలి. సంబంధిత అధికారులు ఫోటోలను పరిశీలించి.. సమాచారం నిజమని ధ్రువీకరిస్తే, ఫోటోలను షేర్ చేసిన వారి వెహికల్ నెంబర్‌కు రూ. 1000 విలువైన ఫాస్ట్‌ట్యాగ్ రీఛార్జ్ బహుమతిగా లభిస్తుంది. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని.. రహదారులపై పరిశుభ్రతను మెరుగుపరచడానికి సహకరిస్తారని ఎన్‌హెచ్ఏఐ భావిస్తోంది.

## టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాకు షాక్..

# జింబాబ్వే సంచలన విజయం

**కొలంబో:** టీ20 వలర్డ్‌కప్‌లో సంచలన నమోదు అయ్యింది. కొలంబోలో ఇవాళ జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 23 రన్స్ తేడాతో జింబాంబే విక్టరీ కొట్టింది. జింబాబ్వే క్రికెటర్లు అద్భుతమైన ఆటను ప్రదర్శించారు. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 169 రన్స్ చేసింది. జింబాబ్వే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ అత్యధికంగా 64 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు ఉన్నాయి. జింబాబ్వే బ్యాటర్లలో మరుమని 35, ర్యాన్ బర్ల్ 35, సికందర్ రాజా 25 రన్స్ స్కోరు చేశారు. జింబాబ్వే 15 ఓవర్లలో వికెట్ నష్టానికి 125 రన్స్ చేసి భారీ స్కోరు దిశగా అడుగులు వేసింది. కానీ ఆసీస్ బౌలర్లు రాణించడంతో చివరి అయిదు ఓవర్లలో జింబాబ్వేకు 44 రన్స్ మాత్రమే వచ్చాయి. జింబాబ్వే విసిరిన టార్గెట్‌ను అందుకునే క్రమంలో ఆస్ట్రేలియా చేతులెత్తేసింది. అనూహ్య రీతిలో ఓటమిని ఎదుర్కొన్నది. 19.3 ఓవర్లలో 146 రన్స్ చేసి ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మాట్ రెన్‌షా 65, మ్యాక్స్‌వెల్ 31 రన్స్ చేశారు. జింబాబ్వే బౌలర్లలో ముజర్‌బానీ 4, బ్రాడ్ ఇవాన్స్ 3 వికెట్లు తీసుకున్నారు. చేజింగ్‌లో కేవలం 29 రన్స్‌కే నాలుగు వికెట్లు కోల్పోయింది ఆస్ట్రేలియా.ఆ తర్వాత అయిదో వికెట్‌కు మ్యాక్స్‌వెల్, రెన్‌షా 77 రన్స్ జోడించారు. కానీ ఆసీస్ మేటి




బ్యాటర్లు జట్టుకు విజయాన్ని అందించలేకపోయారు. 4 ఓవర్లలో 17 రన్స్ ఇచ్చి 4 వికెట్లు తీసుకున్న ముజరబానీ .. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. టీ20 క్రికెట్‌లో అతను వంద వికెట్ల తీసుకున్న బౌలర్‌గా నిలిచాడు.

## పాక్‌తో మ్యాచ్‌లో అభిషేక్ ఆడే అవకాశం ఉంది : వరుణ్ చక్రవర్తి

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్‌కప్‌లో ఆదివారం పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడే అవకాశాలు ఉన్నట్లు భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తెలిపాడు. కడుపు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న అభిషేక్.. గురువారం నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఆడని విషయం తెలిసిందే. అయితే అభిషేక్ శర్మ ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉన్నట్లు వరుణ్ చెప్పాడు. ఆరోగ్యం క్షీణించడం వల్ల రెండు రోజుల పాటు అభిషేక్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అభిషేక్‌తో మాట్లాడానని, అతను బాగానే ఉన్నాడని, ఇవాళ కొంత ప్రాక్టీస్ చేశాడని, సిద్ధం అవుతున్నట్లు అతను చెప్పాడని వరుణ్ చక్రవర్తి పేర్కొన్నాడు.

నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి రెండు ఓవర్లు వేసి 7 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. ఆ మ్యాచ్ టాస్ వేసిన సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఒకటి లేదా రెండు మ్యాచ్‌లు అభిషేక్ శర్మ మిస్సయ్యే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. అభిషేక్ శర్మ గైర్హాజరీలో నమీబియాతో మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనింగ్ బాధ్యతలు చేపట్టాడు. వరల్డ్‌కప్‌లో ఇండియా వరుసగా తన రెండో



మ్యాచ్ నెగ్గింది. నమీబియాపై 93 రన్స్ తేడాతో నెగ్గింది. ఒకవేళ కొలంబోలో జరిగే ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ పాల్గొంటే అతను పాక్‌తో మ్యాచ్‌కు ఆడేది లేనిది తేలే అవకాశం ఉంటుంది. నెట్స్‌లో చాలా సమయం అతను బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. దాని ఆధారంగా ఇండోపాక్ మ్యాచ్‌పై క్లారిటీ వస్తుంది.

# స్పోర్ట్స్

## క్రికెట్ అభిమానులకు బ్యాడ్‌న్యూస్!



అవాంతరాలన్నీ తొలగి భారత్- పాకిస్తాన్ మ్యాచ్ నిర్వహణకు మార్గం సుగమమైంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి జోక్యంతో దిగివచ్చిన పాకిస్తాన్ క్రికెట్ బోర్డు తాము టీమిండియాతో ఆడతామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో దాయాదుల పోరును వీక్షించాలని ఉవ్విళ్లూరుతున్న అభిమానులకు ఓ చేదు వార్త. సాంకేతికంగా మ్యాచ్ నిర్వహణకు లైన్ క్లియర్ అయినా.. వాతావరణం ఇందుకు సహకరించేలా కనిపించడం లేదు. కాగా టీ20 ప్రపంచకప్-2026 టోర్నీ ఫిబ్రవరి 7న భారత్- శ్రీలంక వేదికగా మొదలైన విషయం తెలిసిందే. మొత్తంగా ఇరవై జట్లు పాల్గొంటున్న ఈ ఐసీసీ ఈవెంట్లో గ్రూప్-'ఎ' నుంచి భారత్, పాకిస్తాన్, అమెరికా, నమీబియా, నెదర్లాండ్స్ పోటీపడుతున్నాయి. ఇందులో భాగంగా టీమిండియా అమెరికా, నమీబియాలపై గెలుపొందగా.. పాక్ జట్టు నెదర్లాండ్స్, అమెరికాలపై జయభేరి మోగించింది. ఫలితంగా గ్రూప్-ఎ నుంచి చెరో రెండు విజయాలతో భారత్- పాక్ తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. చెరో నాలుగు పాయింట్లతో సమంగా ఉన్నా.. నెట్ రన్‌రేటు పరంగా భారత్ (+3.050).. పాకిస్తాన్ (+0.932) కంటే అత్యంత పటిష్ట స్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో ఇరుజట్లు ఫిబ్రవరి 15న తలపడాల్సి ఉంది.

**వాన పడే అవకాశం**

శ్రీలంకలోని కొలంబోలో గల ఆర్.ప్రేమదాస స్టేడియంలో ఆదివారం రాత్రి ఏడు గంటలకు భారత్- పాక్ మధ్య మ్యాచ్ ఆరంభం కానుంది. అయితే, ఈ దాయాదుల పోరుకు వరణుడు ఆటంకం కలిగించే అవకాశం ఉంది. ఆక్యూవెదర్ నివేదిక ప్రకారం.. కొలంబోలో ఆదివారం ఉదయం వర్షం కురిసేందుకు 93 శాతం అవకాశం ఉంది. అంతేకాదు.. 26 శాతం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడేందుకు ఆస్కారం ఉంది. అయితే, సాయంత్రానికి పరిస్థితి మెరుగుపడే అవకాశాలూ కూడా ఉన్నాయి. వాన పడే ఛాన్స్ 13 శాతానికి తగ్గనుందని ఆక్యూవెదర్ వెల్లడించింది.

**యూటర్న్ తీసుకున్న పాక్**

ఇక మ్యాచ్ మొదలయ్యే సమయానికి వాన తగ్గే అవకాశం ఉన్నా.. ఒకవేళ రోజంతా వర్షం కురిస్తే అవుట్‌ఫీల్డ్ చిత్తడిగా మారే ప్రమాదం ఉంది. ఇది కూడా మ్యాచ్‌పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు. ఇదిలా ఉంటే.. టీ20 ప్రపంచకప్ టోర్నీల్లో ఇప్పటి వరకు పాక్‌తో ఎనిమిది సార్లు ముఖాముఖి తలపడ్డ భారత్ 7-1 (విజయాలు)తో ఆధిపత్యం కొనసాగిస్తోంది. కాగా బంగ్లాదేశ్‌కు మద్దతుగా తాము కూడా టీ20 వరల్డ్‌కప్-2026 బహిష్కరిస్తామంటూ పాక్ తొలుత ప్రగల్బాలు పలికిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కేవలం భారత్‌తో మాత్రమే ఆడమంటూ నాటకాలు ఆడగా.. ఐసీసీ రంగంలోకి దిగడంతో యూటర్న్ తీసుకుంది.





## ‘జైలర్ 2’ రిలీజ్‌పై సందిగ్ధం.. ఆగస్టులో నానితో బాక్సాఫీస్ పోటీ తప్పదా?

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా వచ్చిన పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జైలర్ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ రూపొందించిన ఈ చిత్రం దాదాపు రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించి తలైవా కెరీర్‌లోనే బెస్ట్ హిట్స్‌లో ఒకటిగా నిలిచింది. దీంతో ఇప్పుడు సీక్వెల్ ‘జైలర్ 2’ పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదట ఈ సినిమాను జూన్ 12న విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం రిలీజ్ వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. షూటింగ్ చివరి దశలో ఉండగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు, ప్రమోషన్స్ వంటి కారణాలతో విడుదల తేదీ మారవచ్చని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారన్న టాక్ వినిపిస్తున్నప్పటికీ, అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు. ఈ సీక్వెల్‌లో మొదటి భాగంలో నటించిన కీలక తారాగణమే మళ్లీ కనిపించనున్నారు. రజనీకాంత్‌కు జోడిగా రమ్యకృష్ణ నటించగా, ముఖ్య పాత్రల్లో ఎస్ జే సూర్య, యోగి బాబు, మోహన్ లాల్, జాకీ ష్రాఫ్, శివరాజ్ కుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తుండగా, సన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.మొదటి భాగంలో విగ్రహాల దొంగల ముఠాతో ఓ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ కుటుంబానికి ఎదురైన సమస్యలు, ఆ ముఠా నాయకుడితో జరిగిన తలపడి కథ ముగిసింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు సీక్వెల్‌లో చూపించనున్నట్లు సమాచారం. ఇక ఆగస్ట్ 21 రిలీజ్ టాక్ నేపథ్యంలో బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే రోజున నేచరల్ స్టార్ నాని నటిస్తున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా ది ప్యారడైజ్ కూడా విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో పలుభాషల్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఒకవేళ రెండు సినిమాలు ఒకే రోజున విడుదలైతే బాక్సాఫీస్ వద్ద హీట్ పెరగడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ‘డాన్ 3’లో నేను లేను.. క్లారిటీ ఇచ్చిన హృతిక్ రోషన్



బాలీవుడ్ యాక్షన్ ఫ్రాంచైజీ ‘డాన్ 3’ చుట్టూ గత కొద్దిరోజులుగా సాగుతున్న ఉత్కంఠకు స్టార్ హీరో హృతిక్ రోషన్ ఎట్టకేలకూ తెరదించారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి రణ్‌వీర్ సింగ్ తప్పుకున్న అనంతరం ఆయన స్థానంలో హృతిక్ నటించబోతున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగిన విషయం తెలిసిందే. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని హృతిక్ స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం చిత్ర బృందం తనను ఎప్పుడూ సంప్రదించలేదని, కేవలం పుకార్ల ఆధారంగానే ఇలాంటి వార్తలు పుట్టుకొస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రకటన వెలువడే వరకు ఇటువంటి నిర్ధారణ లేని వార్తలను ప్రసారం చేయవద్దని ఆయన మీడియాకు విజ్ఞప్తి చేస్తూ, అనవసరపు చర్చలకు ముగింపు పలికారు. అసలు ఈ వివాదం రణ్‌వీర్ సింగ్ ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారనే వార్తలతో మొదలైంది. రణ్‌వీర్ తప్పుకోవడం వల్ల తమకు సుమారు రూ. 40 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని నిర్మాతలు ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడ్యూసర్స్ గిల్డ్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. అయితే, సరైన స్క్రిప్ట్ సిద్ధంగా లేకపోవడం వల్లే రణ్‌వీర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.



## రెండున్నరేళ్లు గడిచిపోయాయి.. ఈ ఏడాదైనా వస్తుందా?

ఎంత పెద్ద స్టార్ హీరో అయినా సరే కొన్నిసార్లు సినిమా కష్టాలు తప్పవు. చిరంజీవి ‘విశ్వంభర‘ సరిగ్గా ఇలాంటి స్థితిలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే ఈ మూవీ ఒకటుందని జనాలు ఇప్పటికే మర్చిపోయారు. మూవీ టీమ్ నుంచి కూడా ఎలాంటి అప్‌డేట్ లేదు. అసలు ఈ చిత్రం ఈ ఏడాదైనా రిలీజ్ అవుతుందా? ఇంతకీ అసలేం జరుగుతోంది? ‘బింబిసార‘ లాంటి సక్సెస్ తర్వాత వశిష్ఠ.. చిరంజీవితో కలిసి కొత్త మూవీ చేసేందుకు సిద్ధమయ్యాడు. 2023లో చిరు పుట్టినరోజు సందర్భంగా ప్రాజెక్టుని ప్రకటించారు. అక్టోబరు నుంచి షూటింగ్ కూడా మొదలుపెట్టారు. 2024లో ఎప్పుడైతే గ్లింప్స్ పేరిట ఓ వీడియో వదిలారో అప్పటి నుంచి కష్టాలు మొదలయ్యాయి. గ్లింప్స్‌పై విపరీతమైన ట్రోలింగ్, విమర్శలు వచ్చాయి. దెబ్బకు మూవీ టీమ్‌కి సీన్ అర్థమైపోయింది. గతేడాది ఓ పాట, కొత్త గ్లింప్స్ అని మరికొన్ని అప్‌డేట్స్ వచ్చాయి గానీ పెద్దగా వర్కౌట్ కాలేదు. బజ్ రాలేదు. మరోవైపు దీని తర్వాత చాన్నాళ్లకు అనిల్ రావిపూడితో చిరంజీవి ఓ సినిమా ప్రకటించారు. ‘మన శంకరవరప్రసాద్‘ పేరుతో గత నెలలో సంక్రాంతికి రిలీజ్ చేస్తే అద్భుతమైన హిట్ కొట్టింది. ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో కొత్త మూవీ చేసేందుకు చిరు రెడీ అయిపోతున్నారు. మెగా ఫ్యాన్స్ కొత్త ప్రాజెక్టు గురించి ఆనందపడిపోతున్నారు. దీని గురించి రూమర్స్ చాలానే వస్తున్నాయి. ఇది కూడా వచ్చే ఏడాది సంక్రాంతి టార్గెట్‌గా తీస్తున్నారని అంటున్నారు. అదే టైంలో ‘విశ్వంభర‘ గురించి చిన్న సౌండ్ కూడా లేదు. తాజాగా ‘విశ్వంభర‘ నిర్మాతలే తీసిన ‘కపుల్ ఫ్రెండ్లీ‘ విడుదల సందర్భంగా నిర్మాతలు.. చిరు సినిమా గురించి మాట్లాడట్లేదు. ‘కపుల్ ఫ్రెండ్లీ‘ టీమ్‌తో ప్రమోషనల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు వశిష్ఠ కూడా ‘విశ్వంభర‘ రిలీజ్ గురించి త్వరలో చెబుతాం అంటున్నాడే తప్ప ఈ ఏడాది వస్తుందా కనీసం వచ్చే ఏడాది వస్తుందా లాంటివి క్లారిటీ ఇవ్వట్లేదు. చూస్తుంటే గ్రాఫిక్స్ విషయంలో ఇంకా సందిగ్ధత అలానే కొనసాగుతున్నట్లు రూమర్స్ వస్తున్నాయి. ఆ రిపేర్లు ఎప్పుడు పూర్తవుతాయో? బొమ్మ ఎప్పుడు బయటకు వస్తుందనేది అంతుచిక్కని ప్రశ్నలా మారిపోయింది?




## బ్రేకప్‌పై సాయి ధరమ్ తేజ్ సరదా కామెంట్స్ వైరల్ హీరోయిన్ ఎవరోనంటూ నెటిజన్ల ఆరా

మెగా హీరో సాయి ధరమ్ తేజ్ తాజాగా చేసిన బ్రేకప్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. యంగ్ హీరో సుహాస్ నటిస్తున్న తాజా చిత్రం హే భగవాన్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న తేజు, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక సరదా వ్యాఖ్యతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ ఈవెంట్‌లో దర్శకుడు రామ్ అబ్బరాజు కూడా హాజరుకావడంతో స్టేజ్‌పై జరిగిన సంభాషణ మరింత వినోదంగా మారింది. తేజు మాట్లాడుతూ తన లవ్ స్టోరీ బ్రేకప్ కావడానికి కారణం రామ్ అబ్బరాజునేనని నవ్వుతూ చెప్పడంతో ఆడిటోరియంలో నవ్వులు పూశాయి. రామ్ అబ్బరాజు కూడా అదే సరదా టోన్‌లో స్పందిస్తూ “ఆవిడ ఒక హీరోయిన్‌డ ఆమె భాష కూడా మాకు రాదు” అంటూ హింట్ ఇవ్వడంతో అక్కడ ఉన్నవాళ్లు కాసేపు షాక్ అయ్యి వెంటనే నవ్వుల్లో మునిగిపోయారు. వీరిద్దరి మధ్య ఉన్న స్నేహం, చనువు ఈ సంభాషణలో స్పష్టంగా కనిపించింది. రామ్ అబ్బరాజు అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పటి నుంచే సాయి ధరమ్ తేజ్‌తో పరిచయం ఉండటంతో, ఈ జోకులు పూర్తిగా ఫ్రెండ్లీ వాతావరణంలోనే జరిగినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ తేజు చెప్పిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. “అసలు ఆ హీరోయిన్ ఎవరు?” అనే ప్రశ్న ఇప్పుడు నెటిజన్లలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం నలభై ఏళ్లకు చేరుకున్న సాయి ధరమ్ తేజ్ ఇంకా వివాహం చేసుకోకపోవడం కూడా ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. గతంలో ఆయనపై వచ్చిన కొన్ని రూమర్లు మళ్లీ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. అయితే ఈ వ్యాఖ్యలు పూర్తిగా సరదా కోణంలో చెప్పినవేనని ఆయన అభిమానులు అంటున్నారు. ఏదేమైనా ఒక సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో జరిగిన ఈ చిన్న కామెడీ సంభాషణ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తేజు స్టేజ్‌పై చేసిన ఒకే ఒక్క జోక్ ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద డిబేట్‌గా మారడం విశేషమే.

# ఈ ఒప్పందం రైతులకు ద్రోహం చేయడమే

భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, మోదీ ప్రభుత్వంపై తన దాడిని మరింత తీవ్రతరం చేశారు. ఈ ఒప్పందం భారత రైతులకు చేసిన ద్రోహమని ఆరోపిస్తూ, ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి ఐదు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ వివాదాస్పద ఒప్పందంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల జన్యుపరంగా మార్పు చేసిన (జీఎం) పంటలు, సోయా రైతులపై పడే ప్రతికూల ప్రభావాల గురించి రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రైతులకు అందుబాటులో ఉన్న రక్షణ కవచాలను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తోందని ఆరోపించారు. ఈ ఒప్పందం కేవలం నేటి సమస్య కాదని, భవిష్యత్తులో భారత వ్యవసాయ వ్యవస్థపై మరో దేశానికి దీర్ఘకాలికంగా పట్టును అప్పగించడమేనని ఆయన విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ, ప్రధాని మోదీ సమాధానం చెప్పాలంటూ రాహుల్




గాంధీ ఈ ఐదు ప్రశ్నలను లేవనెత్తారు.

1. డీడీజీ (డిస్టిల్లర్స్ డ్రైడ్ గ్రెయిన్) దిగుమతి చేసుకోవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అంటే, అమెరికా జీఎం మొక్కజొన్నల నుంచి తీసిన ధాన్యాన్ని మన పశువులకు మేపడమేనా? ఇది మన పాల పరిశ్రమను అమెరికా వ్యవసాయ వ్యవస్థతో అనుసంధానం చేయదా?
2. జీఎం సోయా నూనె దిగుమతులకు అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న మన సోయా రైతుల పరిస్థితి ఏంటి? మరోసారి ధరల పతనాన్ని వారు ఎలా తట్టుకుంటారు?
3. మీరు చెబుతున్న 'అదనపు ఉత్పత్తులు' జాబితాలో ఏముంటాయి? పప్పుధాన్యాలు, ఇతర సున్నితమైన పంటలను కూడా కాలక్రమేణా అమెరికా దిగుమతులకు తెరవాలనే ఒత్తిడికి ఇది సంకేతమా?
4. 'వాణిజ్యేతర అడ్డంకులు' తొలగించడం అంటే ఏమిటి? జీఎం పంటలపై భారత్ తన వైఖరిని నీరుగార్చాలా? సేకరణను బలహీనపరచాలా? లేదా భవిష్యత్తులో కనీస మద్దతు ధర, బోనస్‌లను నిర్వీర్యం చేయాలా?
5. ఒక్కసారి ఈ తలుపు తెరిస్తే, అది ఏటా మరింత పెద్దది కాకుండా ఎలా నివారిస్తాం? రైతులకు తగిన రక్షణ కవచాలు ఉంటాయా? లేక ప్రతి చర్చలోనూ మరిన్ని పంటలను బేరసారాలకు పెడతారా?

ఈ ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

# ట్రేడ్ డీల్స్‌లో సాధికారికంగా చర్చించే స్థాయికి భారత్ ఎదిగింది



వాణిజ్య ఒప్పందాలపై విదేశాలతో సాధికారికంగా చర్చలు జరిపే స్థాయికి భారత్ ఎదిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో తయారీరంగం, సేవారంగం, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు బలోపేతం అయినందు వల్లే భారత్‌కు ఈ సాధికారత లభించిందని ఆయన తెలిపారు. భారత్ ఇప్పటికే 38 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏ)ను కుదుర్చుకుందని ప్రధాని గుర్తు చేశారు. వస్త్ర, లెదర్, రసాయన, హస్తకళలు, రత్నాలు, ఇతర రంగాల్లోని భారతదేశ ఎంఎస్ఎంఈలకు విదేశీ మార్కెట్లను తెరిచేందుకు ఈ ఒప్పందాలు దోహదపడతాయన్నారు. ఆదివారం ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ ఈ కామెంట్స్ చేశారు. గత కొన్నేళ్ల వ్యవధిలో మునుపటి రికార్డులను అధిగమించే రేంజులో విదేశాలకు భారత్ వస్తు, ఉత్పత్తుల ఎగుమతులు జరిగాయన్నారు. భారత్‌లో ప్రస్తుతం రాజకీయ సుస్థిరత ఉందని మోదీ తెలిపారు. దేశ రాజకీయ భవితవ్యంపైనా విదేశీ ఇన్వెస్టర్లు ఇప్పుడు ఈజీగా స్పష్టమైన అంచనాకు రావొచ్చన్నారు. అందుకే వారికి భారత మార్కెట్‌పై విశ్వాసం పెరుగుతోందని ప్రధాని చెప్పారు.

### వికసిత దేశంగా ఎదగాలనే ఆరాటానికి ప్రతీక

ఈసారి పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అనేది వికసిత దేశంగా ఎదగాలనే భారత్ ఆరాటానికి ప్రతీక అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇప్పుడు కాకుంటే, ఎప్పుడూ కాదు అనే బలవంతపు భావన నుంచి ఈ కేంద్ర బడ్జెట్ రాలేదని, సన్నద్ధత, స్ఫూర్తిలతో ఏర్పడిన మేం సిద్ధం అనే భావన నుంచి ఇది వచ్చిందన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా దేశ రక్షణ రంగాన్ని ఆధునికీకరించాల్సిన బాధ్యత ప్రభుత్వం భుజస్కంధాలపై ఉందని ఆయన తెలిపారు. అందుకోసమే రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపులను పెంచామన్నారు. దేశ త్రివిధ దళాల బలోపేతం కోసం ఏం చేయడానికైనా సిద్ధమేనని మోదీ వెల్లడించారు.

### ప్రైవేటు రంగం లాభాలపై తక్కువ ఫోకస్ పెట్టాలి

“భారతదేశ తదుపరి దశ ఆర్థిక పరివర్తనలో ప్రైవేటు రంగం అత్యంత కీలకమైన పాత్రను పోషించాల్సి ఉంటుంది. ఆ రంగం నుంచి నిర్ణయాత్మక స్పందన వస్తుందని నేను ఆశిస్తున్నాను. వికసిత భారత్ దిశగా మన దేశం పయనించాలంటే ప్రైవేటు రంగం ఆవిష్కరణలు, దీర్ఘకాలిక సామర్థ్యం పెంపు, అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీ వంటి విభాగాల్లో ధైర్యంగా పెట్టుబడులను పెట్టాలి. ప్రైవేటు రంగం లాభాలను కాపాడుకోవడంపై తక్కువగా, పరిశోధన – అభివృద్ధి (ఆర్అండ్‌డీ), సప్లై చైన్, నాణ్యతలపై ఎక్కువగా ఫోకస్ పెట్టాలి. పారిశ్రామిక ఉత్పాదకత పెరిగితే, ప్రైవేటు కంపెనీల యజమానులు ఆ ఫలాలను పారదర్శకంగా కార్మికులతో పంచుకోవాలి” అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

### ఆవిష్కరణలు, సామర్థ్యం, ఉత్పాదక శక్తిని పెంచాలి

“వికసిత భారత్ సాధనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారు అనేది నా బలమైన నమ్మకం. అందుకే మహిళా సంక్షేమం విషయంలో మా ప్రభుత్వం ఎలాంటి రాజీకి తావు ఇవ్వడం లేదు. మా సర్కారు ప్రతీ నిర్ణయంలోనూ మహిళా సంక్షేమ భావన ఉండేలా చూస్తున్నాం. భారత సైనికుల సంక్షేమం అంశానికీ మేం పెద్దపీట వేస్తున్నాం. భారత్ బలంగా, సర్వసన్నద్ధంగా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మేం ఇప్పటివరకు ప్రవేశపెట్టిన అన్ని కేంద్ర బడ్జెట్‌లు దేనికవి ప్రత్యేకమైనవి. బడ్జెట్ రూపకల్పన కోసం మేం అనుసరించే ప్రమాణాలు అలాంటివి. కరోనా సంక్షోభ కాలం తర్వాత భారతదేశానికి ఎన్నో రంగాల్లో అవకాశాల తలుపులు తెరుచుకున్నాయి. ప్రోత్సాహకాలు, సుంకాల ప్రాధాన్యతలు అనేవి మన దేశ అభివృద్ధి పయనానికి ఊతాన్ని ఇవ్వగలవు. కానీ నిలకడగా అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీని ఇచ్చే సత్తా రావాలంటే వినూత్న ఆవిష్కరణలు, విశిష్ట సామర్థ్యం, భారీ ఉత్పాదక శక్తిని మనం అందిపుచ్చుకోవాలి” అని ప్రధాని మోదీ చెప్పారు.

### ఏఐ ఎకో సిస్టమ్‌కు భారత్‌లో పునాదులు

“యూపీఐ వేదిక ద్వారా ప్రజల లావాదేవీలను మేం వేగవంతం చేశాం. అందుకే భారత్ ఇప్పుడు ప్రపంచంలో డిజిటల్ లీడర్‌గా మారింది. ఏఐ టెక్నాలజీకి, ఆవిష్కరణలకు దోహదం చేసే ఎకో సిస్టమ్‌కు సైతం భారత్ పునాదులు వేస్తోంది. కంప్యూటింగ్ పవర్‌ను, డేటా సెంటర్ల మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని మనం పెంచుకుంటున్నాం. భారత చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో మౌలిక సదుపాయాల కల్పన రంగంపై ప్రత్యేక ఫోకస్ పెట్టాం. భవిష్యత్ కోసం బంగారు భారత్‌ను నిర్మిస్తున్నాం. ఈక్రమంలో ఈసారి కేంద్ర బడ్జెట్‌లో మూలధన వ్యయం కోసం రూ.12.2 లక్షల కోట్లను కేటాయించాం. 2013 కేంద్ర బడ్జెట్‌తో పోలిస్తే ఇది ఐదురెట్లు ఎక్కువ” అని ప్రధాని మోదీ వివరించారు.

# బంగ్లాదేశ్‌లో ఎన్నికలు పూర్తి... మహ్మద్ యూనస్ పరిస్థితేంటి?

బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఒక కీలక అధ్యాయం ముగిసి, కొత్త శకం ప్రారంభమవుతోంది. 2024లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా దేశాన్ని నడిపించిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్, ఎన్నికైన ప్రభుత్వానికి అధికారాన్ని బదిలీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించడంతో, ఆ పార్టీ చైర్మన్ తారిక్ రహ్మాన్ దేశ నూతన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుమారు 17 ఏళ్ల పాటు విదేశాల్లో ప్రవాస జీవితం గడిపిన ఆయన, ఇప్పుడు దేశ రాజకీయాల్లోకి పునరాగమనం చేస్తున్నారు.

ఫిబ్రవరి 17న జరగనున్న తారిక్ రహ్మాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సహా 13 దేశాల అధినేతలకు ఆహ్వానాలు పంపారు. దేశంలో స్థిరత్వం, సమగ్ర పాలన అందించి అభివృద్ధి పథంలో నడిపిస్తామని తారిక్ రహ్మాన్ ఇప్పటికే ప్రకటించారు. ఈ అధికార మార్పిడి నేపథ్యంలో, మహ్మద్ యూనస్ భవిష్యత్తుపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఆయనకు రాజ్యాంగబద్ధమైన పదవి, ముఖ్యంగా రాష్ట్రపతి పదవి ఇవ్వాలనే డిమాండ్ సోషల్ మీడియాలో బలంగా వినిపిస్తోంది. యూనస్‌కు ఉన్న అంతర్జాతీయ ఖ్యాతిని ఉపయోగించుకుని, కొత్త ప్రభుత్వం దేశ దౌత్య సంబంధాలను బలోపేతం చేసుకోవచ్చని రాజకీయ




విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. “దేశీయ వ్యవహారాలపై దృష్టి సారించే ప్రధాని, అంతర్జాతీయంగా పలుకుబడి ఉన్న రాష్ట్రపతి ఉంటే బంగ్లాదేశ్‌కు ఎంతో మేలు జరుగుతుంది“ అని ప్రముఖ కాలమిస్ట్ డేవిడ్ బెర్గ్‌మాన్ వ్యాఖ్యానించారు.

ఈ ఊహాగానాలపై బీఎన్‌పీ వర్గాలు ఆచితూచి స్పందించాయి. ఎన్‌డీటీవీతో మాట్లాడుతూ తారిక్ రహ్మాన్ సన్నిహిత సలహాదారు హుమయూన్ కబీర్, “తారిక్ రహ్మాన్ సమగ్ర పాలనకు కట్టుబడి ఉన్నారు. దేశంలోని అత్యుత్తమ మేధావుల సేవలను వినియోగించుకోవాలని ఆయన భావిస్తున్నారు. యూనస్‌తో చర్చలు జరిగాయి కానీ, ఏ పదవీ ఖరారు కాలేదు. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఉత్తమ నిర్ణయం తీసుకుంటారు“ అని పేర్కొన్నారు. అయితే, ఈ ప్రచారాన్ని మహ్మద్ యూనస్ కార్యాలయం ఖండించింది. ఆయన ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం మాట్లాడుతూ, “యూనస్‌కు రాజకీయాల్లోకి వచ్చే ఆసక్తి ఎంతమాత్రం లేదు. ఆయన ఏ రాజ్యాంగ పదవినీ ఆశించడం లేదు. తన పాత బాధ్యతల్లోకి తిరిగి వెళతారు. పేదరికం, నిరుద్యోగం, కర్బన ఉద్గారాలు లేని సమాజం అనే తన 'త్రీ జీరోస్' లక్ష్య సాధన కోసం పనిచేస్తారు. కొత్త సామాజిక వ్యాపారాలు ప్రారంభిస్తూ, యువతతో కలిసి పనిచేయడానికే ఆయన ప్రాధాన్యత ఇస్తారు“ అని స్పష్టం చేశారు. తన పరిమిత కాలంలో దేశంలో శాంతి, స్థిరత్వం తీసుకురా వడంలో యూనస్ సఫలమయ్యారని, ఇప్పుడు బాధ్యతలను కొత్త ప్రభుత్వానికి అప్పగించి రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగనున్నారని ఆయన వివరించారు. దీంతో యూనస్ రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.

## రైతులకు పూర్తి రక్షణ...


అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో భారత్ ఇటీవల కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. రైతుల విషయంలో కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేస్తూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒప్పందంలోనూ వ్యవసాయం, పాడి, మత్స్య రంగాల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గాంధీనగర్‌లో దేశంలోనే తొలి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటులో నిలబడి రాహుల్ గాంధీ రైతుల ప్రయోజనాలను కాపాడతామని మాట్లాడటం నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఇప్పుడు వాణిజ్య ఒప్పందాల గురించి అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరిగిన ప్రతి చర్చలోనూ రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగకుండా సంపూర్ణ భద్రత కల్పించారని హామీ ఇచ్చారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలుస్తూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిన మేలును అమిత్ షా వివరించారు. మన్మోహన్ సింగ్ హయాంలో కేవలం రూ. 26,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్, ప్రధాని మోదీ నాయకత్వంలో రూ. 1,29,000 కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. గత దశాబ్ద కాలంలో కనీస మద్దతు ధరకు ఆహార ధాన్యాల సేకరణ పదిహేను రెట్లు పెరిగిందని తెలిపారు. “70 ఏళ్లుగా కాంగ్రెస్ రుణమాఫీ గురించి మాట్లాడిందే తప్ప చేసిందేమీ లేదు. కానీ మా ప్రభుత్వం, రైతులు అప్పులపాలు కాకుండా ఉండేందుకు ఏటా రూ. 6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది“ అని ఆయన అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ పాడి రంగం దెబ్బతింటుందన్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. ప్రభుత్వం పాడి ఉత్పత్తి రంగాన్ని బలహీనపరచలేదని, మరింత బలోపేతం చేసిందని స్పష్టం చేశారు. అన్ని ఒప్పందాలలోనూ పాడి రంగానికి పూర్తి రక్షణ కల్పించామని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు కూడా ఈ చర్చకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గత నెలలో భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముగియడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరడం వంటి పరిణామాల నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## బంగ్లా నూతన ప్రధాని ప్రమాణ స్వీకారానికి భారత్ ప్రతినిధిగా స్పీకర్ ఓం బిర్లా



బంగ్లాదేశ్‌లో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత ప్రభుత్వం తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 17న రాజధాని ఢాకాలో జరగనున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల జరిగిన బంగ్లాదేశ్ పార్లమెంటరీ ఎన్నికల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ కీలక కార్యక్రమంలో స్పీకర్ పాల్గొనడం ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న బలమైన, చిరకాల స్నేహానికి నిదర్శనమని విదేశాంగ శాఖ తెలిపింది. “చరిత్ర, సంస్కృతి, పరస్పర గౌరవంతో ముడిపడి ఉన్న పొరుగు దేశంగా, తారిఖ్ రెహమాన్ నాయకత్వంలో ఏర్పడుతున్న ఎన్నికైన ప్రభుత్వాన్ని భారత్ మనస్ఫూర్తిగా స్వాగతిస్తోంది. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్న బంగ్లాదేశ్‌కు మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది“ అని ప్రకటనలో పేర్కొంది. ఫిబ్రవరి 12న 300 స్థానాలకు గాను 299 స్థానాలకు పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఇప్పటివరకు ప్రకటించిన ఫలితాల ప్రకారం, బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకుంది. మరోవైపు, జమాత్-ఎ-ఇస్లామీ 68 స్థానాలు కైవసం చేసుకుంది. ప్రముఖ బంగ్లాదేశ్ పత్రిక 'ప్రొథోమ్ ఆలో' కథనం ప్రకారం, ఫలితాలు నిలిపివేసిన రెండు నియోజకవర్గాల్లోనూ బీఎన్‌పీ అభ్యర్థులే ఆధిక్యంలో ఉన్నారు. ఫిబ్రవరి 17న జాతీయ సంసద్ భవన్‌లో కొత్తగా ఎన్నికైన సభ్యులతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎ.ఎం.ఎం. నసీరుద్దీన్ ప్రమాణం చేయించనున్నారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు ఒక పురుషుడు ప్రధానమంత్రి కానున్నారు. అయితే, గత 18 నెలల తాత్కాలిక ప్రభుత్వ హయాంలో పెరిగిన అశాంతి, తీవ్రవాదాన్ని అధిగమించడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్‌గా నిలవనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## రష్యా చమురు కొనుగోళ్లు.. కేంద్రమంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు



రష్యా నుంచి చమురు కొనుగోలుకు సంబంధించి కేంద్ర మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు పని చేయవని ఆయన స్పష్టం చేశారు. అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో జైశంకర్ స్పందించారు. ఇంధన కొనుగోళ్ల అంశం జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. జర్మనీలోని మ్యూనిచ్ భద్రతా సమావేశంలో పాల్గొన్న ఆయన ఓ ప్రశ్నకు బదులిస్తూ, చమురు కొనుగోళ్ల విషయంలో భారత్ చాలా స్వతంత్రంగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. భారత్ తన వ్యూహాత్మక ప్రయోజనాలకు కట్టుబడి ఉందని అన్నారు. ఇంధన సమస్యల విషయానికి ప్రస్తుతం మార్కెట్ సంక్లిష్టంగా ఉందని వెల్లడించారు. చమురు కొనుగోళ్లకు సంబంధించి భారత్‌లోని కంపెనీలు యూరోప్‌తో సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలను పరిశీలిస్తాయని అన్నారు. ఖర్చులు, నష్టాలు, లభ్యతను చూసి వారి ప్రయోజనాలకు తగినట్లు కొనుగోళ్లు జరుపుతారని వెల్లడించారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137